



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 101: బుధవారం 26 నవంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




# రాష్ట్రంలో ఇక 29 జిల్లాలు

## మంత్రుల కమిటీ సిఫార్సుకు సీఎం చంద్రబాబు ఆమోదం

**ఏపీలో మరో మూడు కొత్త జిల్లాల ఏర్పాటుకు ఆమోదం**

**పోలవరం, మార్కాపురం, మదనపల్లె కేంద్రాలుగా నూతన జిల్లాలు**

**రాష్ట్రంలో 29కి పెరగనున్న మొత్తం జిల్లాల సంఖ్య**

**కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం ఏర్పాటుకు నిర్ణయం**


**మంత్రుల కమిటీ సిఫార్సులకు ఆమోదం తెలిపిన సీఎం చంద్రబాబు**

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా సౌలభ్యం కోసం మరిన్ని కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే ప్రక్రియకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం తన ఆమోదం తెలిపారు. జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రుల కమిటీ సమర్పించిన సిఫార్సులపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ఆయన, ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరగనుంది. మార్కాపురం, మదనపల్లెతో పాటు గిరిజన ప్రాంతమైన రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రతిపాదనలను త్వరలో కేబినెట్ సమావేశంలో చర్చించి, ఆమోదం పొందాక అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

**కొత్త జిల్లాల స్వరూపం ఇలా...**

పోలవరం జిల్లా: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో ఈ జిల్లా ఏర్పాటవుతోంది. రంపచోడవరం డివిజన్‌లోని రంపచోడవరం, దేవీపట్నం, వైరామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఇందులో ఉంటాయి. చింతూరు డివిజన్‌లోని యెటపాక, చింతూరు, కూనవరం,

మిగతా 2 లో



# రాయలసీమలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

**రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు**

**అధికారులతో సమీక్షలో చంద్రబాబు నిర్ణయం**

# ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు

**రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**

# ఇలాంటి కంటెంట్ వద్దు

## టీడీపీ అభిమానికి నారా లోకేశ్ హితవు

**వైఎస్ జగన్‌పై వివాదాస్పద పోస్టుపై స్పందించిన లోకేశ్**

**వ్యక్తిగత దాడులు వద్దంటూ టీడీపీ శ్రేణులకు హితవు**

**రాజకీయాల్లో హుందాతనం, గౌరవం పాటించాలని పిలుపు**

**అలాంటి కంటెంట్‌ను ఎవరూ ప్రోత్సహించవద్దని సూచన**

**అమరావతి :** రాజకీయాల్లో హుందాతనం పాటించాలని, వ్యక్తిగత దాడులకు దూరంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. వైసీపీ అధినేత జగన్‌ను కించపరిచేలా ఉన్న ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆయన

మిగతా 2 లో





# మన నాగరికత భారతదేశానికి పునాది

**మన మూలాల్లోకి తిరిగి కనెక్ట్ అవుదాం**

**అయోధ్య ధ్వజ ఆరోహణపై పవన్**

2

# పోలీస్ కస్టడీకి జోగి రమేశ్

## నేటి నుంచి నాలుగురోజులు విచారణ



**విజయవాడ :** నకిలీ మద్యం కేసులో వైసీపీ నేత జోగి రమేష్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో ఆయనను విచారించనున్నారు. ఈ మేరకు నేటి నుంచి 4 రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఎక్సైజ్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కేసులో జోగి రమేష్‌ను పోలీసులు ప్రశ్నించనున్నారు. ఈ కేసులో

మిగతా 2 లో



# ఢిల్లీ కాలుష్యంపై కేంద్రం సీరియస్

**కాలుష్య కారక వాహనాలపై చర్యకు ఆదేశం**

.. వివరాలు 3లో





# పని ఒత్తిడితో బీఎల్ఓల మృతి

**సుప్రీంను ఆశ్రయించిన పలు రాష్ట్రాలు**

**నివేదిక కోరిన కేంద్ర ఎన్నికల సంఘం**

.. వివరాలు 3లో



# భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య

**రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి**

**ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం**



**ధ్వజారోహణతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయి**

**అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోడీ**

**అయోధ్య:** భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షిగా అయోధ్య నిలిచిందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అయోధ్య రామాలయం శిఖరంపై జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిం చారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు. ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని..భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోదీ అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. కర్మ,కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మ ధ్వజం వివరిస్తుందన్నారు. పేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంతో

మిగతా 3 లో

# తిరుమల పరకామణి చోరీ కేసు

**సీఐడీ విచారణకు హాజరైన భూమన**

2



# 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి

**ఉగాదిలోగా మరో అయిదు లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం**

**మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడి**

**అమరావతి :** 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి చేసినట్లు మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడించారు. మరో అయిదు లక్షల ఇళ్లు ఉగాదిలోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రారంభం కాని ఇళ్లు 3 లక్షల 30 వేల ఇళ్లు ఉన్నాయని వివరించారు. 15.59 లక్షల ఇళ్లు ఈ అయిదేళ్ళలో


మిగతా 2 లో

# రాష్ట్రంలో ఇక 29 జిల్లాలు

మొదటి పేజీ తరువాయి

వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు. సుమారు 3.49 లక్షల జనాభాతో రంపచోడవరం కేంద్రంగా ఈ గిరిజన జిల్లా రూపుదిద్దుకోనుంది. మార్కాపురం జిల్లా: ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటు కానుంది. మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లలోని 22 మండలాలను ఇందులో చేర్చారు. మార్కాపురం డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు ఉంటాయి. కనిగిరి డివిజన్‌లోని హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు ఈ జిల్లాలో భాగం కానున్నాయి. మొత్తం 11.42 లక్షల జనాభాతో ఈ జిల్లాను ఏర్పాటు చేస్తున్నారు.

మదనపల్లె జిల్లా: అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటు కానుంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న పీలేరు, పాత మదనపల్లె రెవెన్యూ డివిజన్లలోని 19 మండలాలను ఈ జిల్లాలో చేర్చారు. మదనపల్లె డివిజన్‌లో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెదమండ్యం, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు ఉంటాయి. పీలేరు



డివిజన్‌లో సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉంటాయి. ఈ జిల్లా జనాభా సుమారు 11.05 లక్షలుగా ఉండనుంది.

**కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు**

మూడు కొత్త జిల్లాలతో పాటు, రాష్ట్రంలో పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఐదు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా సీఎం ఆమోదం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పడనున్న మదనపల్లె జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర కేంద్రాలుగా కొత్త రెవెన్యూ డివిజన్లు రానున్నాయి. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి, పెద్దహరివనంను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలం పేరును "వాసవీ పెనుగొండ మండలం"గా మార్చనున్నారు.

**ఇతర ముఖ్యమైన మార్పులు**

మంత్రుల కమిటీ సిఫార్సుల మేరకు అనేక మండలాలను, నియోజకవర్గాలను వేర్వేరు డివిజన్లు, జిల్లాల్లోకి మార్చారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపనున్నారు. అదేవిధంగా కందుకూరు నియోజకవర్గాన్ని కూడా ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూర్, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లో చేర్చనున్నారు. సామర్లకోట మండలాన్ని కాకినాడ నుంచి పెద్దాపురం డివిజన్‌లోకి మార్చనున్నారు. ఈ పునర్విభజన ప్రక్రియలో భాగంగా 17 జిల్లాల భౌగోళిక స్వరూపంలో మార్పులు చోటుచేసుకోగా, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో ఎలాంటి మార్పులూ లేవు.

## మన నాగరికత భారతదేశానికి పునాది



**అమరావతి :** మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. మేధో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేధో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

## రాయలసీమలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

**అమరావతి :** ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాయలసీమలో హార్టికల్చర్ పంటల సాగుకు సబ్సిడీలు, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌తో చేయూతను ఇచ్చే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళిక అమలుపై మంత్రులు, అధికారులతో సీఎం సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పూర్వోదయ పథకంలో భాగంగా రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా హార్టికల్చర్ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. 5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు మరింత లబ్ది కలిగేలా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. డ్రిప్, సాగునీరు, రవాణా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంచాయతీ రాజ్ రోడ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, గోడౌన్లు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించం ద్వారా హార్టికల్చర్ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టింది. మారుతున్న ఆహారపు అలవాట్లు, డిమాండ్ ఉన్న పంటల సాగు, టెక్నాలజీ వాడకం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హార్టికల్చర్ పంటలకు ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ సమావేశానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు

**అమరావతి :** లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి మొదలు పెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా కార్పోరేషన్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సిఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ-లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు సూచించారు. మొత్తంగా ఐదు రంగాలను ఈ కార్పొరేషన్ అనుసంధానించనుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్లు, అంతర్గత జలరవాణా, గిడ్డంగులను అనుసంధానిస్తూ లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడంపై ఈ ఏపీ-లింక్ దృష్టి పెట్టబోతోంది. రాష్ట్రంలోని లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు ఏపీ లింక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఈ కార్పొరేషనుకు ఒక ఎండీతో పాటు, వివిధ అనుబంధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సేవలిందిస్తారు. అలాగే సలహా కమిటీని, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను అమలు చేయడానికి జిల్లా స్థాయి సెల్స్ ఏర్పాటు చేయనున్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే హోల్డింగ్ కంపెనీ తరహాలో ఏపీ-లింక్ వ్యవహరించనుంది. ఏపీ లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని, అలాగే క్షేత్ర స్థాయిలో వివిధ రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ అందించే విషయంలో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి

మొదటి పేజీ తరువాయి



ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వమనే స్ఫూర్తితో సీఎం, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటున్నామన్నారు. గృహనిర్మాణ శాఖ విషయంలో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా కీ హ్యాండోవర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని కూడా వైసీపీ వివాదం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 8 లక్షల 627 ఇళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేవలం 6 లక్షలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రివ్యూలో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహప్రవేశం చేయిస్తామని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు కామన్ వాల్‌తో కలిపి కట్టుకోవడానికి జీవో ఇస్తామన్నారు. 8 లక్షల ఇళ్లు శాంక్షన్ అయితే 30 శాతం మాత్రమే పూర్తి చేశారని గత ప్రభుత్వంపై మండిపడ్డారు. గత వైసీపీ హయాంలో ఆప్షన్ 3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించే స్కీంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాంట్రాక్ట్ తీసుకున్న రాక్రీట్ నిర్మాణ సంస్థ.. స్కీంకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. 47 వేల 850 ఇళ్లు తీసుకుని నిర్మిస్తామని చెప్పి ఎక్కడా పూర్తి చేయలేదన్నారు. 80 కోట్ల రూపాయలు అవకతవకలు చేశారని విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. రాక్రీట్ సంస్థపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇప్పటికైనా ఆప్షన్ 3లో పేమెంట్ కింద చివరి దశలో ఉన్న నిర్మాణాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

## ఇలాంటి కంటెంట్ వద్దు



మొదటి పేజీ తరువాయి

స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎక్స్ వేదికగా ఓ టీడీపీ అభిమాని పోస్ట్ చేసిన వీడియోలో... ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నడుచుకుంటూ వెళుతుండగా.. జగన్ రోడ్డు పక్కన కూర్చుని ఓ ప్లకార్డు ప్రదర్శిస్తుండడడం చూడొచ్చు. ఆ ప్లకార్డుపై "నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వండి" అని రాసి ఉంది. ఈ పోస్టు వైరల్ కావడంతో లోకేశ్ స్పందించారు. "నా ప్రియమైన టీడీపీ కుటుంబానికి.. ఇలాంటి కంటెంట్ వెనుక ఉన్న భావోద్వేగాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ, వ్యక్తిగత దాడులు ఎప్పటికీ మంచివి కావు. మేం రాజకీయ ప్రత్యర్థులం కావచ్చు, కానీ మన చర్యలు గౌరవప్రదంగా ఉండాలి" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. "మన మద్దతుదారులతో సహా ప్రతి ఒక్కరూ ఇలాంటి కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని నేను అభ్యర్థిస్తున్నాను. విభేదాలు ఉన్నప్పటికీ హుందాతనాన్ని పాటిద్దాం. ఆంధ్రప్రదేశ్‌ను బలోపేతం చేసే నిర్మాణాత్మక రాజకీయాలపై దృష్టి సారిద్దాం" అని ఆయన కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై అనవసరమైన ట్రోలింగ్‌కు స్వస్తి పలకాలని ఆయన పరోక్షంగా సూచించారు.

**ఆదోని నియోజకవర్గం అభివృద్ధికి హామీ**

**మంత్రి నారా లోకేశ్‌తో గుడిసె ఆదికృష్ణమ్మ భేటీ**

ఆదోని నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి గుడిసె ఆదికృష్ణమ్మ తెలిపారు. మంగళగిరిలో నారా లోకేష్ ను కలిసి ఆదోనిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించామని ఆమె విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదోని జిల్లాగా ఏర్పాటుకు పునరాలోచన చేయలన్నారు. జిల్లాగా ఏర్పడే అన్ని అర్హతలు ఆదోనికి ఉందన్నారు. చాలా సంవత్సరాల నుండి ప్రజల్లో ఉన్న డిమాండ్‌ను గౌరవించాలని కోరామన్నారు. 44 గ్రామాలు కలిగి ఒకే మండలంగా ఉందని ఆదోనిని 3 మండలాలుగా విభజన చేయాలని కోరామన్నారు. పరిపాలన సులభతరం కావడానికి, ప్రజలకు సేవలు త్వరగా అందడానికి ఆదోని ప్రాంతాన్ని 3 మండలాలుగా విభజించాలని విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి కొరకు రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరామన్నారు. యువతకు ఉపాధి ఉద్యోగాలు కల్పనకు పరిశ్రమలు నెలకొల్పాలని ఆదోని పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు, స్టార్టప్ సపోర్ట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు స్థాపించాలని కోరామన్నారు. ఆరోగ్యం , విద్యా రంగాల బలోపేతం ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునికీకరించడం, కొత్త కోర్సులు అందుబాటులో ఉండేలా కాలేజీలు ఏర్పరచాలని మంత్రి లోకేష్ కు అభ్యర్థించామన్నారు. ఆదోని స్థితిగతులపై తనతో పూర్తి సమాచారం ఉందని అక్కడ ప్రజలకు మేలు కలిగేలా చర్యలు తీసు కుంటామని నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

## పోలీస్ కస్టడీకి జోగి రమేశ్

మొదటి పేజీ తరువాయి

ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావు, ఏ2గా ఉన్న అద్దేపల్లి జగన్‌మోహన్ రావు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే మొదటి నుంచి ఈ వ్యవహారం వెనుక జోగి రమేష్ ఉన్నారని, ఆయన సమక్షంలో లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై అధికారులు ఇప్పటికే అద్దేపల్లి బ్రదర్స్‌ను రెండు సార్లు విచారించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ స్కామ్‌లో జోగి రమేష్ పాత్రపై జనార్దన్ రావు, జగన్‌మోహన్ రావు ఇచ్చిన వాంగ్మూలాలను రికార్డ్ చేశారు. ఈ పరిణామల నేపథ్యంలో జోగి రమేష్‌ను 10 రోజుల పాటు కస్టడీ కోరుతూ ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. విచారించిన న్యాయస్థానం 4 రోజుల పాటు విచారించేందుకు అనుమతి ఇచ్చింది. ఏపీ లిక్కర్ స్కామ్‌లో జోగి రమేష్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఏపీ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు జోగి రమేష్ నకిలీ మద్యం గురించి వార్తలను లీక్ చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశారు. జోగి రమేష్ నకిలీ మద్యం తయారీకి ఆదేశించారని, ఆ సమాచారాన్ని వైసీపీ మీడియాకు లీక్ చేశారని అధికారులు నిర్ధారించారు. జోగి రమేష్ సూచనల మేరకే తాము నకిలీ మద్యం తయారు చేసినట్లు జనార్దన్ రావు పోలీసుల ముందు అంగీకరించిన విషయం తెలిసిందే.

## మలక్కా ప్రాంతంలో అల్పపీడనం కేంద్రీకృతం

### మరో వాయుగుండం ఏర్పడే అవకాశం

### రెండు అల్పపీడనాలతో భారీ వర్షాలకు ఛాన్స్

**విశాఖపట్నం :** బంగాళాఖాతంలో నెలకొంటున్న పరిస్థితులు వాతావరణ నిపుణులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక అల్పపీడనం కొనసాగుతుండగానే.. మరోటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు అల్పపీడనాలూ మనుగడ కోసం పోటీ పడనున్నాయి. రాబోయే రోజుల్లో రెండూ కలిసిపోయే అవకాశముంది. మలక్కా జలసంధి సమీపంలో ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి వాయుగుండంగా, గురువారంలోగా తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంపై మరోసారి వరణుడు తన ప్రతాపం చూపనున్నాడు. ఈనెలాఖరున రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. మలక్కా జలసంధి ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రాగల 6 గంటల్లో ఇది పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ అదే ప్రాంతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ తదుపరి 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుఫానుగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఉపరితల ఆవర్తన ప్రభావంతో కొమోరిన్, నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక పరిసర ప్రాంతాల్లో మరో అల్పపీడనం ఇప్పటికే కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పింది. రాబోయే 24 గంటల్లో అల్పపీడనం బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు... పలు చోట్ల భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో రైతులకు కూడా వాతావరణ అధికారులు కీలక సూచనలు చేశారు. మరో మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. అయితే తుఫాన్ తదుపరి కదలికలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గత గణాంకాల ప్రకారం.. నవంబరులో ఏర్పడే తుపాన్లు చాలావరకు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు వెళుతుంటాయి. కొన్ని మాత్రం ఏపీ, తమిళనాడు తీరాలను తాకాయి. సాధారణంగా అల్పపీడనం ఏర్పడ్డాక దాని గమనంపై దాదాపు స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు దీనిపై సరైన స్పష్టత లేదని, తుపానుగా బలపడిన తర్వాతే దీని దిశ, గమనం, తీరాన్ని తాకే కేంద్రంపై అంచనాకు రాగలమని నిపుణులు తెలిపారు.

## తిరుమల పరకామణ చోరీ కేసు

**తిరుపతి :** తిరుమల పరకామణి చోరీ కేసులో వైకాపా నేత, తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మండళవారం విచారణకు హాజరయ్యారు. విచారణకు రావాలని సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేయడంతో మంగళవారం సాయంత్రం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సీఐడీ తాత్కాలిక కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. తిరుమల శ్రీవారి పరకామణిలో 920 అమెరికన్ డాలర్లను చోరీ చేస్తూ పట్టుబడిన పరకామణి ఉద్యోగి రవిపై 2023 ఏప్రిల్ 7న కేసు నమోదైంది. అప్పట్లో తితిదే ఏవీఎస్‌వోగా పనిచేసిన సతీశ్ కుమార్ ఫిర్యాదు మేరకు తిరుమల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈకేసులో భాగంగానే భూమనను సీఐడీ అధికారులు విచారించారు.

## మంగళగిరి ఎయిమ్స్‌కు చెవిరెడ్డి తరలింపు

**విజయవాడ :** మద్యం కుంభకోణం కేసులో ఏ38గా ఉన్న వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని జైలు అధికారులు చికిత్స కోసం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో ముందుగా ఆయనను విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అయితే రెండు రోజులుగా తన కాళ్లు వాపు వస్తున్నాయని, వెరికోస్ వీయిన్స్ ఉందని జైలు అధికారులతో చెవిరెడ్డి చెప్పారు. వాస్కులర్ సర్జన్‌కు చూపించాలని కోరడంతో సాధారణ పరీక్షల నిమిత్తం ఆయన్ను నిన్న విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షల అనంతరం.. మంగళగిరిలోని ఎయిమ్స్‌కు రిఫర్ చేస్తూ సూపరింటెండెంట్ ఎయిమ్స్‌కు లేఖ రాశారు. ఎయిమ్స్ నుంచి అధికారిక అనుమతి రావడంతో ఇవాళ ఉదయం విజయవాడ జైలు నుంచి చెవిరెడ్డిని ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ పరీక్షల అనంతరం తదుపరి నిర్ణయం తీసుకునే వీలుంది.

# ఢిల్లీ కాలుష్యంపై కేంద్రం సీరియస్

**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలో కాలుష్య తీవ్రత దృష్ట్యా ప్రధానమంత్రి కార్యాలయం రంగంలోకి దిగింది. నగరంలో కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించింది. ఇదే సమయంలో విద్యుత్ వాహనాలను విస్తృతపరిచే చర్యలు ముమ్మరం చేయాలని సూచించినట్లు తెలిసింది. దిల్లీలో వాయునాణ్యత మరింత క్షీణిస్తోన్న వేళ ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దిల్లీలో ఇంకా 37శాతం పాత వాహనాలు ఉన్న విషయాన్ని ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈవీ వాహనాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఇందుకు సంబంధించి సబ్సిడీలతోపాటు ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పెట్రోల్, డీజిల్ వాహనాలను గణనీయంగా తగ్గించాలని ఆదేశించినట్లు సమాచారం.

# పని ఒత్తిడితో బీఎల్ఓల మృతి

**న్యూఢిల్లీ :** తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే అధిక పనిభారం, ఒత్తిడి కారణంగా బూత్ లెవెల్ అధికారులు పలువురు మరణించినట్టు ఆరోపణలు వస్తుండటంపై భారత ఎన్నికల సంఘం దృష్టి సారించింది. దీనిపై వివరాలు కోరుతూ 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల నుండి మంగళవారంనాడు నివేదికలను కోరింది. బీఎల్ఓలు పని ఒత్తిడి కారణంగా మరణిస్తున్నారని, ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని పలు రాష్ట్రాలు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ తాజా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ విధుల్లో ఉన్న కొందరు బీఎల్ఓలు తీవ్రమైన పనిభారం, ఒత్తడిని ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మూడు వారాల్లో 16 మంది బీఎల్ఓలు మరణించినట్టు కథనాలు రావడం కూడా రాజకీయ వివాదానికి దారితీసింది. కేంద్ర ఎన్నికల సంఘం హడావిడి ప్రక్రియపై పలు పార్టీలు విమర్శలు గుప్పించాయి. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఈ మరణాలు నమోదైనట్టు కథనాలు వచ్చాయి. బీఎల్ఓల మరణాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇవి ఎస్ఐఆర్ సంస్కరణలు కావని, బలవంతంగా రుద్దుతున్న నిరంకుశత్వమని రాహుల్ విమర్శించారు. ఈ ప్రక్రియతో ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోవాలి? ఎన్ని మృతదేహాలు చూడాలని మమతాబెనర్జీ ప్రశ్నించారు. బీఎల్ఏలకు సరైన వనరులు కల్పించకుండా హడావిడిగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించడమే ఈ మరణాలకు కారణమని అన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లోని బనగావ్‌లో మమతాబెనర్జీ మంగళవారంనాడు భారీ ర్యాలీ నిర్వహించారు.

# ఢాకాకు హసీనా అప్పగింత

**ఢాకా :** తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌ను తమకు అప్పగించాలని కోరుతు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు లేఖ పంపింది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ప్రపంచదేశాలు కూడా దీనిపై ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. హసీనా పదవీకాలంలో అనేక మంది రాజకీయ కార్యకర్తలు, విమర్శకులు అదృశ్యమయ్యారనే కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అమలులో భాగంగా భారత్‌కు బంగ్లాదేశ్ ఈ లేఖ పంపినట్లు హుస్సేన్ తెలిపారు. తీర్పు వివరాలు ఉన్న లేఖను కూడా భారత్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. అసదుజ్జమాన్‌ను కూడా మరణ శిక్ష విధించినయ విషయాన్ని కూడా భారత్‌కు తెలిపామన్నారు.. 'ఈ ఇద్దర్నీ ఆలస్యం చేయకుండా బంగ్లాదేశ్ అధికారులకు అప్పగించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింతల ఒప్పందం ప్రకారం ఇది భారతదేశంపై కూడా ఒక బాధ్యత' అని లేఖలో బంగ్లాదేశ్ పేర్కొంది. అయితే ఈ లేఖపై న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించాల్సి ఉంది. కాగా ఐటిసి తీర్పును 'గమనించాము' అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గతంలో వ్యాఖ్యానించింది.

# ఢిల్లీ పేలుడు ఘటనలో కీలక విషయాలు

## బర్హాన్ వని మృతికి ప్రతీకారంలో ఉమర్

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నవంబర్ 10వ తేదీన కారు బాంబు దాడి జరిగిన ఘటనలో ఉమర్ ఉన్ నబీ అనే డాక్టర్ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. దర్యాప్తు అధికారులు ఇప్పటి వరకు అరెస్ట్ అయిన టెర్రరిస్టులను విచారించగా పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. 2016లో భద్రతా దళాల కాల్పుల్లో టెర్రరిస్ట్ బుర్హాన్ వని చనిపోయాడు. అతడి మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని ఉమర్ భావించినట్లు సమాచారం. అతడు ఆత్మాహుతి దాడికి పాల్పడటానికి ఇది ఫరీదాబాద్ అల్ ఫలా యూనివర్సిటీకి చెందిన టెర్రరిస్ట్ డాక్టర్ ముజమిల్ షకీల్.. ఉమర్‌కు 'ఎమిర్' అన్న బిరుదు ఇచ్చాడు. ఇక, అప్పటినుంచి ఉమర్ తనను తాను మిగిలిన టెర్రరిస్టులకు ఓ పరిపాలకుడిగా.. నాయకుడిగా.. యువరాజుగా చెప్పుకునే వాడని సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న షాహీన్ సాయిద్ కూడా దర్యాప్తు అధికారులకు కీలక సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ముజమిల్ షకీల్ కూడా పోలీసుల అదుపులో ఉన్నాడు. ఉమర్‌కు తమ గ్రూపులో మంచి గౌరవం ఉందని, అతడి అనుభవం కూడా ఎక్కువేనని ముజమిల్ చెప్పినట్లు సమాచారం. ఉమర్‌తో పోల్చుకుంటే తాను ఓ సాధారణ కూలీలాంటి వాడినని ముజమిల్ చెప్పాడట. 'ఆపరేషన్ ఎమిర్' పేరుతోటే ఆత్మాహుతి దాడికి వ్యూహ రచన జరిగినట్లు ముజమిల్ వెల్లడించినట్లు తెలుస్తోంది. ముజమిల్ చెబుతున్న దాని ప్రకారం.. ఉమర్‌కు 9 భాషలు తెలుసు. టెర్రరిస్టుల గ్రూపులో అతడే తెలివైన వాడు. చనిపోయే వరకు తను మతం కోసమే ఇదంతా చేస్తున్నట్లు భావించేవాడు.

# మదనపల్లె కిడ్నీ రాకెట్ వ్యవహారం

## కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**మదనపల్లె :** అన్నమయ్య జిల్లా మదనపల్లె కిడ్నీ రాకెట్ వ్యవహారం కేసులో ఇద్దరు నిందితులను రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారిని కడప జిల్లాకు చెందిన సుమన్, కొండయ్యలుగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కిడ్నీ మార్పిడి చేస్తున్న బెంగళూరు వైద్యుడు పార్థసారథి రెడ్డికి వీరిద్దరూ అపరేషన్ థియేటర్ అసిస్టెంట్లుగా పని చేస్తారని డీఎస్పీ మహేందర్‌రెడ్డి వెల్లడించారు. మదనపల్లెలోని గ్లోబల్ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగే సమయంలో వీరు ఆస్పత్రికి వచ్చి.. పార్థసారథికి సహకరిస్తారని తెలిపారు. ఇటీవల కిడ్నీ శస్త్ర చికిత్స చేయించుకున్న యమున అనే యువతి మృతి చెందడంతో ఆస్పత్రిని మూసివేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విశాఖకు చెందిన యమున మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో గుట్టుగా కిడ్నీ మార్పిడి చేస్తుండగా మృతి చెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి

వచ్చింది. బాధితులు తిరుపతి నుంచి 112కు ఫిర్యాదు చేయగా తిరుపతి పోలీసులు మదనపల్లెకు చేరుకొని విచారణ చేపట్టారు. ఈ వ్యవహారానికి సంబంధించి మదనపల్లె రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణ ప్రారంభించింది. ఆసుపత్రికి చెందిన పలువురిని అదుపులోకి తీసుకొని విచారించారు. అప్పటి నుంచి దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో తాజాగా ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

# భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య

మొదటి పేజీ తరువాయి

శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగారో అయోధ్య చెబుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. కోట్లాది మంది కల సాకారమైంది. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించింది. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైంది. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నా. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగింది. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక. శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుంది. స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోదీ పేర్కొన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారు. అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు. ఇది మన డీఎన్ఏలోనే ఉంది. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉంది. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోంది. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి



అయోధ్య కొత్త నమూనా ఇస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా

ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంథాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

# భారత్ శాంతినే కోరుకుంటుంది

**కురుక్షేత్ర :** తమ ప్రభుత్వం శాంతిని కాంక్షిస్తోందని, కానీ.. దేశ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్ దీనికి అతిపెద్ద ఉదాహరణ అని పేర్కొన్నారు. సిక్కు గురువు గురు తేగ్ బహదూర్ 350వ బలిదాన దినం సందర్భంగా హరియాణాలోని కురుక్షేత్రలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పేరిట ప్రత్యేక నాణెం, స్మారక స్టాంపును ప్రధాని మోదీ విడుదల చేశారు. సత్యం, న్యాయం, విశ్వాసాల పరిరక్షణను తన ధర్మంగా భావించి దానికోసం గురు తేగ్ బహదూర్ జీవితాన్ని త్యాగం చేశారని చెప్పారు. ఈరోజు ఉదయం రామాయణ నగరం అయోధ్యలో ఉన్నాను. ఇప్పుడు కృష్ణుడి నేల కురుక్షేత్రపై ఉన్నాను. రామమందిరంపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన రోజు కర్తార్‌పుర్ కారిడార్ ప్రారంభోత్సవం కోసం పంజాబ్‌లోని డేరా బాబా నానక్‌కు వెళ్లాను. ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం కావాలని, రామభక్తులందరి ఆకాంక్షలు నెరవేరాలని ప్రార్థించాను. ఆ రోజు రామ మందిరానికి అనుకూలంగా తీర్పు వచ్చింది' అని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. నేడు మళ్లీ తనకు 'సిక్కు సంగత్' నుంచి ఆశీర్వాదాలు పొందే అవకాశం లభించిందన్నారు. 'సత్యం, ధర్మం పరిరక్షణకు కృష్ణ భగవానుడు నిలిచిన గడ్డ ఇది. గురు తేగ్ బహదూర్ సైతం సత్యం, ధర్మ, మత విశ్వాసాల పరిరక్షలుగా నిలిచారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని గురు తేగ్ బహదూర్ స్మారక తపాలా బిల్ల, నాణెం విడుదల చేస్తున్నందుకు భారత ప్రభుత్వం గర్విస్తోంది. గురు సాంప్రదాయాన్ని ఇదే విధంగా కొనసాగించాలని అభిలషిస్తున్నాం' అని మోదీ అన్నారు. మొఘలుల హయాంలో తేగ్ బహదూర్ ఎంతో సాహసం చూపించారని, కశ్మీరీ హిందువులను ఇస్లాంలోకి బలవం తంగా మతమార్పిడి చేస్తుంటే దానిని వ్యతిరేకించి, వారికి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఆయన జీవితం, త్యాగం, క్యారెక్టర్ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఔరంగజేబు పాలనలో కూడా తేగ్ బహదూర్ తన సిద్ధాంతాల విషయంలో ఎలాంటి రాజీ పడలేదని, మత పరిరక్షణకు తన తలను కూడా సమర్పించారని అన్నారు. కాగా, కురుక్షేత పర్యటనలో భాగంగా శ్రీకృష్ణ భగవానుడు మహాభారత యుద్ధంలో వాడిన పవిత్ర శంఖం పాంచజన్యం గుర్తుగా నిర్మించిన 'పాంచజన్య మెమోరియల్'ను ప్రధాని ప్రారంభించారు. హర్యానా ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనీ కూడా ప్రధాని వెంట పాల్గొన్నారు.

# ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్‌గా బీహార్

## రాష్ట్ర యువతకు కోటి ఉద్యోగాల కల్పన

## నితీశ్ తొలి కేబినేట్‌లో కీలక నిర్ణయాలు



**పాట్నా:** ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్'గా బీహార్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని సిఎం నితీశ్ కుమార్ నిర్ణయించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం అనంతరం నితీశ్ కుమార్ మంత్రివర్గం మంగళవారంనాడు తొలిసారి సమావేశమైంది. నితీశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర యువతకు కోటి ఉద్యోగాలు కల్పించాలని, 'సమావేశానంతరం బిహార్ చీఫ్ సెక్రటరీ ప్రత్యయ్ అమ్రిత్ ఆ వివరాలను మీడియాకు తెలిపారు. విస్తృత ఉద్యోగావకాశాల కల్పన, పారిశ్రామిక అభివృద్ధిపై సమావేశంలో కీలకంగా చర్చ జరిగినట్టు ఆయన చెప్పారు. డిఫెన్స్ కారిడార్, సెమీకండక్టర్ తయారీ పార్క్, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు, మెగా టెక్ సిటీ, ఫిట్‌నెస్ సిటీ ఏర్పాటుతో బీహార్‌ను ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్‌గా తయారు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్టు సీఎస్ తెలిపారు. న్యూఏజ్ ఎకానమీ కింద రాబోయే ఐదేళ్లలో గ్లోబల్ వర్క్‌ప్లేస్‌గా బీహార్‌ను అభివృద్ధి చేయనున్నామని, ఈ లక్ష్య సాధనకు డెడికేటెడ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్టార్టప్ డొమైన్‌లో రాష్ట్రంలోని ప్రతిభావంతులు, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా ప్రణాళికలు రూపొందించేందుకు ఒక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. ఏఐ డొమైన్‌లో కూడా బీహార్‌ను లీడింగ్ స్టేట్‌గా తీర్చిదిద్ద నున్నామని, ఇందుకు అవసరమైన ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మిషన్‌కు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సీఎస్ తెలిపారు. సోనెపూర్, సీతామర్హితో సహా 12 సిటీల్లో గ్రీన్‌ఫీల్డ్ టౌన్‌షిప్ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మూతపడిన 9 చక్కెర మిల్లులను పునరుద్ధరించాలని, 25 కొత్త మిల్లలను ఏర్పాటు చేయాలని కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని చీఫ్ సెక్రటరీ వివరించారు.

# బెంగాల్‌ను టచ్ చేస్తే అగ్నిగుండమే

## బీహార్ ప్రయోగాలు మా వద్ద పనిచేయవు

## సర్ ప్రక్రియపై కేంద్రానికి మమత హెచ్చరికలు



**కోల్‌కతా :** బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ఫలితంగానే ఎన్డీయే విజయం సాధించిందని, బీజేపీ 'గేమ్'ను అర్థం చేసుకోవడంలో విపక్షాలు విఫలమయ్యాయని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా బనగావ్ లో మంగళవారంనాడు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బెంగాల్‌లో బీజేపీ గేమ్‌లు చెల్లవని అన్నారు. 'బిహార్‌లో ఎన్నికలు జరిగాయి. పాపం..అక్కడి ప్రతిపక్ష నాయకులు బీజేపీ గేమ్‌ను గ్రహించలేకపోయారు. కానీ మాకు వాళ్ల గేమ్‌లు ఏమిటో బాగా తెలుసు. వాళ్ల ఆటలు బెంగాల్‌లో ఎంతమాత్రం సాగవు. బెంగాల్‌ను టచ్ చేయాలని చూస్తే మేము యావద్దేశాన్ని కుదిపేస్తాం' అని సీఎం తీవ్ర స్వరంతో అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో బంగ్లాదేశీ హిందువులకు సమస్యలు సృష్టించాలని అనుకుంటున్నారని, ఎస్ఐఆర్ కారణంగా 35 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లను సృష్టించేందుకు కృత్రిమ మేధస్సును వాడుతున్నారని, ఇది బీజేపీ ప్లాన్ అని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఇంత హడావిడిగా చేపట్టడాన్ని మమతా బెనర్జీ తప్పుపట్టారు. హడావిడి వ్యవహారంతో ఓటర్ల జాబితా నుంచి ప్రజలను తప్పించాలని చూస్తే బీజేపీని విడిచిపెట్టేది లేదని అన్నారు. ఇప్పటి ఓటర్ల జాబితాతోనే 2024లో ప్రధాని ఓట్లు సంపాదించారని, ఇప్పుడు అదే ఓటర్లను తప్పిస్తే.. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా తప్పించాలని అన్నారు. తాను ఇక్కడ ఉన్నంత వరకూ ప్రజలను ఓటర్ల జాబితా నుంచి ఎవరూ తప్పించలేరని స్పష్టం చేశారు. దేశంలో చొరబాటుదార్ల ప్రవేశంపై మమతా బెనర్జీ మాట్లాడుతూ, ఈ విషయంపై తనను ప్రశ్నించాల్సిన పనే లేదని, కేంద్ర ఏజెన్సీలే సరిహద్దులను నిర్వహిస్తున్నాయని అన్నారు. రైల్లు, విమానాలు, సరిహద్దుల భద్రత సెంట్రల్ ఏజెన్సీలే చూసుకుంటాయని, పాస్‌పోర్టులు, కస్టమ్స్, ఎక్సైజ్ జాగ్రత్తలు తీసుకునేది కేంద్ర ప్రభుత్వమేనని అన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# భాగ్యశ్రీతో డేటింగ్ అంతా ఉత్తిదే

## కొట్టిపడేసిన హీరో రామ్





ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ హీరోయిన్ జంటగా వస్తున్న మూవీ ఆంధ్రాకింగ్ తాలూకా నవంబర్ గీ7న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ సినిమా మొదలైనప్పటి నుంచి రామ్, భాగ్య శ్రీ డేటింగ్ లో ఉన్నారంటూ ఓ రేంజ్ లో రూమర్లు వస్తున్నాయి. ఇద్దరూ ప్రైవేట్ గా కలుసుకుంటున్నారని.. విదేశాలకు టూర్లకు వెళ్తున్నారంటూ రకరకాల రూమర్లు వస్తూనే ఉన్నాయి. ఇక మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో వరుస ప్రమోషన్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్.. దీనిపై క్లారిటీ ఇచ్చారు. డేటింగ్ రూమర్లు అన్నీ ఫేక్ అంటూ కొట్టి పారేశాడు. భాగ్య శ్రీ తనకు మంచి ఫ్రెండ్ అని క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా కోసం నేను స్వయంగా ఓ లవ్ సాంగ్ రాశాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య ఏదో ఉందని అంతా అనుకుంటున్నారు. భాగ్య శ్రీపై ఇంట్రెస్ట్ లేకుండా ఇంత మంచి సాంగ్ రాయడు కదా అని అంతా అనుకుంటున్నారు. కానీ భాగ్యశ్రీని మా సినిమా కోసం తీసుకోక ముందే ఆ పాట రాశాను. సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రల మధ్య అంత మంచి బాండింగ్ ఉంటుంది కాబట్టే ఆ పాట బాగా వచ్చింది. అంతకు మించి మా మధ్య ఏమీ లేదు. భాగ్య శ్రీ మంచి యాక్టర్ అంటూ చెప్పాడు రామ్. భాగ్య శ్రీ కూడా ఇదే విషయంపై స్పందిస్తూ.. రామ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే అని తెలిపింది. రజనీకాంత్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి చెన్నైలో పెరిగాను. ఆయన సినిమాలన్నీ చూసేవాడిని. 'బాషా' సినిమా అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సినిమాకు 100వ రోజు కూడా టికెట్స్ దొరకలేదు. చివరి నిమిషంలో రెండు టికెట్స్ దొరికాయి. దీంతో నేను మా ఫ్రెండ్ వెళ్లాం. ఆరోజు థియేటర్‌లో అభిమానులు ఆ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడం చూసి ఆశ్చర్యపోయాను. అప్పటికే వాళ్లు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి ఉంటారు. డైలాగులు కూడా తెలిసిపోయి ఉంటాయి. అయినా అందరూ ఆసక్తిగా చూడడం చూసి నేను షాకయ్యానని రామ్ తెలిపాడు. ఎవరైనా సక్సెస్ కావాలంటే వారికి రెండు ప్రధాన కారణాలు ఉంటాయి. ఎవరికి వారు తాము చేసే పని మీద శ్రద్ధ కలిగిఉండాలి. అలాగే దానికోసమే పుట్టాం అనిపించేలా చాలా కష్టపడాలి. నాకు ఆ రెండు లక్షణాలు ఉన్నాయి. అందుకే ఎప్పటికైనా విజయం సాధిస్తాననే నమ్మకం ఉందన్నాడు.



శ్రీలీల




# 28న అఖండ2 ప్రీరిలీజ్ ఈవెంట్

## ముఖ్య అతిథిగా రానున్న సిఎం రేవంత్

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబోలో అఖండకు సీక్వెల్ గా వస్తున్న చిత్రం 'అఖండగీ. ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ గీ ఫస్ట్ గ్లిమ్స్ సంచలనం సృష్టించింది. ఇటీవల వచ్చిన ఈ సినిమా ఫస్ట్ సింగిల్ జాజికాయ జాజికాయ భారీ వ్యూస్ రాబట్టిన ఈ సెన్సేషన్ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. డిసెంబర్ 5న అఖండ గీ వరల్డ్ వైడ్ గా రిలీజ్ కు రెడీ అయింది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో జోరు పెంచింది టీమ్. అందులో భాగంగానే అఖండ గీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల గీ8న నిర్వహించబోయే అఖండ గీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా రాబోతున్నారు. ఇందుకు సంబంధించి అనౌన్స్ మెంట్ కూడా రాబోతుంది. అలాగే ఈ వేడుకకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ని కూడా మరో అతిథిగా పిలిచేందుకు ప్లాన్ చేశారట మేకర్స్. కానీ బన్నీ ప్రస్తుతం అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడం వల్ల రావడం కుదరడం లేదట. సినిమా రిలీజ్ అయ్యాక సక్సెస్ మీట్ కి బన్నీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు డిసెంబరు 4న రాత్రి నుంచే ప్రీమియర్లు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గ అనుమతుల కోసం నిర్మాతలు ఎదురు చూస్తున్నారు.

# వారణాసి లెవల్లో ఎన్టీఆర్‌నీల్ మూవీ ప్రమోషన్?



వారణాసి మూవీ టైటిల్‌ను భారీ ఈవెంట్ ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. భారతీయ సినిమా ప్రమోషన్స్‌కు ఇది కొత్త నిర్వచనంగా మారింది. ఈ వినూత్న ప్రయత్నం దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, హాలీవుడ్ మీడియా దృష్టిని కూడా ఆకర్షించి గ్లోబల్ లెవెల్‌లో పెద్ద చర్చగా మారింది. సాధారణంగా టైటిల్స్‌ను పోస్టర్, గ్లింప్స్ లేదా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ప్రకటిస్తారు. కానీ వారాణాసి యూనిట్ మాత్రం పాత్రలు, కథ, థీమ్ వివరించే క్రమంలో స్టేజ్ ఈవెంట్ ఏర్పాటు చేసి ప్రమోషన్‌లో కొత్త మైలురాయి సృష్టించింది. దీనికి మంచి రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ఇదే స్ట్రాటజీని ఎన్టీఆర్‌ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న సినిమాకి ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్‌ప్రశాంత్ నీల్ మూవీ టైటిల్‌పై భారీ ఆసక్తి నెలకొనగా, మూవీకి డ్రాగన్ అనే పేరు ఖరారు చేసినట్టు టాక్ వినిపిస్తుంది. అయితే డ్రాగన్' పేరు ఇంకా నిర్ధారణ కాలేదని మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ రవి శంకర్ స్పష్టం చేశారు. డ్రాగన్ కూడా ఓ ఆప్షన్ మాత్రమే. అధికారికంగా ఏ టైటిల్ ఫైనల్ కాలేదు. ఇది పూర్తిగా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్. ప్రశాంత్ నీల్ విజన్‌లో ఎన్టీఆర్ కొత్త అవతరం చూపించబోతున్నాడు. టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ వారణాసి మాదిరిగానే ప్రాజెక్ట్‌కి తగ్గ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తామని తెలిపారు. ఫిల్మ్ ప్రమోషన్‌లో భారీ ఈవెంట్ మోడల్ ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తోంది. సినిమా థీమ్‌ను స్పష్టంగా ప్రేక్షకులకు చెప్పే అవకాశం కలుగుతుంది. ఇలా చేస్తే గ్లోబల్ ఆడియన్స్‌ను చేరుకునే అవకాశం ఉంటుంది. హాలీవుడ్ మీడియా సహా విదేశీ ప్రెస్ అటెన్షన్, తక్కువ సమయంలో భారీ బజ్ క్రియేట్ చేయగలగడం, కంటెంట్‌పై తప్పుదారులు వెళ్లకుండా క్లారిటీ ఇవ్వడం కొత్త ట్రెండ్‌ను ఆమోదించేలా చేశాయి. వారణాసి ఈవెంట్ తర్వాత భారతీయ సినీ పరిశ్రమలో 'టైటిల్ రివీల్ ఈవెంట్' అనే కొత్త ప్రమోషనల్ ట్రెండ్ ప్రారంభమైంది. అదే మోడ్‌లో ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్ట్ కూడా అడుగులు వేస్తుండటం అభిమానుల్లో భారీ అంచనాలను పెంచింది.


# రాజాసాబ్ పాటకు భారీగా వ్యూస్..లైక్స్

## మూవీపై నిర్మాతల్లో పెరిగిన విశ్వాసం



ప్రభాస్ హీరోగా పాన్ ఇండియా సినిమా ది రాజా సాబ్ పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. గత ఏడాది కల్కితో వరల్డ్‌వైడ్ బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న ప్రభాస్ సినిమాపై అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి రిలీజ్‌గా ఈ సినిమా సిద్ధమవుతుండటంతో హైప్ మరింత పెరిగింది. ఇదిలా ఉండగా, చిత్రబృందం నుంచి వచ్చిన తొలి పాట నవంబర్ గీ3 విడుదలైంది. కొంత ఆలస్యంగా వచ్చినప్పటికీ, ఆన్‌లైన్‌లో పాటకు మంచి స్పందన లభించింది. టాప్ రికార్డులను బద్దలు కొట్టకపోయినా,ఈ పాటకు వచ్చిన వ్యూస్, లైక్స్ మాత్రం ఆకట్టుకునే స్థాయిలో ఉన్నాయి. విడుదలైన తొలి గీ4 గంటల్లో ఈ పాటకు దాదాపు 14.9గీ మిలియన్ వ్యూస్, 335.4ఐ లైక్స్ వచ్చాయి. ఇది పెద్ద రికార్డ్ కాకపోయినా, ఆలస్యంగా వచ్చిన పాటకు ఇవి గుడ్ నెంబర్స్‌గా పరిగణిస్తున్నారు. ప్రభాస్ తాజాగా చేసిన సినిమాలతో పోలిస్తే, ఈ పాటలో ఆయన లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగుందని నెటిజన్లు పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా, పాట యూట్యూబ్‌లో విడుదలైన తర్వాత కేవలం గీ3 నిమిషాల్లో 100ఐ లైక్స్ చేరుకోవడం పాటకు వచ్చిన వేగవంతమైన రెస్పాన్స్‌ను సూచిస్తోంది. ఇది ప్రభాస్ క్రేజ్‌కి నిదర్శనమని అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. పాట విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీనింగ్‌కు భారీగా అభిమానులు హాజరై మాస్ సెలబ్రేషన్స్ చేశారు. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. దీంతో ది రాజా సాబ్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. త్వరలో రానున్న ట్రైలర్, మిగతా పాటలు ఎలా ఉండబోతున్నాయి, సంక్రాంతి సీజన్‌లో ఈ సినిమా ఎంతటి మాస్ స్టార్మ్ సృష్టించబోతుందో అనే ఆసక్తి పెరుగుతోంది.

# 28న నెట్‌ఫ్లిక్స్‌లో మాస్ జాతర



మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా కనిపించిన ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహించాడు. అక్టోబరు 31న ప్రీమియర్స్ తో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. కానీ ప్రీమియర్ షో నుండే ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. రొటీన్ రెగ్యులర్ కథ, బోరింగ్ స్క్రీన్ ప్లేతో ఆడియెన్స్ కు విసుగుతెప్పించాడు దర్శకుడు. రాజేంద్ర ప్రసాద్ క్రింజ్ కామెడి నవ్వుతెప్పించకపోగా విసిగించింది. కనీసం మినిమం వసూళ్లు కూడా రాబట్టలేక రవితేజ కెరీర్ లో మరో డిజాస్టర్ గా మిగిలింది. రిలీజ్ కు ముందే మాస్ జాతర డిజిటల్ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. థియేటర్ లో ఫ్లాప్ అయినా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ నెల గీ8 నుండి నెట్ ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురాబోతుంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో ఈ సినిమాను స్ట్రీమింగ్ తీసుకువస్తుంది నెట్ ఫ్లిక్స్. థియేటర్ లో రిలీజ్ అయిన గీ8 రోజుల తర్వాత మాస్ జాతర ను స్ట్రీమింగ్ చేస్తుంది నెట్ ఫ్లిక్స్.

# హరిణ్యారెడ్డితో 27న రాహుల్ పెళ్లి



స్టార్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తనకి కాబోయే భార్య హరిణ్యా రెడ్డికు ఇచ్చిన స్పెషల్ గిఫ్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. నవంబర్ గీ7న జరగనున్న వారి వివాహం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంగీత్ వేడుకలు అట్టహాసంగా జరుగుతున్న ఈ సమయంలో రాహుల్ ఇచ్చిన సర్‌ప్రైజ్‌కి హరిణ్య తెగ ఫిదా అయింది. టీమ్‌ఇండియా స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌ని స్వయంగా సంగీత్ వేడుకకు ఆహ్వానించి, తన కాబోయే భార్యకు రాహుల్ స్పెషల్ ట్రీట్ ఇచ్చాడు. చాహల్‌ను చూసి హరిణ్య ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హరిణ్య తన సోషల్ మీడియాలో .. ఇంత పెద్ద గిఫ్ట్ నా జీవితంలో మర్చిపోలేను. థ్యాంక్ యూ రాహుల్! అంటూ చాహల్‌తో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. హరిణ్యా రెడ్డి చాహల్‌కు వీరాభిమాని. ఆమె తన పోస్ట్‌లో మా సంగీత్‌కు వచ్చి మా వేడుకను ప్రత్యేకం చేసినందుకు చాహల్ గారికి ధన్యవాదాలు అని రాసింది. ప్రస్తుతం రాహుల్ సిప్లిగంజ్, హరిణ్య రెడ్డి, క్రికెటర్ చాహల్ కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుండగా, వీటిని చూసిన అభిమానులు, నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఇటీవల రాహుల్, హరిణ్యా కలిసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన విషయం తెలిసిందే.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
బుధవారం 26 నవంబర్ 2025


# భారత రక్షణ దళం సిపాయిలుగా ఎంపికైన యువకులకు జనసేన సత్కారం



**ఎస్. రాయవరం, నవంబర్ 25,(మనసులో మాట):** ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని కోన వాని పాలెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు భారత రక్షణ దళం లో సిపాయిలుగా ఎంపిక కావడంతో వారిని జనసేన నాయకుడు శానాపతి బాబురావు మాష్టారు ఆధ్వర్యంలో జనసైనికులు ఘనంగా సత్కరించారు.కోనవాని పాలెం జనసేన నాయకుడు కోన దుర్గాప్రసాద్, పాయకరావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రసాదుల గణేష్,అప్పికొండ లోవరాజు,అమలకంటి గోవిందు తదితర జనసైనికులు వేద డిఫెన్స్ అకాడమీ కోచ్ చెవ్వేటి నాగేంద్రతో పాటు సిపాయిలుగా ఎంపికైన సారిపల్లి సతీష్, గొర్ల నాగేంద్ర, ఒమ్మి సంపత్ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామీణ విద్యార్థులకు అతి తక్కువ ఖర్చుతో కోచింగ్ ఇస్తూఎందరో విద్యార్థులు కు మార్గ దర్శకులు గా నిలిచి, వారి ఉపాధికి కృషి చేస్తున్న చెవ్వేటి నాగేంద్ర ని గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమం లో కోన గురువాచార్యులు ,కోన చిన్నయ్య,జాగు బుజ్జి,కురందాసు శివ గణేష్, గొళ్ళ సురేష్ ,సారిపల్లి నాగేష్,కోన నాగేష్,ఇసరపు శ్రీను,గొర్ల అప్పలరాజు, ఇసరపు సాయికుమార్ దమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.



# అనకాపల్లి లో ప్రజా సమస్యలు

### ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కు వినతులు వెల్లువ

**అనకాపల్లి, నవంబర్ 25 (మనసులో మాట):** అనకాపల్లి రింగ్ రోడ్డు లోని జనసేనపార్టీ కార్యాలయంలో మంగళవారం అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు, కూటమి కార్యకర్తలు నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను అనకాపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ స్వీకరించారు. మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అయా సమస్యల పై సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజలకు, కూటమి కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు.

### ప్రతి పదిహేను రోజులకొక సారి

# తాగునీటి పరీక్షలు తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్




**అనకాపల్లి, నవంబర్ 25 (మనసు లో మాట)..** జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అన్ని సంక్షేమ వసతి గృహలు, అంగన్వాడీ లలో సరఫరా అయ్యే తాగునీటి ని ప్రతి పదిహేను రోజులకొక సారి తప్పని సరిగా పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య%శీ% మిషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ తాగునీటి వనరుల వద్ద మురుగు చేరకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండ తాగునీటి పరీక్షలు, ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ తప్పనిసరి గా జరగాలన్నారు. బహిరంగ మల విసర్జన జరగకుండా చర్యలు చేపట్టాలని, కాచిన నీటిని తాగడం, ఆహారం తినే ముందు, మల విసర్జన తరువాత శుభ్రంగా చేతులు కడుక్కోవడం పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. భూగర్భ జలాలు పెంచడానికి కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణం, చెరువు గట్ల పటిష్టం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఉన్న 1539 గ్రామాల్లో నూరు శాతం గృహాలకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి 'హర్ ఘర్ జల్' గ్రామాలుగా చేయడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జల జీవన్ మిషన్ పనులను సక్రమంగా అమలు చేయాలని జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్యం కార్యనిర్వాహక ఇంజనీర్ అనిల్ కుమార్ కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్యం కార్యనిర్వాహక ఇంజనీర్ జె. అనిల్ కుమార్, డీ.ఈ., ఎ. సావిత్రి, జెడ్పి సి ఈ ఓ. శివ నారాయణ మూర్తి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్ , జిల్లా అటవీ శాఖ అధికారి ఎం శ్యామ్ సుందరామ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆశా దేవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మంగవేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి, డీఆర్డీఏ పీడీ శచి దేవి, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవానికి భారత రాజ్యాంగం ప్రతీక




**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 25:** భారతీయుల ఆత్మగౌరవానికి భారత రాజ్యాంగం ప్రతీక అని ఇది అత్యంత పవిత్రమైనదని సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏ క ృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లాశాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురజాడ పాఠశాలలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన అవగాహనాసదస్సులో పాల్గొని మాట్లాడారు. మన రాజ్యాంగం సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగమని,ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగం మన దేశందేనని అన్నారు. గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ స్వరూప స్వభావాన్ని తెలిపే లిఖిత పత్రంరాజ్యాంగం, రాజ్యాంగమంటే స్వేచ్ఛ, సమానత్వం సోదరభావాలు, మూలస్థంభాలుగా దేశ ప్రజల సర్వతోముఖాభివృద్ధిని కాంక్షించే సమున్నత ఆశయమని అన్నారు. ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్ పర్సన్ గోటేటి హిమబిందు, జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకులుడాక్టర్ కృష్ణాజీ, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పైలా రమేష్ రాజులు మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రయోజనాలు రక్షించే దృక్పథం మన భారత రాజ్యాంగం కలిగి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం సుభద్రాదేవి, న్యాయవాది పి బి ఎస్ పవిత్ర, పాఠశాల కరస్పాండెంట్ ఎం స్వరూప, ప్రిన్సిపాల్ పూడి శేఖర్, రచయిత కాగుపాటి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి నోబుల్ చారిటీస్ సేవలు భేష్

### డాక్టర్ ఎస్. నూకరాజు జయలక్ష్మి లచే పేదలకు దుప్పట్లు,చీరలు పంపిణీ



**అనకాపల్లి, నవంబర్ 25 (మనసు లో మాట):** అనకాపల్లి గౌరీ పరమేశ్వరి పార్క్ సమీపం లోని శ్రీ సత్యసాయి మందిర ఆవరణ లో మంగళవారం నోబుల్ చారిటీస్ అధ్వర్యాన పేదలకు దుప్పట్లు, చీరలు, పండ్లు ను ఛారిటీస్ అధ్యక్షురాలు శరకడం జయలక్ష్మి, డాక్టర్ ఎస్. నూకరాజు పంపిణీ చేశారు. కాగా నోబుల్ ఛారిటీస్ సేవలను పలువురు కొనియాడారు. ముందుగా శ్రీ సత్యసాయిబాబా ను దర్శించుకొని డాక్టర్ ఎస్. నూకరాజు జయలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. అలాగే నోబెల్ ఛారిటీస్ సేవా కార్యక్రమానికి కొణతాల సుబ్రమణ్యం మనుమడు కళాశాల కరస్పాండెంట్ బాలసుబ్రమణ్యం దంపతులు హాజరయ్యారు. అంతకుముందు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఎస్ నూకరాజు మాట్లాడుతూ చలికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల ను గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ దాడి నీహారిక, సాయి రత్న, బొడ్డేటి శాంతారాం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కోరపల్లి గ్రామంలో 'రైతన్న మీకోసం'




**జి. మాడుగుల, నవంబర్ 25 (మనసు లో మాట):** మండలంలో గల కోరాపల్లి కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 'రైతన్న 'మీకోసం'క కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి వరప్రసాద్ గారు మాట్లాడుతూ కార్యక్రమం యొక్క అసలు ఉద్దేశాన్ని వివరించారు. పంచసూత్రాలను చదివి వినిపిస్తూ ప్రకృతి వ్యవసాయం అనుసరణ రైతులకు ఎంత మేలు చేస్తుందో వివరించారు. రైతులు పర్యావరణానుకూల పద్ధతులను అవలంబించాలని సూచించారు. అలాగే రాబోయే రబీ కాలానికి రైతులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్లో ప్రతి రైతు కనీసం ఒక పంట వేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. మినుములు విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు. పంటల పై నూతన సాంకేతిక మార్గదర్శకాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కొరపల్లి ప్రజా ప్రతినిధులు మరియు కూటమి సభ్యులు మరియు రైతులతో పాటు వ్యవసాయ సహాయకుడు, వెటర్నరీ సహాయకుడు, హాజరై రైతుల సమస్యలు తెలుసుకుని తగిన సూచనలు అందించారు.

# చట్టాలు పై మహిళా కార్మికులుకు అవగాహన



**ఎస్. రాయవరం, నవంబర్ 25, (మనసులో మాట):** అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్. రాయవరం మండలం గుడివాడ పంచాయితీ పరిధి లో ఉన్న సాయిమెరైన్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులుకు న్యాయ చట్టాలుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి, ఎం ఎల్ ఎస్ ఎ ఛైర్మన్ ఆదేశాలు మేరకు యలమంచిలి కోర్ట్ ప్యానెల్ లాయర్ టి. నూకరాజు అధ్వర్యంలో మంగళవారం పారా లీగల్ టీం తో కలిసి రొయ్యల పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు కు యాజమాన్యం కల్పించిన మౌళిక సదుపాయాలు పై ఆరా తీసారు. కార్మికులు వేతనం, పనిగంటలు, డ్యూటీ సమయంలో కల్పించవలిసిన పదుపాయాలు ఇతర ఆంశాలుపై ఉన్న చట్టాలు గురించి లాయర్ నూకరాజు కార్మికులుకు అవగాహన కల్పి ంచారు.ఈ కార్యక్రమం లో లీగల్ వాలంటీర్లు చిరంజీవి, నాగేశ్వరావు, కుమారి, చేపల రాజు, సురేష్, విజయ, శ్రీను, సంతోషిని, విఅర్ ఓ, కార్యదర్శులు తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారి సౌకర్యం కల్పించాలి



**జీ మాడుగుల (మనసులో మాట) నవంబర్ 25...** జీ మాడుగుల మండలం గెమ్మెలి పంచాయితీ గోగుగురాయి చిన్న కొత్తూరు గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజనసంఘం ఆధ్వర్యంలో జి.మాడుగుల మండల కేంద్రం నుండి ఎంపీడీవో ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం ఇవ్వడం జరిగింది .ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్ మాట్లాడుతూ గొడుగు రాయి గ్రామంలో గత ప్రభుత్వం హయంలో 2023. సంవత్సరంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరాశన కార్యక్రమాలు చేయడం వలన 49 లక్షలతో గ్రావెల్ రోడ్డు మంజూరు చేయడం జరిగింది దీనికి కాంట్రాక్ట్ అశోక్ రెడ్డి కొంత పనచేసి డబ్బులు డ్రా చేసుకొని పని పూర్తి చేయకుండా వదిలేసారు. ఇప్పుడు మళ్లీ బిటి రోడ్డు మంజూ చేసి పనులు ఇంకా ప్రారంభించడం లేదు కావున ఆ కాంట్రాక్ట్ అశోక్ రెడ్డి పై చర్యలు తీసుకొని వెంటనే పనులు ప్రారంభించాలని అలాగే ఈ గ్రామంలో గత వంద సంవత్సరాల నుంచి నివసిస్తున్న ఇప్పటికీ ఫారెస్ట్ గ్రామం గానే ఉంది కావున రెవెన్యూ గ్రామంగా మార్చాలని అలాగే సాగు చేస్తున్న పోడు భూమికి పట్టాలు ఇవ్వాలని అలాగే చిన్న కొత్తూరు గ్రామంలో రోడ్డు సౌకర్యం కల్పించమని పాడేరు గ్రీవెన్స్ కు వినతి పత్రం ఇవ్వగా మీ ఊరిలో రోడ్డు పూర్తి అయిందని చెప్పడం జరిగింది నిజానికి చిన్న కొత్తూరు గ్రామంలో ఎటువంటి రోడ్డు పనులు ప్రారంభించలేదు వేరే ఊరు ఫోటోలు చూపించే ఇదే మీ ఊరు రోడ్డు పూర్తయిపోయిందని చెప్పుతున్నారు వీటికి సంబంధించి సంబంధిత అధికారులు చిన్న కొత్తూరు గ్రామంలో వచ్చి పనులు చేస్తామని చెప్పి ఇప్పటివరకు ప్రారంభించలేదు. కావున ఇప్పటికైనా మా గ్రామంలో గుడుగురాయి. చిన్న కొత్తూరు గ్రామం రోడ్డు వేసి గొడుగు రాయి గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి.



# పాఠశాలల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల...

**కశింకోట, (మనసులో మాట) నవంబర్ 25..** మండలం లోని తేగడ లో కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం లో నూతనంగా నిర్మిస్తున్న స్కూలు భవన నిర్మాణ పనులు, జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల కశింకోట, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భవన నిర్మాణపు పనులను మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన నిర్మాణ పనులు పరిశీలించి స్కూల్ ప్రిన్సిపల్స్ డి ఈ నుండి వివరాలు అడిగి తెలుసుకుని భవన నిర్మాణం పనులు వేగవంతం చేయాలని నాణ్యత విషయంలో రాజీ పడవద్దు అని, అతి ముఖ్యంగా బాత్రూంలోకి క్వాలిటీ మెటీరియల్ వాడాలని, క్రీడా ప్రాంగణాలకు ప్రాముఖ్యత ఇవ్వాలని, నిధులు వృధా చేయకుండా సద్వినియోగ పరచాలని డి ఈ, కాంట్రాక్టర్ కు సూచనలు ఇచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోడల్ స్కూల్స్ గా తీర్చిదిద్దే విధంగా చర్యలు కొనసాగుతుందని అన్నారు. అనంతరం విద్యార్థినీలతో ముచ్చటించి వాళ్లకున్న సమస్యలను అడిగి తెలుసుకుని, పిల్లలు చేసిన యోగ విన్యాసాల్ని వీక్షించి, పిల్లలందరూ నిత్యం యోగా, ప్రాణాయామం, శారీరక దారుఢ్యం పెంపొందించు కొరకు క్రీడలు ఆడాలని, మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలని, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు, స్కూల్ కి మంచి పేరు తెచ్చే విధంగా విద్యావంతులు కావాలని, అంతకంటే ముఖ్యంగా కిచెన్ గార్డెనింగ్ చేయాలని, పిచికారి మందులు లేని ఆహార పదార్థాలను తినాలని పిల్లలందరినీ ప్రోత్సహించే విధంగా సూచనలు ఇచ్చారు. అలాగే ఉత్తీర్ణత సాధించిన పిల్లలను, అత్యంత అద్భుతంగా యోగ విన్యాసాలు చేసిన పిల్లలను అభినందన తెలిపి సత్కరించి, ఎవరైతే స్టేట్ ర్యాంకులు సాధిస్తారో వాళ్ల చేతే ఈ నూతన స్కూల్ భవనాలను ప్రారంభోత్సవం జరుపబడుతుందని అన్నారు. ఇప్పటివరకు కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం నకు 3.26 కోట్లు, జడ్.పి.హెచ్.ఎస్ స్కూళ్లకు బాలికల రూ. 30.58 లక్షలు, బాలురు రు. 46.60 లక్షలు మంజూరు కాబడ్డాయి.

# మహిళా కార్మికులకు చీరలు పంపిణీ



**ఎస్. రాయవరం, నవంబర్ 25,(మనసులో మాట):** ఎస్. రాయవరంమఃడలం తిమ్మాపురం గ్రామంలోని జీడిపిక్కల పరిశ్రమలో పనిచేస్తున్న 96 మంది మహిళా కార్మికులుకు శానాపతి కుసమ కావ్య జ్ఞాపకార్థం స్థానిక జనసేననేత శానాపతి బాబూరావుమాస్టారు మంగళవారం చీరలు పంపిణీ చేసారు. తన కుమార్తె కుసుమ కావ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కుసుమకావ్య పౌండేషన్ ద్వారా బాబూరావు మాస్టర్ జనసైనికులు సహకారంతో ఉచిత కంటివైద్యశిబిరం, మెగారక్తదానశిబిరం, ఉచిత వైద్యశిబిరాలుతో పాటు అర్థికంగా వెనుకబడిన వారికి అర్థిక, వైద్యసహాయాలు అందచేస్తున్నారు. స్థానిక కూటమినేతలు సమక్షంలో మహిళలు కు ఉచితంగా చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో మామిడి నాగరాజు, కోనప్పలరాజు, ప్రసాదుల గణేష్, అమలకంటి గోవిందు, అప్పికొండ లోవరాజు, కోన దుర్గాప్రసాద్, గురువాచార్యలు, గణేష్, సురేష్, మురళి కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మునగపాకలో సంతకాల సేకరణ

### కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మ శ్రీ, బొడ్డేడ ప్రసాద్




**మునగపాక, నవంబర్ 25, మనసులో మాట..** ప్రజా వైద్యం ప్రజల హక్కు అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం మునగపాక మెయిన్ రోడ్డు బ్యాంకు పక్కన సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి కోటి సంతకాలు ప్రజా ఉద్యమం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మునగపాక మండలం పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చినాయుడు అధ్యక్షతన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి కోటి సంతకాలు సేకరణ రచ్చబండ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మ శ్రీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సోమ సత్యనారాయణ , అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లి అప్పారావు , మునగపాక మండలం ప్రజా ప్రతినిధులు ,సర్పంచ్లు, ఎంపీటీసీలు,వివిధ హెూదాలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు అభిమానులు,తదితరులు పాల్గొన్నారుబి



## వైభవంగా శ్రీ నూకాంబికా ఆలయ వార్షికోత్సవం

**ఎస్. రాయవరం, నవంబర్ 25,(మనసులో మాట) :** ఎస్. రాయవరం మండలం ధర్మవరం గ్రామంలోని శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయం పంచమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ఆలకరించారు. ఉదయంనుండి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించుకున్నారు.ఆలయం వద్ద ప్రత్యేక భజనలు, కోలాటాలు ఏర్పాటు చేసారు.

## తాండవ కాలువ నీరు రావడంలేదు



**కోటవురట్ల నవంబర్ 25,(మనసులో మాట) :** తాండవ కాలువ సాగునీరు సరఫరా కాలేకపోవడంతో పంటల సాగుకు పలు అవస్థలు పడుతున్నట్లు కోటవురట్ల మండలం నీలిగుంట గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తాండవ కాలువ ఆయకట్టు 350 ఎకరాల వరకు ఉందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో కనీసం పది రోజులు కూడా సాగునీరు అందలేదన్నారు. దీంతో తమ పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. తాండవ ప్రాజెక్ట్ అధికారులకు విషయం తెలియజేసినా పట్టించుకోవడంలేదని రైతులు విమర్శించారు. మధ్యలో రైతులు అక్రమంగా సాగునీటిని వినియోగించుకోవడం వల్ల తమకు అందడం లేదన్నారు. మధ్యలో ఉన్న తొమ్మిది మదుంలు ద్వారా రైతులు అక్రమంగా సాగునీటిని మళ్లించుకుంటున్నారని ఆరోపించారు. సిబ్బంది లేకపోవడం వల్ల పర్యవేక్షణ చేయలేకపోతున్నామని అధికారులు తెలిపారు.

## వీర విజేతగా..

**హుకుంపేట నవంబర్ 25 (మనసులో మాట)..** మన గిరిజన బిడ్డ కళ్ల ముందు చీకటి ఉన్నా, హృదయంలో మెరిసిన విజయం కల! వీర విజేతగా నిలిచిన వంట్లమామిడి గ్రామానికి చెందిన క్రికెట్ ప్రతిభ పాంగి కరుణకుమారి శ్రీకాకుళంలో జరిగిన టీకె-20 అంధ మహిళల వరల్డ్ కప్ ఫైనల్లో టీమ్ ఇండియా అద్భుత విజయంతో చరిత్ర సృష్టించింది. నేపాల్పై 7 వికెట్ల తేడాతో కేవలం 12.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి భారత మహిళలు దేశానికి తొలి వరల్డ్ కప్ కిరీటాన్ని అందించారు. ఈ చారిత్రాత్మక విజయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా - పాడేరు మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన పాంగి కరుణకుమారి అద్భుతమైన 42 పరుగులతో భారత విజయానికి ప్రధాన బలంగా నిలిచింది. ప్రస్తుతం ఆమె విశాఖపట్నం ప్రభుత్వ బాలికల అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన కరుణకుమారి జిల్లా గర్వకారణం అవుతోంది. ఈ సందర్భంగా జిల్లా మహిళా సంఘ అధ్యక్షురాలు కుమారి, జిల్లా కార్యదర్శి హైమావతి కరుణకుమారిని అభినందిస్తూ గిరిజన యువతికి ఆమె గొప్ప ఆదర్శంగా నిలిచిందని,భవిష్యత్తులో మరింత ఎత్తులకు చేరాలని మహిళాసంఘం తరఫున పత్రిక ప్రకటన ద్వారా అభిలషిస్తున్నాము.

## జిల్లాలో అంచనాల కమిటీ పర్యటన

**విజయనగరం: (మనసులో మాట) నవంబర్ 25:** కమిటీ చైర్మన్ వి. జోగేశ్వరరావు, ఎం.ఎల్.ఏ,కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వివరాలు..అఖిల ప్రియ భూమా, ఎం.ఎల్.ఏ,జయకృష్ణ నిమ్మక, ఎం.ఎల్.ఏ,బండారు సత్యానంద రావు, ఎం.ఎల్.ఏ, కందుల నారాయణ రెడ్డి, ఎం.ఎల్.ఏ, మద్దిపాటి వెంకట రాజు, ఎం.ఎల్.ఏ,డా. పార్థ సారథి వాల్మీకి, ఎం.ఎల్.ఏ,పాసిం సునీల్ కుమార్, ఎం.ఎల్.ఏ,యేలూరి సాంబశివ రావు, ఎం.ఎల్.ఏ,డా. వి.వి.సూర్యనారాయణ రాజు పెనుమత్స, ఎం.ఎల్.సి, వరదు కళ్యాణి, ఎం.ఎల్.సి.,కమిటీ పర్యటనలో 2019-2020, 2020-2021 మరియు 2021-2022 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అంచనాలను సమీక్షించనుంది.

# మానవత్వానికి చెదలు పడుతున్నాయి..!

### సూఫీ అభిషిక్తులు ఖలీల్ బాబు ఆవేదన..




**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 25:** ప్రపంచంలో ఎక్కడైనా అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్నాయంటే..అక్కడ మానవత్వానికి చెదలు పడుతున్నాయన్న సంకేతాన్ని సూచిస్తుందని సూఫీ అభిషిక్తులు, హజరత్ ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ ఎండీ ఖలీల్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వానికి మాతృకగా నిలిచే సూఫీ పరంపర, దక్షిణ భారత సూఫీ సామ్రాట్, దైవాంశ సంభూతులు, మహర్షి ఖాదర్ బాబా వారి ప్రియ శిష్యులు హజరత్ ఖ్వాజా మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా (ర.అ.) వారి 89 వ జన్మ దినోత్సవ వేడుకలు మంగళవారం ఏటికె ఆశ్రమంలో ఘనంగా జరిగాయి. సామాజిక సేవకులు, వైద్యులు, బాబా ప్రేమికులైన డాక్టర్ అవసరాల శ్రీధర్ , సంతోష్ సోదరులతో కలిసి ఖలీల్ బాబు ఏటికే వెలుగు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. పరిసరాల పిల్లలకు, యువకులకు పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ బాబు మాట్లాడుతూ, మనసుల్లో ప్రేమ దూరమైతే, మనుషుల మధ్య బంధాలు దూరమవుతాయని, మనిషి హృదయం మలినమైపోతూ ఉంటే మానవత్వం చచ్చిపోతూ ఉంటుందని అన్నారు. ఎవరైతే తమ హృదయాల్లో ప్రేమను నింపుకుని సత్ కార్యాలు చేస్తారో వారిపై దైవం కరుణ తప్పక ఉంటుందని ఖలీల్ బాబు ఉద్బోధించారు. సాటి మనిషిని ప్రేమిస్తూ, వారి బాధల్లో పాలు పంచుకోవాలని, ప్రతీ ఒక్కరినీ కోరుకుంటూ, సూఫీ చంద్ర బింబం ఖాదర్ బాబా వారి దయ, కరుణ, కటాక్షం ప్రతీ ఒక్కరిపై ప్రసరించాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఖలీల్ బాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాబా సేవకులు రంగారావు , సోషల్ సర్వీస్ యూత్ అంబాసిడర్ ఎండీ అహమ్మద్ బాబు, జుజ్జూరు ఖాదర్, నాగూర్ , జర్నలిస్ట్ జైరాజ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# నెలరోజులు లింగ ఆధారిత వివక్షపై అవగాహన

### డీఆర్డీఏ పీడీ శచీదేవి కరపత్రాల ఆవిష్కరణ



**అనకాపల్లి, నవంబర్ 25 (మనసులో మాట):** లింగ ఆధారిత వివక్ష పై పోరాటం చేసేందుకు పౌరులందరి లో బాధ్యత పెరగాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు శచిదేవి పిలుపునిచ్చారు. క్రియాశీల అవగాహన కల్పించటం ద్వారా నివారణ చర్యలను బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. స్త్రీ, పురుషుల సమానత్వం ద్వారానే సమాజం అనుకున్నదానికంటే వేగవంతంగా ఎదుగుతుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు నయీ చేతన 4.0- మార్పు కోసం ముందడుగు అనే పేరుతో చేపట్టనున్న కార్యక్రమ గోడ పత్రికలను కలెక్టరేట్ డీఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ మాట్లాడుతూ జిల్లా లో ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వ తేదీ వరకు నిర్వహించబోయే లింగ ఆధారిత వివక్ష పై అవగాహనా కార్యక్రమాలు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ క్రతువులో పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ, పోలీస్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సాంఘిక సంక్షేమ, విద్య, సివిల్ సొసైటీ ఆర్గనైజే షన్, జిల్లా సమాఖ్యలు కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉందన్నారు. మహిళల్లో, బాలికల్లో విస్తృత అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని ఆమె పేర్కొన్నా రు. ఆన్లైన్, ఆఫ్లైన్ వేదికల ద్వారా బాధిత వర్గాలతో సమావేశం కావాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో చైతన్య, అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల స్వేచ్ఛా యుత గమనం, ఆర్థిక స్వావలంబన, సాధికారత తదితర అంశాలపై పరిపూర్ణమైన అవగాహన కల్పించే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో కార్యక్రమ నిర్వహణ సమన్వయకర్తగా డీఆర్డీఏ పీడీ వ్యవహరిస్తారని ఆమె తెలిపారు. సంబంధిత అన్ని విభాగాల అధికారులు పూర్తి సహకారం అందించి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీఏ పీడీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో డీఆర్డీఏ అదనపు పథక సంచాలకులు జి. డైజి, ప్రాజెక్ట్ మేనజేర్లు ఎస్.ఎస్.రత్నప్రభ, కె కుమారస్వామి, పీ రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఆర్ఐ లెక్కల వెంకటేశ్వరరావు సౌజన్యంతో డి.ఎర్రవరం నుంచి జిల్లేడుపూడి వరకు

# జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం



**నాతవరం, నవంబర్ 25,( మనసులో మాట)** నాతవరం మండలం డీ.ఎర్రవరం నుంచి జిల్లేడుపూడి వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. దీంతో వాహనదారులు తమ ప్రయాణాలకు తీవ్ర అవస్థలు పడేవారు. దీనిపై స్పందించిన ఎన్ఆర్ఐ లెక్కల వెంకటేశ్వరరావు స్పందించి సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయడానికి నిర్ణయించారు. ఈ మేరకు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, ఎస్ఐ వై. తారకేశ్వరరావు, ఎంపిడిఒ ఎంఎస్.శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ ఈ జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర మాట్లాడుతూ ఈ రహదారిలో చాలా కాలంగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో వాహనదారులు ఇటుగా ప్రయాణాలకు అనేక అవస్థలు పడేవారన్నారు. దీనిపై ఎన్ఆర్ఐ లెక్కల వెంకటేశ్వరరావు దృష్టికి రావడంతో ఆయన స్పందించి సొంత నిధులతో జేసీబీ సాయంతో ఈ పనులను చేపట్టడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ ఐ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ డిసి మెంబర్ నల్లబెల్లి పుల్లయ్యనాయుడు, పంచాయతీ సెక్రటరీ లోవరాజు, ఎస్ఆర్ఐ టీమ్ సభ్యులు రాజేష్, నానిబాబు, జిల్లేడుపూడి సర్పంచ్ లాలం రమణ, వీఆర్వో మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

### జనరేషన్ కమ్యూనికేషన్ సిస్టమ్స్పై

# ఐదు రోజుల ఫ్యాకల్టీ



**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 25:** క్వాంటమ్ మెషిన్ లెర్నింగ్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ " అనే అంశంపై ఐదు రోజుల ఆన్లైన్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్.డీ.పీ) సోమవారం ప్రారంభమైంది, దీనిని ఎం.వీ.జీ.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహిస్తున్నది. ఈ ఎఫ్.డీ.పీ ని ఏక్ టెక్ ఇన్ఫోసిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు క్రినిడి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్, స్పాన్సర్ చేశాయి. ఈ ఐదు రోజుల ఎఫ్.డీ.పీ, రాబోయే కమ్యూనికేషన్ టెక్నాలజీలకు అవసరమైన నైపుణ్యాలతో అధ్యాపక సభ్యులను సన్నద్ధం చేయడం, అలాగే ఇంజనీరింగ్ విద్య మరియు పరిశోధనలలో ఆవిష్కరణలను పెంపొందించడానికి క్వాంటం కంప్యూటింగ్ మరియు కృత్రిమ మేధస్సు యొక్క కన్వర్జింగ్ రంగాలలో ఆచరణాత్మక జ్ఞానాన్ని అందించడమే ఈ ఎఫ్.డీ.పీ యొక్క ముఖ్య లక్ష్యం.శిక్షణ కార్యక్రమం ప్రారంభ సమావేశానికి పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్ టి. షణ్ముఖ్ నాదం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.క్వాంటం మెషిన్ లెర్నింగ్ యొక్క ప్రాముఖ్యత మరియు భవిష్యత్తు పరిధిని ఎం.వీ.జీ.ఆర్ ప్రిన్సిపాల్ డా. వై.ఎం.సి. శేఖర్ ఈ ఎఫ్.డీ.పీ వివరించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ టి. షణ్ముఖ్ నాదమ్ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యాలను వివరించారు మరియు క్వాంటం ప్రింటెడ్ యాంటెన్నాలు, యాంటెన్నా టెక్నాలజీ, భవిష్యత్ కమ్యూనికేషన్ వ్యవస్థల కోసం మెషిన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్ యొక్క అనువర్తనాలపై అవసరమైన అంతర్దృష్టులు వంటి కీలకమైన అంశాలపై శిక్షణ ఇచ్చారు.దేశవ్యాప్తంగా 100 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధనా పండితులు మరియు పరిశ్రమ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ 5 రోజుల ఆన్లైన్ ఎఫ్.డీ.పీ కార్యక్రమంలో, డా. జావీద్, ఎం.డీ, డైరెక్టర్, మాక్స్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్, క్రిణిడి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్బీ ఆంధ్ర ప్రదేశ్ సైన్స్ సిటీ, సి.ఈ.ఓ, వెంకటేశ్వర్లు కేశినేనిబీ డా. బి.టి కృష్ణ, జె.ఎన్.టీ.యు కాకినాడబీ డా. శ్రీవిశాల్ త్రిపాఠి, ఐ.ఐ.ఐ.టీ నయా రాయ్పూర్బీ డా. రాజర్షి మహాపాత్ర, ఐ.ఐ.ఐ.టీ నయా రాయ్పూర్బీ డా. ఆకాష్ కుమార్ ప్రధాన్, వీ.ఐ.టీ చెన్నై కె హెచ్ కె ప్రసాద్, ఆదిత్య విశ్వవిద్యాలయం, కాకినాడబీ డా. కె వెంకటరావు, ఎన్ ఐ.టీ.టీ.ఆర్-కోల్కతాబీ పాల్గొని క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం ఐ.ఓ.టీ ఎడ్జ్ కంప్యూటింగ్, డీప్ లెర్నింగ్ మోడల్స్, క్వాంటం ఈ.సి.జీ సిగ్నల్ ప్రాసెసింగ్ మొదలైన వివిధ అంశాలపై ఈ నిపుణులు ఉపన్యాసాలు ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమంలో ఈ.సి.ఈ హెచ్.ఓ.డీ డా. రమాదేవి, ఎఫ్.డీ.పీ కోఆర్డినేటర్ డా. ఎం. సత్యనారాయణ, డా. ఎం. సునీల్ ప్రకాష్ మరియు ఈ.సి.ఈ లోని అన్ని ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



## మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

కొయ్యూరు నవంబర్ 25 (మనసులో మాట): అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బూధరాళ్ళ పంచాయితీ లోని మారుమూల గ్రామమైన గరిమండ గ్రామంలో జరిగే వారపు సంతలో ఆ ప్రాంత గిరిజనులు ఈరోజు మంగళవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా ర్యాలీ నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాలు వద్దు, గిరిజనుల అభివృద్ధే ముద్దు అంటూ నినాదాలు చేశారు. మావోయిస్టులారా ఎవరికోసం ఈ వారోత్సవాలు ఎందుకు కట్టాలి స్థూపాలు అంటూ ర్యాలీ నిర్వహించారు.

# అర్హులందరికీ పక్కా ఇల్లు

### నవంబర్ 30లోగా దరఖాస్తు చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి -

విజయనగరం: (మనసులో మాట)::నవంబర్ 25::కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఇల్లు లేని పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని గ్రామాల్లో అర్హత ఉండి ఇల్లు లేని నిరుపేదల కోసం 100% డిమాండ్ సర్వే జరుగుతోందనీ తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఈ నెల 30 వరకు మాత్రమే గడువు ఉందని, అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.రాబోయే 5 సంవత్సరాలలో ఎవరికైనా పక్కా ఇల్లు కావాలంటే, ఈ నెలాఖరులోపు తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అర్హతల వివరాలు ఇలా ఉన్నాయి.గృహం లేని మరియు స్థలం లేని కుటుంబీకులు. తెల్ల రేషన్ కార్డు ఉండాలి.ఇంతకు ముందు ఏ ఇతర ప్రభుత్వ పథకంలోనూ లబ్ధి పొంది ఉండకూడదు. సొంత స్థలం ఉన్నా లేకపోయినా నమోదు చేసుకోవచ్చు. స్థలం లేని వారికి, తర్వాత స్థలం మంజూరు అయిన తర్వాత పక్కా ఇల్లు మంజూరు చేయబడుతుంది. మీ వివరాలను 'ఆవాస్ ప్లస్ యాప్' ద్వారా నమోదు చేయించుకోవాలి.మీరు నివసించే సచివాలయం పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేదా మండల హౌసింగ్ సహాయక ఇంజనీరుని సంప్రదించండి.లబ్ధిదారులు తమ ఇంటి దగ్గరే ఉండి, ముఖ ఆధారిత నమోదు ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలి. కావలసిన పత్రాలు.. పేరునమోదు సమయంలో ఈ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి:స్థల ధృవీకరణ పత్రాలు (మీకు స్థలం ఉంటే) జాబ్ కార్డు,ఆధార్ కార్డు, రేషన్ కార్డు,బ్యాంకు ఖాతా (అకౌంట్) వివరములు.ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట

### ఇద్దరికీ లక్షా 12 వేల రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కులు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అందజేత



**అనకాపల్లి, నవంబర్ 25 (మనసు లో మాట):** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డవలెప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి పట్టణం లోని 84 వ వార్డు కోట్నివీధిలో మంగళవారం ఇద్దరు లబ్దిదారులకి లక్షా 12 వేల రూపాయలు సీఎం సహానిది చెక్కులను ఆయన అందజేశారు. అనకాపల్లి పట్టణానికి చెందిన నాగలక్ష్మి కి 86 వేల రూపాయలు, యల్లపు అప్పారావు కి 20 వేల రూపాయిలు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేయడం జరిగింది. 84వ వార్డు కార్పొరేటర్ మాధంశెట్టి చిన తల్లి నీలాబాబు లతో కలిసి ఇంటికి వెళ్లి వారు అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్ధికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, 84 వ వార్డు టిడిపి ఇంచార్జి తలారి లక్ష్మి ప్రసాద్, కూటమి నాయకులు సాలాపు మోహన్, కోట్ని కొండలరావు, కోట్ని రాంబాబు, కాంద్రేగుల సతీష్, కాంద్రేగుల చిన్న, శ్రీనివాసరావు, కూటమి శ్రేణులు, టీడీపీ కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలో అచ్యుత హై స్కూల్ ప్రతిభ



**అచ్యుతాపురం నవంబర్ 25 మనసులో మాట..** అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో గల అచ్యుత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మరియు ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, అచ్చుతాపురం సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోపరేటివ్ 2025 భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించిన అచ్యుత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శ్రీ పల్లి శేషగిరిరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతి పొందిన కొవిరి శివ 10వ తరగతి, ద్వితీయ బహుమతి పొందిన సారిపల్లి కల్పన 9వ తరగతి, ద్వితీయ బహుమతి పొందిన దాసరి అనురాధ 9వ తరగతి లకు ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్స్ అయిన శ్రీ ఏ. జె కెమెరాస్ స్టాలిన్ , జి. జగన్నాధరావు బహుమతులను అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ శ్రీ ఆర్. తిరుమల రావు , అచ్యుతాపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీమతి ఆర్. ఉమ , బ్యాంకు మెంబెర్స్ , అచ్యుత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ అల్లు శ్రీనివాసరావు , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ వైబి నాయుడు , బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అక్రమ మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

**పాయకరావుపేట నవంబర్ 25 మనసులో మాట..** పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు పాయకరావుపేట ఏఎస్ఐ తమ సిబ్బందితో శ్రీ రాంపురం గ్రామ శివారులో దాడులు నిర్వహించి ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా 8 క్వార్టర్ల మద్యం సీసాలతో ఉన్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.పాయకరావుపేట సీ.ఐ జి.అప్పన్న ఉత్తర్వులు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## చిట్టివానిపాలెం గ్రామంలో విషాదం



అచ్చుతాపురం నవంబర్ 25 మనసులో మాట: అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం మండలం, ఇరువాడ పంచాయతీ పరిధిలోని చిట్టివానిపాలెం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం దొడ్డి నాగరాజు (40) తాడిచెట్టు ఎక్కి గీత కార్మికుడు గీత ఉండగా తీస్తుండగా, ప్రమాదవశాత్తూ చెట్టు నుండి జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

## దివ్యాంగులకు ఉచిత మూడు చక్రాల స్కూటీలు

- దరఖాస్తులు గడువు డిసెంబర్ నెలాఖరి వరకు పెంచాలి
- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు



**అనకాపల్లి, నవంబర్ 25 (మనసు లో మాట):** వికలాంగుల మూడు చక్రాల పెట్రోల్ స్కూటీల ధరఖాస్తు గడువు పొడిగించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు అన్నారు. అనకాపల్లి గవరపాలెంలో మంగళవారం విలేకరుల సమావేశంలో బుగిడి నూక అప్పారావు మాట్లాడుతూ వికలాంగులకు ఉచిత మూడు చక్రాల పెట్రోల్ స్కూటీ ధరఖాస్తు చేసుకొనే గడువు నేటితో ముగిస్తున్నందున ఆదికారులు అందుబాటులో లేకపోవడం వల్ల అర్హులైన వికలాంగులకు ధరఖాస్తు చేసుకొనేందుకు మరికొంత గడువు పోడిగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు విన్నవిస్తున్నారు. వికలాంగుల మూడు చక్రాల పెట్రోల్ స్కూటీలు నియోజకవర్గానికి పది స్కూటీలు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగులకు ఉచితంగా పంపిణీ చేయడానికి ఈనెల 25 వరకు గడువు విధించడం జరిగింది. అయితే వికలాంగులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలనే విధి విధానాలలో మున్సిపల్ కమిషనర్ గాని, ఎంపీడీవో గాని సంతకాలు చేసి ఇవ్వాల్సిన సర్టిఫికెట్లు సమయానికి అందకపోవడం వల్ల చాలా మంది దివ్యాంగులు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోలేకపోయారని నూక అప్పారావు తెలిపారు. అందువల్ల వికలాంగుల స్కూటీల దరఖాస్తుల స్వీకరణ డిసెంబర్ నెలాఖరి వరకు గడువు పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు నూక అప్పారావు విజ్ఞప్తి చేస్తున్నారు.

## యువతకు సువర్ణావకాశం

### మెగా జాబ్ మేళా - 12 కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

### జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్

**పాడేరు, నవంబర్ 25: (మనసులో మాట):** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నిరుద్యోగ యువతకు శుభవార్త. ఈ నెల 28వ తేదీ శుక్రవారం పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. ఈకార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, నైపుణ్య జిల్లా అధికారి డా. పి. రోహిణి ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ?ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులకు ఇది ఒక సువర్ణావకాశం అన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో మొత్తం 12 కంపెనీలు పాల్గొంటున్నాయి. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారెవరైనా ఈ మేళాలో పాల్గొనడానికి అర్హులు. అర్హులైన అభ్యర్థులకు కంపెనీలు అక్కడికక్కడే ఆఫర్ లెటర్లను జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. చదువుకున్న యువతి యువకులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని డా. పి. రోహిణి సూచించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 6302636174 లేదా 7569923256 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

## బలిఘట్టం హైస్కూల్ విద్యార్థులకు డిసిఇబి స్టడీ మెటీరియల్ పంపిణీ



**నర్సీపట్నం, నవంబర్ 25 (మనసులో మాట)** నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అల్లాడ సురేష్ మంగళవారం 10వ తరగతి విద్యార్థుల విద్యాప్రమాణాలను మెరుగుపరడం, రాబోయే పబ్లిక్ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం కావడంలో సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో 27 మంది విద్యార్థులకు డిసిఇబి స్టడీ మెటీరియల్ను అందజేశారు. ఈ సందర్భంగా అల్లాడ సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో మంచి స్టడీ మెటీరియల్ ఎంతో సహాయపడుతుందన్నారు. ఈ డిసిఇబి మెటీరియల్ 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉపయోగపడాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నానన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.శ్రీదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ అల్లాడ సురేషను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాడుగుల నియోజకవర్గం యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మొల్లి సన్నిబాబు



**కే కోటపాడు: నవంబర్ 24 ప (మనసులో మాట):** మండల కేంద్రంలో సోమవారం జరిగిన నియోజకవర్గస్థాయి యాదవ సంఘం విస్తృత సమావేశం సందర్భంగా మాడుగుల నియోజకవర్గం యాదవ సంఘం ఎన్నిక నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాడుగుల నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షుడిగా మొల్లి సన్ని బాబు చీడికాడ, గౌరవ అధ్యక్షుడిగా చల్ల తాతయ్యలు దేవరాపల్లి, ప్రధాన కార్యదర్శిగా కిల్లన శ్రీను దేవరాపల్లి, ఉపాధ్యక్షుడిగా నంబారు అప్పారావు కె .కోటపాడు, మరొక ఉపాధ్యక్షుడిగా గోకి వాడ అప్పలనాయుడు మాడుగుల, కోశాధికారి మిస్కా రామరాజు చీడికాడ, కార్యదర్శులుగా కడుపుట్ల రామునాయుడు కోటపాడు, నమ్మి బాలరాజు మాడుగుల మండలాల నుంచి ఎన్నిక కావడం జరిగింది. అదేవిధంగా కె.కోట పాడు మండలం యాదవ సంఘం ఎన్నిక జరిగినది. కె.కోటపాడు మండలం యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పల్లా అప్పారావు కె .కోటపాడు, ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా జోగా అప్పలనాయుడు గొల్లలపాలెం, మరొక ఉపాధ్యక్షులుగా సీము సురు వెంకటరమణ ,ప్రధాన కార్యదర్శిగా బంధం రాము సూదివలస, కార్య దర్శి గా బొద్దాన రమణ గుల్లేపల్లి, మొల్లి అప్పలనాయుడు కె .కోటపాడు కోశాధికారి, పల్లా మణికంఠ కె .కోటపాడు, కార్యవర్గ సభ్యులుగా పల్లా రమణ, సీముసురు రాము నాయుడు, నమ్మి అప్పారావులు ఎన్నిక కావడం జరిగింది.

## రైతన్నను రారాజుగా చేయాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యం..

### రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు..



**డుంబ్రిగుడ, నవంబర్ 26 మనసులో మాట:** రైతన్నను రారాజుగా చేయాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి సుబ్బారావు అన్నారు. మండలంలోని పోతంగి పంచాయితీ పెదపాడు గ్రామంలో మంగళవారం పోతంగి పంచాయితీ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈశ్వరి ఆధ్వర్యంలో రైతుఇంటింటికి వెళ్లే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రైతన్నను రారాజుగా చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలుపరుస్తున్న సందేశాన్ని ప్రతి ఒక్క రైతు పాటించి ఆ లక్ష్యం దిశగా అడుగులు వేయాలని చెప్పారు. గిరి రైతులు నూతన సాగు విధానాలను ఆచరించడంతోపాటు రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తూ, సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సహించడం, నీటి లబ్ధిదారుగా పంట సాగులో నూతన సాగు పద్ధతులు అవలంబించాలని సూచించారు. ఇదే క్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను రైతులకు వివరించి ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరిచే రైతంగ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ ఎంపీపీ దన్నే రావు, మాజీ సొసైటీ బ్యాంక్ చైర్మన్ భాస్కరరావు, మండల టిడిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణకు కొత్త సంచార ఐసిటిసి వాహన సేవా ప్రారంభం



పాడేరు నవంబర్ 25, ( మనసులో మాట ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా ముఖ్యంగా గిరిజన దూర ప్రాంతాల ప్రజలకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి రోగులకు సేవలందించుటకు మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్టింగ్ సెంటర్ ఐ సి టి సి వాహన సేవలు మరింత కీలకం కానున్నాయని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ రాష్ట్ర ఎయిడ్స్ వ్యాధి లో సంచలనంగా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణకు కొత్త సంచార ఐ సి టి సి వాహన సేవా వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంచార ఐ సి టి సి వాహనం ఇంటింటికి వెళ్లి కౌన్సెలింగ్, టెస్టింగ్ అవగాహన కార్యక్రమాలను అందించనున్నదని తెలి పారు ఈ చర్య ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ ముందడుగు చర్యగా తేలికైన యాక్సెస్ సదుపాయాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తు ప్రజలకు వ్యాధి పై అవగాహన పెంచేందుకు ఈ వాహనం కీలక పాత్రపోషిం చునున్నదన్నారు. ఈ సేవ ద్వారా ప్రజలకు స్వచ్ఛ మైన, నిష్పక్ష పాత హెచ్ఐవి పరీక్షలు చేయించుకునే అవకాశ%శీ% కల్పించి, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని తగ్గించడానికి సహాయపడుతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి . కృష్ణ మూర్తి నాయక్ మాట్లా డుతూ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సమకూ ర్చిన సంచార హెచ్ఐవి కౌన్సిలింగ్ పరీక్ష కేంద్రాల కేంద్రాన్ని జిల్లాకు కేటాయిం చడం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వైద్య కేంద్రాలకు దూరంగా ఉండి హెచ్ఐవి సర్వీసెస్ అందుకోలేని ప్రదే శాలకు మరియు హై రిస్క్ జనాభా ఉన్న ప్రదేశాలకు, పారిశ్రామిక కేంద్రాలలో పని చేస్తున్న వలస కూలీలకు జిల్లాలోని పాజిటివ్స్ తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలలో ఈ మొబైల్ ఐ సి టి సి సంచార వాహనం సేవలందిస్తుందన్నారు ఈ మొబైల్ ఐ సి టి సి కేంద్ర%శీ% దగ్గరలో ఉన్న వైద్య సిబ్బందితో మరియు స్వచ్ఛంద సేవా సంస్థ లతో ఇతర వాలంటీ ర్స్ వ్యవస్థతో కలిసి పనిచేస్తుందని ఈ కేంద్రంలో హెచ్ఐవి ఎయిడ్స్ కి సంబంధించిన సంపూర్ణ సమాచారాన్ని , కరపత్రాలు వీడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే నిమి త్తం నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ మరియు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఈ సంచార హెచ్ఐవి కౌన్సిలింగ్ , పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం జరిగిందని, కావున జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఐవి బారిన పడకుండగా ప్రతి ఒక్కరు తెలుసుకొని జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. జిల్లా లెప్రసి ఎయిడ్స్ మరియు టిబి నియంత్రణ అధికారి డా.కిరణ్ కుమార్ ప్రసంగిస్తూ ఈ సంచార హెచ్ఐవి కౌన్సి లింగ్, పరీక్ష కేంద్రంలో ఒక కౌన్సిలర్ ల్యాబ్ టెక్నీషియన్ , అటెండర్ డ్రైవర్ ఉంటారని వారు ప్రతి రోజు హెచ్ఐవి టిబి, సుఖ వ్యాధులపై అవగాహన కల్పిస్తారని ఆయనే తెలియజేశారు. ఈ సేవలో ఐసీటీసీ కౌన్సిలర్లు, పి పి టి సి టి కౌన్సిలర్లు కూడా నియమి తులుగా ఉండి, వ్యక్తిగత రహస్యత కు పూర్తి గౌరవం ఇవ్వబడుతుంద న్నారు. సంచార ఐసిటిసి వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మరింత మందికి వైద్య సేవలు చేరే బాటలో రాష్ట్రం సుస్థిర మరియు సమగ్ర ఎయిడ్స్ నియంత్రణ విధానాలను అమలు చేస్తోందన్నారు జిల్లా ప్రజలు ఈ సదుపాయాల ను వినియోగించుకొని ఆరోగ్య పరీక్షలు నిర్వ హించు కుంటూ ఆరోగ్య వంతమైన పరిపూ ర్ణమైన జీవనాన్ని గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో , ఎ టెక్నికల్ నిపుణులు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగులు, డి ఎం డి ఒ ఎస్ చిరంజీవి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వి కిరణ్, కైలాష్,చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించండి

### తెలుగు దేశం పార్టీ జిల్లా ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి పిలుపు



**గూడెం/సీలేరు నవంబర్ 25:(మనసు లో మాట)..** తెలుగు దేశం పార్టీ జిల్లా ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆదేశాలు మేరకు ప్రతి మండలంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుకు జరిగిన మేలు, భవిష్యత్తులో అన్నదాత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న పంచ సూత్రాలు అమలుపై రైతులకు అవగాహన కల్పిస్తూ... ఈనెల 24 నుంచి 29 వరకు రైతన్నా... మీకోసం కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసినదే. రైతుకు శాశ్వత ఆర్థిక మార్పు లక్ష్యంగా ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. నవంబర్ 29 వరకు ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు ఇళ్లకు వెళ్లి అన్నదాత సుఖీభవ, మొదట విడత,రెండో విడత చేసిన మేలును వివరిస్తూ... లాభసాటి వ్యవసాయం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించాలి. నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రభుత్వాల మద్దతు అనే పంచ సూత్రాలపై అన్నదాతలకు అవగాహన కల్పించే బాధ్యతను తీసుకోవడమే రైతన్న మీకోసం కార్యక్రమం. ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్ గా ప్రతి బృందం రోజుకు 30 క్లస్టర్ ను కలిసేలా రైతన్నా... మీకోసం కార్యక్రమం డిజైన్ చేయబడింది. దీనిలో భాగంగా ప్రతి ఒక్కరూ 90 కుటుంబాలను ప్రతిరోజు కలిసేలా కార్యక్రమాన్ని ప్లాన్ చేసుకోండి. ఈనెల 29 వరకు ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది.

నవంబర్ 30న సమావేశాలు డిసెంబర్ 3న ప్రతి రైతు సేవ కేంద్రం లో వర్క్ షాపు 2026-27 కోసం ఆ వర్క్ షాప్ లో కార్యాచరణ నిర్వహణ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరుతున్నాం.



## సి ఐ టి యు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

### సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి పిలుపు

### గోడపత్రిక ఆవిష్కరణ

**పరవాడ నవంబర్ 25, (మనసులో మాట)..** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సి ఐ టి యు) అఖిలభారత 18వ మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు జరుగుతున్న సందర్భంగా మంగళవారం పరవాడ మండలం లంకెలపాలెం లో గోడపత్రిక ఆవిష్కరించారు. సిఐటియు ఏర్పడిన 55 ఏళ్ల చరిత్రలో మొట్టమొదటిసారి విశాఖపట్నంలో జరుగుతున్నాయి. ఈ మహాసభ జయప్రదానికై కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు రూప కల్పన జరుగుతుందని అన్నారు. ఫార్మా, బ్రాండిక్స్ తదితర పారిశ్రామిక కార్మికుల ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని గంటల పెంపు వంటి అంశాలపై ఎప్పటికే పలు పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. అసంఘటిత రంగకార్మికులు, స్కీం వర్కర్స్ సమస్యలపై సిఐటియు నిరంతరంగా పోరాడుతుందని గని శెట్టి అన్నారు. ఈ మహాసభలు జయప్రదానికై అందరూ తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎం రమణి, సిహెచ్ పద్మ, ఎల్ సన్యాసిరావు, పైడ్రాజు, శివమ్మ, స్వాతి, నారాయణమ్మ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## అరకులోయలో మంచినీరు లేక నానా అవస్థలు

- తాగడానికి చుక్క నీరు లేక మహిళల గగ్గోలు :
- మంచినీరుసమస్యపరిష్కరించడంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారుల
- నిర్లక్ష్యమే కారణం: ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్



**అరకులోయ, నవంబర్ 25 (మనసులో మాట ):** ఆంధ్ర ఊటీ ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో గత వారం రోజులుగా త్రాగడానికి మంచి నీరు లేక అరకులోయ ప్రజలు నాన్న అవస్థలు ఎదుర్కొంటున్నారని తక్షణమే మంచినీటి సరఫరా చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరిజిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూ ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో గత వారం రోజుల నుండి మంచినీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని అరకులోయ మండల కేంద్రంలోని సి కాలనీ,బి కాలనీ, పోస్ట్ ఆఫీస్ కాలనీ, శరభ గూడ హౌసింగ్ కాలనీ, రెంటల్ హౌసింగ్ కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి కాలనీ, శరభగుడ, ఆదివాసికాలనీ,కొండవీధి,అరకులోయ టౌన్ పరిధిలో సుమారు పదివేల మంది జనాభా కలిగి ఉన్నారని గత వారం రోజుల నుండి మంచినీటి సరఫరా లేదని ఆర్డబ్ల్యూఎస్ శాఖ మరియు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లనీటిసరఫరానిలిచిపోయిందని మంచినీటి నిర్వహణ మరమత్తు పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు పెడుతున్న అరకులోయ రక్షిత మంచినీటి పథకం శాశ్వత పరిష్కారం జరగడంలేదని బాలదేవ్ తెలిపారు. ఇప్పటికైనాతక్షణమే సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మంచినీరు సమస్య పరిష్కరించాలని లేని లేనియెడల అరకులోయ టౌన్షిప్ ప్రజలతో కలిసి ఆందోళన బాలదేవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శరభగూడ హౌసింగ్ కాలనీ మహిళలు పూర్ణిమ,వరహాలమ్మ, కాసులమ్మ, లక్ష్మి, శాంతి బుజ్జి,డొమిని శరభ గూడ హౌసింగ్ కాలనీ యూత్ శ్రీను కుమార్, జనార్ధన్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## అన్నదాత సుఖీభవ పై సర్వే



**చీడికాడ, నవంబర్ 25, (మనసులో మాట)..** ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన వారందరికీ డబ్బులు పడింది ,లేనిది వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలో చుక్కపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచార నిర్వహించి వివరాలు పెండింగ్ ఉన్న వారి వివరాలు అడిగి తెలుసుకుని అసిస్టెంట్ నివేదిస్తామని ఈ సర్వేలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి రామలింగేశ్వర రావు అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియాంక వెటర్నరీ అసిస్టెంట్ సుధ తెలిపారు

## అనారోగ్యంతో ఎంపీ సి.ఎం.రమేష్ తల్లి

### మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు పరమార్శ




**అనకాపల్లి, నవంబర్ 25 (మనసులో మాట):** కడప జిల్లా పోట్లదుర్తి లో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ తల్లి అనారోగ్యంతో తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో మంగళవారం మాడుగుల శాసనసభ సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం శాసనసభసభ్యులు కే.ఎస్.ఎన్.ఎస్ రాజు ప్రత్యేకంగా వెళ్లి పరామర్శించారు. ఎంపీ సి.ఎం రమేష్ తల్లి ని ప్రత్యక్షంగా చూసిన తర్వాత ఆరోగ్య స్థితి పై అక్కడ వైద్యుల నుంచి వివరాలు అడిగి శాసనసభ్యులు సత్యనారాయణమూర్తి, కె.ఎస్.ఎన్.ఎస్ రాజు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ సిఎం రమేష్ కుటుంబసభ్యులకు ధైర్యం తెలియజేసి, తల్లి త్వరగా కోలుకోవాలని దేవున్ని కోరుకుంటున్నట్లు వారు తెలియజేశారు.

# 'డెల్టా'లో మీడియా రచ్చ రచ్చ

## జర్నలిస్టులపై ఏంటీ వివక్షత?!

- ఏమనుకుంటున్నారు..
- ఎందుకు వర్గాలుగా చీలుస్తున్నారు..
- ప్రెస్మీట్లకు పిలిచి..అవమానిస్తారా..
- ఇదేమి సంస్కారం..
- డెల్టా ఆసుపత్రి యాజమాన్యంపై నిప్పులు చెరిగిన కలం వీరులు
- కుర్చీలకు అంటించిన స్టిక్కర్లు హాస్పిటల్ యాజమాన్యం తొలగించినా శాంతించని మీడియా
- చేతులు జోడించి క్షమాపణలు చెప్పినా మెట్టు దిగని జర్నలిస్టులు
- మీడియా ఆగ్రహంతో చేసేదేమీ లేక..ప్రెస్మీట్ రద్దు చేసుకున్న డెల్టా హాస్పిటల్ నిర్వాహకులు





**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** మీడియా ఐక్యతగా ఎలా ఉంటుందో.. కన్నెర్రజేస్తే ఏమవుతుందో డెల్టా ఆసుపత్రి నిర్వాహకులు అనుభవపూర్వకంగా చూశారు. మంగళవారం ప్రెస్మీట్ పేరుతో మీడియాను పిలిచి, అందులో కొన్ని పత్రికల ప్రతినిధులకు కుర్చీలు రిజర్వ్ చేసి..ఆయా పత్రికల పేర్లతో స్టిక్కర్లు అంటించి..మిగిలిన పత్రికల ప్రతినిధులను ఘోరంగా అవమానించింది. యధాలాపంగా ప్రెస్మీట్ కు వచ్చిన ఎలక్ట్రానిక్ అండ్ ప్రింటింగ్ మీడియా ప్రతినిధులు ఇది చూసి ఒక్క క్షణం అవాక్కయ్యారు. ఏమిటీ వివక్షత అని సూటిగా హాస్పిటల్ మేనేజ్మెంట్ ను ప్రశ్నించారు. గతంలో ఎన్నో సార్లు మీడియా సమావేశాలు నిర్వహించారు.. అప్పుడు లేని ఈ వివక్షత ఎందుకు చూపిస్తున్నారంటూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. కుర్చీలు వేయడం వరకూ మంచిదే కానీ..కొన్ని పత్రికల ప్రతినిధులకు ముందు వరుసలో..అదీ ఆయా పేపర్ల పేరుతో స్టిక్కర్లు అంటించి, మిగిలిన వారు ఉంటే ఉండండి..లేదంటే పొండి అన్నట్టు నీఛంగా, చులకనగా చూస్తారా అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముందు ఆ కుర్చీలకు అంటించిన పేపర్ స్టిక్కర్లు తొలగిస్తారా తొలగించరా అని నిలదీశారు. అసలు ఈ విధమైన చర్యలు తీసుకోమని మీకు చచ్చు సలహా ఇచ్చిందెవరని ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులు ఒక్కసారిగా హాస్పిటల్ లో ఇంత రాద్ధాంతం చేసేసరికి ఏమి సమాధానం చెప్పాలో, ఎలా సముదాయించాలో నిర్వాహకులకు అర్థం కాలేదు. చాలా సేపు మీడియాను శాంతింపజేయడానికి హాస్పిటల్ మేనేజ్మెంట్ యత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి కుర్చీలకు అంటించిన స్టిక్కర్స్ తొలగించి, చేతులు జోడించి నమస్కరించి తప్పయిందని క్షమాపణలు చెప్పినా మీడియా మాత్రం తమ ఉగ్ర రూపాన్ని వీడలేదు. మొత్తంపై ప్రెస్మీట్ రద్దయింది. మరోసారి అందర్నీ పిలిచి నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పడంతో మీడియా అక్కడ నుంచి వెనితిరిగింది. కనీసం హాస్పిటల్ నిర్వాహకులు మీడియాకు ఏర్పాటు చేసిన ఆతిధ్యాన్ని కూడా స్వీకరించకుండా హాస్పిటల్ నుండి బయటకు రావడం హర్షనీయం.



కాకపోతే.. ఇది హాస్పిటల్ నిర్వాహకుల తప్పిదం కాకపోవచ్చు. మీడియాను అవమానించాలని ఎవరూ అనుకోరు. దీని వెనుక కొంతమంది బ్రోకర్ల సలహాల వల్ల ఇటువంటి తప్పిదం జరిగిందని మీడియా ప్రతినిధులకు తెలుసు. నిజానికి మీడియా ఆగ్రహం వ్యక్తం చేసింది కూడా డెల్టా హాస్పిటల్ నిర్వాహకులపై కానే కాదని తెలుస్తోంది. కొంతమంది మీడియాను వర్గాలుగా చీల్చి..వారిలో తమకు అనుకూలమైన వారిని అందలం ఎక్కించడం, వారే అసలైన మీడియా ప్రతినిధులు అన్నట్టు కవరింగ్ ఇవ్వడాన్ని మాత్రమే రాద్ధాంతం చేసిన మీడియా ప్రతినిధుల ఆగ్రహం. నగరంలో ఈ మధ్య సభలు, సమావేశాలు, ప్రత్యేక కార్యక్రమాలు, ప్రారంభోత్స వాలు, ఆసుపత్రులలో సమావేశాలు నిర్వహించే టప్పుడు సంబంధిత నిర్వాహకులను తప్పుదారి పట్టిస్తున్నది మీడియాలోని ఒక వర్గం. దీంతో పాపం నిర్వాహకులు ఇదిగో డెల్టా హాస్పిటల్ నిర్వాహకులు మాదిరిగా అవమానాలు, నిందల పాలుకాక తప్పడం లేదు. ఎవరికి వారు



గ్రూపులుగా ఏర్పడి మొత్తం అందర్నీ అయోమయానికి గురి చేస్తున్నారు. మీడియాకు ఉన్న విలువలను 'కొంతమంది' వల్ల నవ్వుల పాలవుతోంది. అన్నదమ్ముల్లా ఐక్యతతో ఉండే పాత్రికేయుల మధ్య చిచ్చు రాజేసి తమ పబ్బం గడుపుకొంటున్న ఎవరైనా సరే..అది క్షమించరానిదే. ఇప్పటికైనా పాత్రికేయ పెద్దలు జోక్యం చేసుకుని..గాడిలో పెట్టేందుకు యత్నించకపోతే.. సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడుతున్న మీడియా రంగం నడి రోడ్డుపై నవ్వులపాలు కాక తప్పదు. మంగళవారం డెల్టా హాస్పిటల్ లో ఒకే మాట, ఒకే స్వరంగా వ్యవహరించిన మీడియా సోదరులు ప్రెస్ క్లబ్ విషయంలో కూడా అదే తరహా విధానంతో వ్యవహరించి, సమస్య పరిష్కరిస్తే మంచిది. డెల్టా హాస్పిటల్ లో కుర్చీలకు స్టిక్కర్లు అంటించి వ్యత్యాసం చూపించినందుకే ఒంటి కాలిపై లేచారు సంతోషం. అదే స్ఫూర్తి, అదే పట్టుదల, అదే ఐక్యతతో రాజమండ్రి ప్రెస్ క్లబ్ సమస్యను కూడా పరిష్కరిస్తే అందరూ హర్షిస్తారు. ఆల్ ది బెస్ట్.

### ఏలూరు జిల్లాలో డిసెంబర్ 1న

# సీఎం పర్యటన



**ఉంగుటూరు/ఏలూరు, నవంబర్, 25(మనసులో మాట)..** ఉంగుటూరు మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంగళవారం ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పరిశీలించారు. ఉంగుటూరు మండలంలో ముఖ్యమంత్రివర్యులు పాల్గొనే కార్యక్రమాలకు అనుకూలమైన ప్రాంతాలు గుర్తించేందుకు ఉంగుటూరు, కైకరం, నారాయణపురం,చేబ్రోలు గ్రామాలలో పలు ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రివర్యులు డిసెంబర్, 1వ తేదీన ఉంగుటూరు మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ మరియు,బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉందని , దీనితోపాటు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రివర్యులు పాల్గొనే కార్యక్రమాలను రూపొందించడానికి, హెలిప్యాడ్ ఏర్పాటుచేసేందుకు అనువైన ప్రదేశం, ముఖ్యమంత్రి పర్యటనలో ఏ గ్రామంలో పెన్షన్ల పంపిణీ మరియు ఇతర కార్యక్రమాలకు అనువైన ప్రాంతాలను గుర్తించే విషయాలపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు,ముఖ్యమంత్రి కార్యాలయ సమన్వయాధికారి రఘు తో కలిసి చర్చించి, క్షేత్రస్థాయిలో అనువైన ప్రాంతాలను పరిశీలించారు.గొల్లగూడెం వద్ద హెలిపాడ్, బహిరంగ సభ, కార్యకర్తల సమావేశంనకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు.అనంతరం చేబ్రోలు, గోపీనాథపట్నం లలో పేదలకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు.

### నేడు ఉప ముఖ్యమంత్రి పవన్

# కోనసీమ పర్యటన



**అమలాపురం (మనసులో మాట) నవంబరు 25:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ నేడు బుధవారం ఉదయం 9.00 గంటలకు హైదరాబా దు బేగంపేట విమానాశ్ర యం నుండి విమానంలో బయలుదేరి 9:45 నిమిషా లకు మధుర పూడి విమా నాశ్రయం చేరుకుంటారు. మధురపూడి విమానాశ్ర యం నుండి హెలికాప్టర్లో బయలుదేరి ఉదయం 10. 10 నిమిషాలకు మల్కిపు రం మండలం గూడపల్లిలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. 10 15 నిమిషాలకు కేశనపల్లి వ్యూ పాయింట్ చేరుకొని శంకర గుప్తం మేజర్ డ్రైనేజీ మూలంగా దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీ లిస్తారు. స్థానికంగా 20 మంది బాధిత రైతులతో ముఖాముఖిగా కొబ్బరి తోటలు దెబ్బ తినడానికి గల కారణాలపై చర్చిస్తారు. అనంతరం 11 గంటలకు రాజోలు మండలం శివకోడు కు రోడ్డు మార్గం ద్వారా చేరుకుని 11:20 గంటలకు ఫోటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు. రాష్ట్ర స్థాయిలో పల్లె పండుగ 2.0 పైలాన్ ను ఆవిష్కరిస్తారు. అనంతరం బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తారు. తదు పరి శివకోడు నందు ఏర్పా టుచేసిన హెలిప్యాడ్ నుండి హెలికాప్టర్లో బయలుదేరి మధురపూడి విమానాశ్ర యానికి చేరుకొని అక్కడ నుండి విమానంలో బయలుదేరి బేగంపేట చేరుకుంటారు.

# ప్రజాధనం రాళ్లు రప్పల పాలు

- పుష్కరాల రేవు... దేవీచౌక్ వద్ద నిత్యం ప్రమాదాలు
- కనీస జ్ఞానం లేకుండా ఆ ప్రాంతాల్లో రాళ్లతో పనులు
- నేను చెప్పిందే చేయండి అనే రీతిలో భరత్ రామ్ రాళ్లు వేయించాడు
- సొంత ఖజానాలా భరత్ రామ్ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశాడు
- పత్రికా ప్రకటనలో భరత్ రామ్‌ను దుయ్యబట్టిన దొండపాటి... స్వాతి సత్యనారాయణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని పాపాలన్నీ చేసిందని, ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ రాష్ట్రాన్ని నాశనం చేస్తే... మిడిమిడి జ్ఞానం, అనాలోచిత పనులతో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ రాజమహేంద్రవరాన్ని సర్వనాశనం చేశాడని ఛాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, దేవీ చౌక్ వర్తక సంఘం అధ్యక్షుడు స్వాతి సత్యనారాయణ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం వారు సంయుక్తంగా ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్ళ వైసీపీ నాయకులు చేసిన అవినీతి పనులు ప్రజలకు శాపాలుగా మారాయని దుయ్యబట్టారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ సొంత అజెండాతో పనిచేసి అడ్డదిడ్డంగా వ్యవహరించి దేవీచౌక్, పుష్కరఘాట్ లో రాళ్ళు వేయడం వల్ల నిత్యం వీటిని తన్నుకుని ప్రజలు పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రచారానికి వెళితే ప్రజలు, వ్యాపారులు ముక్త కంఠంతో ఏకేసీ కాలేజీ రోడ్డులో హ్యాపీ స్ట్రీట్ తొలగించాలని, మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ స్తంభాలు తీసివేయాలని, దేవీచౌక్ పుష్కరఘాట్ లో రాళ్ళపై రోడ్డు వేయాలని అడిగేవారని గుర్తు చేశారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మెయిన్ రోడ్డులో లైట్లు, హ్యాపీ స్ట్రీట్ తొలగించారని, పుష్కరాల రేవు, దేవీచౌక్ వద్ద ఉన్న రాళ్ళు విషయంలో విజిలెన్స్ విచారణ జరుగుతోందని త్వరలో వీటికి మోక్షం కలుగుతుందని అన్నారు. దేవీచౌక్ లో రాళ్ళు పైకిలేచి పోవడం వల్ల రోజూ ద్విచక్ర వాహనాలపై వెళ్ళేవారు, పాదచారులు పడిపోతున్నారని, కాళ్ళు చేతులు విరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మార్గాని భరత్ రామ్ తన మొండితనం... ఒంటెద్దు పోకడలతో ఈ రాళ్ళు వేసి ప్రజాధనం దుర్విని యోగం చేశాడని మండిపడ్డారు.



దేవీచౌక్, పుష్కరఘాట్ లో అవగాహన లేకుండా రాళ్ళు వేయించి మాజీ ఎంపీ మార్గాని భరత్ ప్రజాధనం దుర్వినియోగం చేశాడని విమర్శించారు. దేవీచౌక్ లో రోజూ పది పన్నెండు మంది పడిపోతున్నారని, వర్షం వస్తే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని మండిపడ్డారు. ప్రజల ఇబ్బందులను గుర్తించకుండా కేవలం పబ్లిసిటీ పిచ్చితో ప్రజాధనం దుర్వినియోగం చేశాడని మండిపడ్డారు. ప్రజల అభీష్టం మేరకు త్వరలో రాళ్ళు పూర్తిగా తొలగించడం లేదా పైన రోడ్డు వేయడం జరుగుతుందన్నారు.

### ఉప ముఖ్యమంత్రి పర్యటనకు

# పటిష్ట బందోబస్తు

**- జిల్లా ఎస్పీ రాహుల్ మీనా**





**బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ (మనసులో మాట) నవంబరు 25:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నేడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోనసీమలో పర్యటించనున్న నేపథ్యంలో మలికిపురం మండలం, కేసనపల్లి గ్రామంలో చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా దగ్గరుండి పర్యవేక్షించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించనున్న ప్రాంతాలను, సభ జరగబోయే ప్రదేశాలను ఎస్పీ స్వయంగా సందర్శించి భద్రతా పరమైన లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఎటువంటి ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా ఉండేందుకు, ముందు జాగ్రత్త చర్యగా కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బందోబస్తు విధులకు హాజరైన ఉన్నతాధికారులు, సిబ్బందితో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడారు. విధుల్లో అలసత్వం వహించరాదని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో భద్రత విషయంలో రాజీపడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఏవిఆర్పి బి ప్రసాద్, డిఎస్పీలు, సి.ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


# ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం



**ఏలూరు, నవంబర్, 25 (మనసులో మాట)..** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్ లో ధాన్యం సేకరణలో రైతులు ఎదుర్కనే సమస్యలను ముందుగానే గుర్తించి వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం, రహదారులు, తదితర శాఖల ప్రగతిపై సమీక్షించారు.కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్లో జిల్లాలో రికార్డు స్థాయిలో 4. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు లక్ష్యంగా నిర్దేశించారని, ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరించిన గంటల వ్యవధిలోనే రైతులకు ధాన్యం సొమ్ము ప్రభుత్వం జమ చేస్తున్నదన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే 51 డ్రోన్లు రైతులకు అందించామన్నారు. ఈ-పంట నమోదు నూరుశాతం పూర్తిచేశామన్నారు. రైతులకు నాణ్యమైన గోనెసంచుల అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలన్నారు. 10వ తరగతిలో జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రధమ స్థాయిలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా పరిషత్ ద్వారా విజయకేతనం పుస్తకాన్ని విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. రహదారులు గుంతలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా చూడాలన్నారు.ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఒక చక్కని వేదికని, ప్రతిపక్షాలు రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలను మాత్రమే సమావేశం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి సహకరించాలన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని, గుంతలు లేని రహదారులు ఉండేలా ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పిహెచ్సి భవనాలు పూర్తిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ 'రైతన్న.. మీ కోసం' కార్యక్రమం ద్వారా ప్రతీ రైతు ఇంటికి వెళ్లి వ్యవసాయంలో పంచ సూత్రాలు, అగ్రిటెక్ లపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాగులో రైతులు ఎదుర్కనే సమస్యలు, రైతుల అభిప్రాయాలను తెలుసుకుని యాప్ లో వ్యవసాయాధికారులు యాప్ లో పొందుపరుస్తున్నారన్నారు. రాబోయే రబీ, ఖరీఫ్, అనంతరం రబీ వ్యవసాయ సీజన్లకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలు వ్యవసాయాధికారులు రూపొందిస్తున్నారన్నారు. శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో టాయిలెట్లు, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలపై విద్యా శాఖాధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు.ప్రైవేట్ పాఠశాలలో సరైన టాయిలెట్లు లేని కారణంగా టాయిలెట్ కు వెళ్లాల్సి వస్తుందని భయంతో పాఠశాల సమయంలో త్రాగునీరు తీసుకోవడంలేదని, దీనికారణంగా శారీరక రుగ్మతలు కలిగే అవకాశం ఉందన్నారు. విద్యా శాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. తణుకు వద్ద పశు మాంస కబేళాలు నిర్వహిస్తున్నారని, వీటి కారణంగా పర్యావరణానికి పెనుముప్పు కలగడమే కాక, ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కుంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులను మంజూరులో అధిక జనాభా కలిగిన గోపాలపురం నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నీటమునిగిన పంటలకు నష్టం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై వ్యవసాయ శాస్త్రజ్ఞులతో రైతులకు అవగాహన కలిగించాలన్నారు. రైతుల సంక్షేమంలో ప్రతిపక్ష సభ్యులు రాజకీయం చేయవద్దన్నారు. గత ప్రభుత్వం గోపాలపురం నియోజకవర్గంలో 29 వేల 385 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే, గత వ్యవసాయ సీజన్లో 48 వేలా 787 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, గత ప్రభుత్వం రైతులకు ధాన్యం సొమ్ము జమచేసేందుకు నెలల తరబడి ఆలస్యం చేస్తే, తమ ప్రభుత్వం గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలకు సొమ్ము చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు బకాయిలు పెట్టిన 1634 కోట్ల రూపాయలను తమ ప్రభుత్వం రైతులకు అందించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులలో సృజనాత్మకత , క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



# పేద ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలి - ఎంపీడీవో



**పెదపూడి, (మనసులో మాట) నవంబర్ 25..** ప్రభుత్వ ఆసుపత్రులలో పేద ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని పెదపూడి ఎంపీడీవో నరేంద్ర రెడ్డి కోరారు. మంగళవారం పెదపూడి మండలం సంపర గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీవో నరేందర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పేద ప్రజలకు ప్రాథమిక వైద్యాన్ని, మందులను సక్రమంగా అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రిలో ఓపి పెంపుదలకు వైద్యులు కృషి చేయాలి అన్నారు. అత్యవసర మందులను ఆసుపత్రిలో నిత్యం సిద్ధంగా ఉంచాలని నరేందర్ రెడ్డి ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి చిన్ని తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రిలో సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కృషితో ఆసుపత్రి అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని ఎంపీడీవో నరేంద్ర రెడ్డి తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## కాంగ్రెసుతోనే ప్రజాస్వామ్యం సాధ్యం

- అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు
- గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి
- జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన్ శ్రీజాన్ అభయాన్ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకురాలు అంబా ప్రసాద్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయడంపై ఏఐసీసీ దృష్టి సారించిందని ఏఐసీసీ పరిశీలకులరాలు అంబా ప్రసాద్ వెల్లడించారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అంబా ప్రసాద్ పాటు పీసీసీ మహిళా విభాగం ఇన్చార్జ్, పరిశీలకురాలు అబిత, పీసీసీ పరిశీలకులు రాజీవ్ రతన్, బాజ్జీ, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు సాగి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి రావడానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ అని ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పార్టీని బలోపేతం చేసేందుకు సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా డీసీసీ అధ్యక్షులను ఎంపిక చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి నిజమైన గుర్తింపు ఇవ్వడానికే ఈ విధానాన్ని ఏఐసీసీ అమల్లోకి తెచ్చిందన్నారు. నాయకులు, కార్యకర్తలతో వ్యక్తిగతంగా తాము మాట్లాడిన తరువాత దాన్ని నివేదిక రూపంలో ఏఐసీసీకి అందజేస్తామన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేలా పార్టీ నాయకులు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతలను తొలగించి ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ అధికారంలోకి తెచ్చేలా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులనే పార్టీ ఎంపిక చేస్తుందని, ఈ విషయంలో ఎటువంటి అపోహాలు వద్దని సూచించారు. క్షేత్ర స్థాయి నాయకుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించి నేరుగా ఏఐసీసీ నాయకులతో మాట్లాడేందుకు కూడా అవకాశం కల్పించాలన్నదే కాంగ్రెస్ లోక్ సభా పక్షనేత రాహుల్ గాంధీ ఉద్దేశ్యమన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి కేంద్ర పరిశీలకులు, పార్టీ కీలక నేతలకు కిరీటం, పూలమాల, దుశ్శాలువాతో ఘన సత్కారం చేశారు. ఏఐసీసీ సభ్యురాలు అమర్ జహా బేగ్, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, జేటీ రామారావు, మేడవరపు భద్రం దొర, ఎస్ఎకే అర్షద్, మోతా శారద తదితరులు పాల్గొన్నారు.

## షష్టికి ముస్తాబైన సుబ్రమణ్య స్వామి ఆలయాలు




**ఆత్రేయపురం( మనసులో మాట నవంబర్ 25..** షష్టి సందర్భంగా మండలంలోని సుబ్రమణ్య స్వామి ఆలయలు అందంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలంకరణ, చలువ పందుర్లు రంగులతో,ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి.. ఆత్రేయపురం వల్లి దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, ర్యాలీ పేరవరం గ్రామాల్లో ఉన్న సుబ్రమణ్య స్వామికి ఉదయం అభిషేకం, మధ్యాహ్నం, గ్రామోత్సవం,సాయంత్రం కళ్యాణం, అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, అందించనున్నట్లు,ఆలయ కమిటీ తెలిపారు.
భక్తులకు ఇబ్బందులకు కలుగకుండా ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగునని తెలిపారు.

## రాజమండ్రి 'జనసేన'లో

# అంతర్యుద్ధం..

- నగర అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్చార్జి అనుశ్రీల మధ్య ఆధిపత్య పోరు
- ఇద్దరి దృష్టి మేయర్ పదవిపైనే.. - మంత్రి నాదెండ్ల స్వాగత ఫ్లెక్సీలలో బయటపడ్డ విభేదాలు








**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జనసేన పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందనే ప్రచారానికి సోమవారం నాటి సంఘటన అద్దం పడుతోంది. జనసేన సీనియర్ నేత, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా నాయకులు పోటాపోటీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ర్యాలీలపైనే అందరి దృష్టి. గుసగుసలు. ఆసక్తికర చర్చ నడుస్తోంది. రాజమండ్రి సిటీ నియోజకవర్గ జనసేన ఇన్చార్జి అత్తి సత్యనారాయణ (అనుశ్రీ), రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ జనసేన అధ్యక్షుడు వై శ్రీనివాస్.. ఒకప్పుడు జనసేన పార్టీలో రామలక్ష్మణులుగా కనిపించేవారు. ఇప్పుడు ఉప్పు - నిప్పుగా తయారయ్యారనేది నగర వాసుల మనసులో మాట. ఈ ఇద్దరూ ఎవరికి వారు పోటాపోటీగా ఫ్లెక్సీలు, పెద్ద పెద్ద హోర్డింగ్స్ ఏర్పాటు చేశారు. జిల్లాకు విచ్చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ కు భారీగానే స్వాగత ఏర్పాట్లు ఫ్లెక్సీల రూపంలో దర్శనమిచ్చాయి. ఏర్పాట్లు ఎంత భారీగా చేశారో..ఆ పార్టీ కీలక నేతల్లో అంతకు మించి ఎక్కువ వర్గ విభేదాలు ఉన్నాయని జనసైనికులే బాహాటంగా చెబుతున్నారు. నగర నడిబొడ్డు ప్రధాన సెంటర్ స్థానిక షెల్టాన్ హోటల్ వద్ద మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలను పరిశీలిస్తే..వర్గ విభేదాలు చెప్పకనే తెలుస్తాయి.




మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ అధ్యక్షుడు వై శ్రీనివాస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ప్రధాన మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం, రాజమండ్రి ఎంపీ, రాజమండ్రి సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. ఇలా అందరి నేతలను ప్రసన్నం చేసుకునే విధంగా ఫోటోలు ముద్రించారు. రాజమండ్రి సిటీ ఇన్చార్జి అనుశ్రీ మాత్రం నిఖార్సయిన జనసేన పార్టీ నేతగా..ఎక్కడా ఇతర పార్టీల నేతల ఫోటోలను తన ఫ్లెక్సీలలో ముద్రించకుండా కేవలం జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ ఫోటోలతోనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కేవలం ఫ్లెక్సీల వరకే కాకుండా.. మంత్రి నాదెండ్లను కలవడంలో కూడా ఎవరికి వారుగానే వ్యవహరించారు. నగర మున్సిపల్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు వై శ్రీనివాస్ తన అనుచరులతో ర్యాలీ గా బయల్దేరి కోటిపల్లి బస్టాండు జంక్షన్ వద్ద మంత్రిని కలిశారు. సిటీ ఇన్చార్జి అనుశ్రీ నేరుగా తమ అనుచరులతో షెల్టాన్ హోటల్ లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి మొన్న ఎన్నికల వరకూ, ఆ తరువాత కూటమి అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల పాటు శ్రీనివాస్, అనుశ్రీ నగరంలో జనసేన కీలక నేతలుగా మంచి గుర్తింపు, సమర్థత గల నాయకులుగా గుర్తింపు పొందారు. వీరిద్దరి సమన్వయం కారణంగా జనసేన కేడర్ కూడా సమర్థవంతంగా, ఎటువంటి స్వార్థం లేకుండా పార్టీ పటిష్టతే ముఖ్యం, పార్టీ అధినాయకుడే ఆదేశాలే శిరోధార్యం అన్నట్టు క్రమశిక్షణతో పార్టీని నడిపించారు. జనసేన పార్టీని కానీ, నేతలను కానీ పల్లెత్తు మాట ఎవరూ అనడానికి వీల్లేని విధంగా వ్యవహరించారు. మరి ఇప్పుడు.. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కూటమిలో కీలక పాత్ర జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దే. అటువంటి పార్టీలో దిగువ స్థాయి కేడర్ మరెంత హుందాగా వ్యవహరించాలి కదా. కానీ..జనసేన పార్టీలో ఇప్పుడు ఒక్క రాజమండ్రి అనే కాదు..అంతటా ఆధిపత్య పోరు, పదవీ కాంక్షతో అంతర్యుద్ధం కాస్తా బహిరంగమై ఆ పార్టీ శ్రేణులకు తలనొప్పి తీసుస్తున్నారు. ఇటీవల 'హరిహర వీరమల్లు' పవన్ సినిమా విడుదల విషయంలో ఏర్పడ్డ వివాదంలో అనుశ్రీ పేరును నిర్మాత దిల్ రాజ్ వెల్లడించడం..ఆ వెనువెంటనే అనుశ్రీని పార్టీ పదవి నుంచి తొలగించి, పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉండాల్సిందిగా జనసేన పార్టీ ఆదేశించింది. ఆ తరువాత అనుశ్రీ తప్పేమీ లేదని నిర్ధారించుకున్నాక మళ్ళా సిటీ ఇన్చార్జి గా అనుశ్రీకి పగ్గాలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ మధ్య కాలంలో జనసేన పార్టీ వ్యవహారాలను మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్ సిటీ ఎమ్మెల్యే వాసుతో పాటు ఉండి చక్కగా నిర్వర్తించారు. ఇదిగో ఈ సమయంలోనే..ఈ గ్యాప్ లోనే అనుశ్రీ, శ్రీనివాస్ మధ్య విభేదాలు పొడసూపాయి. దీనికి కారణాలు జనసైనికులు రకరకాలుగా చెబుతున్నా.. వాటికన్నా ప్రధానమైంది ఒకటే. అదే రాజమండ్రి మేయర్ పదవి. ఈ ఇద్దరు నాయకులకు మేయర్ పదవిపైనే వ్యామోహం ఉందని, అందువల్లనే జనసేన నేతలు శ్రీనివాస్, అనుశ్రీ వర్గ విభేదాలతో ఎత్తుకు పై ఎత్తు వ్యూహాలతో పావులు కదుపుతున్నారనేది జనసేన పార్టీ శ్రేణులు, నగర వాసుల ప్రచారం. ఇదే విధంగా ఎవరికి వారుగా వ్యవహరిస్తే..ఉన్నది కాస్తా ఊడే అవకాశం ఉందంటున్నారు. ఐక్యతతో ఉంటేనే పార్టీ అయినా, పరువు అయినా, పదవి అయినా.

## కార్పొరేట్లకు

# దాసోహంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- మావోయిస్టులతో చర్చలు నిర్వహించాలి
- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్




**కాకినాడ (మనసులో మాట), నవంబరు 25:** కార్పొరేట్ కంపెనీల లాభాల కోసమే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని వారికి సహజ సంపదను దోచిపెడుతున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య తీవ్ర విమర్శలు చేశారు.సిపిఐ కాకినాడ జిల్లా మహాసభలు సందర్భంగా జరగనున్న మహాసభలకు హాజరయ్యేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక హోటల్లో ఈశ్వరయ్య విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హోం శాఖతో చర్చలు జరుపు కొనేందుకు అవకాశం ఇవ్వాలని కోరిన మావోయిస్టులను పట్టుకొని కాల్చి చంపడం తగదన్నారు. అలాగే తెలంగాణ వలే రాష్ట్రంలో కుల, గణన నిర్వహించి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్పోరేట్లకు కొమ్ముకాస్తూ అడవులు గనులు ఇతర సాధసంపదను కార్పొరేట్లకు అప్పగిస్తుందని చెప్పారు. మావోయిస్టులను బలవంతంగా తీసుకుపోయి కాల్చి చంపారన్నారు. లొంగిపోతామనే సమాచారాన్ని అందించారని వారు మరల తిరిగి విడుదలైతే కార్పొరేట్లను వ్యతిరేకంగా పనిచేస్తారని ఉద్దేశంతో మావోయిస్టులను దారుణంగా హతమార్చారన్నారు. ఇవంతా ఫేక్ కౌంటర్లని చెప్పారు. అటవీ సంపాదన రక్షిస్తున్న1600 మంది గిరిజన బిడ్డలను పొట్టన పెట్టుకున్నారన్నారు. మిగిలిన మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించి ఈ సమస్యను పరిష్కరించుకోవాలని ఈశ్వరయ్య సూచించారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం రద్దుచేసి వారిపై మోయలేని పని భారాన్ని మోపిందన్నారు. అలాగే ప్రైవేట్ పరం కాకుండా విశాఖ స్టీల్ ప్లాంట్కు గనులు కేటాయించి దాన్ని కాపాడుకోవాలని సీఎం చంద్రబాబుకి సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా స్టీల్ ప్లాంట్కు గనులు కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విశాఖలో పారిశ్రామిక సదస్సు నిర్వహించి రాష్ట్రానికి 20 లక్షల కోట్లు వస్తున్నాయని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంత ముందు అతని హయాంలో 20 లక్షలు కోట్లు తర్వాత జగన్ నయాలో 20 లక్షలు కోట్లు ఇప్పుడు 20 లక్షలు కోట్లు కలిపి 60 లక్షల కోట్లు ఎక్కడ వచ్చాయో చెప్పాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. కడప స్టీల్ ప్లాంట్, రామాయపట్నం పోర్టు, దొనకొండ పారిశ్రామిక వాడ కాకినాడ సెజ్ ఏమయ్యాయి వాటిని పరిస్థితిలేమిటో బహిర్గతం చేయాలన్నారు. ఎందరో త్యాగధనుల త్యాగాలతో నిర్మించుకున్న స్టీల్ ప్లాంట్ను కాపాడాలని సూచించారు ఈనెల 26వ తేదీన ఖమ్మంలో సిపిఐ వందేళ్ళ వార్షిక వేడుకలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆ రోజు లక్ష మందితో జన సేవాదళ్ కవాతు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు జగన్ పవన్ మోడీకి భజన చేస్తున్నారే తప్పా ఇచ్చిన హామీల అమలు కోసం నిలదీయడం లేదన్నారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వాలకు సిపిఐ ప్రత్యామ్నాయ విధానంగా మారుతుందని అందుకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించి యువతలో చైతన్యం పెంపొందించి అన్ని సామాజిక వర్గాలను కలుపుకుపోతామని ఈశ్వరయ్య చెప్పారు.

ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు, సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కే బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నగర కార్యదర్శి పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## యానాంలో యూనిటీ మార్చ్ ర్యాలీ

### జెండా ఊపి ప్రారంభించిన ఆర్ ఏ ఓ అంకిత్ కుమార్

**యానాం (మనసులో మాట), నవంబర్ 25:** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ యానం కేంద్రం, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంత్ ఉత్సవాల్లో భాగంగా యూనిటీ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియం నుండి అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ వరకు విద్యార్థులు యూనిటీ మార్చ్ పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యానం ప్రాంతీయ పరిపాలన అధికారి అంకిత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం బి ఆర్ అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సభలో పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్పతనాన్ని యువతకు వివరించారు. యువత మండల స్థాయి నుండి అంచలంచలుగా అంతర్జాతీయ స్థాయికి వారి వారి ప్రతిభను చూపించాలని యువతకు ఉపన్యాసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, సార్క్ ఆర్ట్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వి. భాష్కర్ రెడ్డి ఎన్ఎస్-ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, మదర్ థెరిసా నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ కనకాల శ్రీనివాసు , మై భారత్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు శ్రీనివాస్, శాంతరాజు, ఆనంద్, తాతారావు , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యానం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో రోడ్లు నిర్మాణానికి

# అత్యధిక ప్రాధాన్యత

- రూ. 1.40 కోట్లు వ్యయంతో రైల్వే స్టేషన్ రోడ్డు నిర్మాణం
- సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ





**తణుకు (మనసులో మాట)నవంబర్ 25..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన తణుకు రైల్వే స్టేషన్ రోడ్డును శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేపట్టామని చెప్పారు. మంగళవారం తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ రైల్వే స్టేషన్, హాస్పిటల్స్ ఉండడంతో నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటోందని ఈ క్రమంలో రైల్వే స్టేషన్ నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు రోడ్డు శిధిలావస్థకు చేరడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా సుమారు 21 అడుగుల వెడల్పు 10 అంగుళాల ఎత్తులో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. తణుకు పట్టణానికి మంజూరైన రూ. 3 కోట్ల నిధులలో సుమారు రూ. 1.40 కోట్లు నిధులు ఈ రోడ్డు, నిర్మాణానికి కేటాయించామన్నారు. దీంతోపాటు ఎక్సెల్ రోడ్డు నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రపతి రోడ్డుకు ప్రత్యామ్నాయంగా కప్పల వెంకన్న సెంటర్ నుంచి స్త్రీ సమాజం రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా నేరుగా జాతీయ రహదారి పైకి వెళ్లేలా రోడ్లు అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. రాబోయే రెండు మూడు వారాల్లో ఈ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి రావడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కేరళ హైస్కూల్ విద్యార్థికి అభినందనలు



**తాళ్ళరేవు (మనసులో మాట), నవంబరు 25:** మండల కేంద్రమైన తాళ్ళరేవులోని శ్రీ కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి రాయుడు బాలకిరణ్ ను జిల్లా కలెక్టర్ సగిలి సన్మోహన్ అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనితీరును అధ్యయనం చేసి కలెక్టరేట్లో ప్రసంగం చేసినందుకుగాను బాల కిరణ్ కు అవార్డు లభించింది. ఈ సందర్భంగా బాల కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఏ పనులు చేస్తారు అవి ప్రజలకు ఎలా ఉపయోగపడతాయి అనే విషయాన్ని తెలుసుకోవడంతో పాటు జిల్లా కలెక్టర్కు వివరించడంతో తనను ఈ అవార్డు ఎంపిక చేశారని తెలిపాడు. అవార్డు పొందిన విద్యార్థిని స్కూల్ కరస్పాండెంట్ బి వి ఏ కుమార్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు. పి.బి సినిమోల్, వివి సత్యనారాయణ, మనోహర్ రాజశేఖర్ షహనాజ్ సత్య శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



కూల్చడం.. తొలగించడమే

# అభివృద్ధా?!

## – భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకుడు అత్తిలి రాజు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** నాయకుల మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో అభివృద్ధిని కూల్చాలనుకోవడం అభివృద్ధి కాదని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకుడు అత్తిలి రాజు అన్నారు. ఇటువంటి సంస్కృతిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ ప్రోత్సహించకూడదని అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పుష్కర్ ఘాట్, దేవి చౌక్, హ్యాపీ స్ట్రీట్ వంటి ప్రజా సౌకర్యాలను ఎందుకు తొలగించాలనుకుంటున్నారు? కంబాల చెరువు దండి మార్చ్ పార్కును ఎందుకు మెయింటెనెన్స్ లేకుండా నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా వేదిక కూల్చిన తప్పుకే జగన్ అధికారం నుండి తప్పుకోవాల్సి వచ్చిందని, వైసీపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పలేదన్నారు. అభివృద్ధి అనేది ప్రజాప్రతినిధుల జేబులో నుంచి తీసిన సొమ్ము కాదని, ప్రజల పన్నుల సొమ్ముతో నిర్మించినది, ప్రజలకే చెందింది అన్నారు. ప్రజలు స్వాగతించిన పనులను తీసేయడానికి, కూల్చేయడానికి, తొలగించడానికీ అధికారం ఇవ్వలేదనే విషయాన్ని ప్రజాప్రతినిధులు గ్రహించాలన్నారు. విజ్ఞతతో పరిపాలించండి.. ప్రతీకారంతో కాదని హితవు పలికారు. ప్రభుత్వాలు మారిన ప్రతీసారి గత ప్రభుత్వ ఆనవాళ్లన్నీ చెరిపేయాలనే ధోరణి కొనసాగితే, ప్రజల అభివృద్ధి ఎప్పుడు సాధ్యం అవుతుందని అత్తిలి రాజు ప్రశ్నించారు. ఇప్పటికే రాజమండ్రి అభివృద్ధిలో రాష్ట్రంలోని పలు నగరాలతో పోల్చుకుంటే సుమారు 30 సంవత్సరాలు వెనకబడి ఉందని, ఈ పరిస్థితిలో ప్రతీకార చర్యలు కాదు ప్రజాస్వామ్య పరిపాలన మాత్రమే ముందుకు తీసుకువెళుందని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రజాప్రతినిధులకు హితవు పలికారు.

## మహిళలను హింసించడం హక్కుల ఉల్లంఘనే – సిడిపిఓ లక్ష్మి



**కాకినాడ( మనసులో మాట )నవంబర్ 25..** పురుషులతో సమానంగా మహిళ అన్ని రంగాల్లో తమ శక్తి నిరూపించుకుంటున్నా ఆమెపై హింస, అణచివేత, వివక్షత కొనసాగుతూనే ఉన్నాయని ఇది మానవ హక్కుల ఉల్లంఘన అని సిడిపిఓ వై. లక్ష్మి మంగళవారం పేర్కొన్నారు. రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్నిముఖ్య అతిథి గా పాల్గొని ఆమె మాట్లాడారు.ప్రపంచవ్యాప్తంగా మహిళలు మానసిక, శారీరక, లైంగిక, ఆర్థిక హింసకు బలవుతున్నారని అన్నారు. ఈ హింసకు వయసు, విద్య, ఆర్థిక స్థోమత బేధం లేదన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను నియంత్రించడానికి పలు చట్టాలు ఉన్నాయన్నారు. వాటిపై మహిళ లు అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ మహిళలకు ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తుందని లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్ .శ్రీ నగేష్ ,బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జెండర్ ఆధారిత హింసను నిర్మూలించాలి




**తాళ్లరేవు (మనసులో మాట), నవంబరు 25:** జెండర్ ఆధారిత హింసను నిర్మూలించాలని భీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధన కోరారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా హింస నిర్మూలనా దినోత్సవాన్ని భీమాబాయి మహిళామండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేసి మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానుద్దేశించి నందివర్ధన మాట్లాడుతూ మహిళలపై జరిగే అన్ని రకాల హింసల గురించి అవగాహన పెంచడానికి ఐక్యరాజ్యసమితి నవంబరు 25 ను మహిళలపై జరిగే హింసా నిర్మూలనా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా డిసెంబరు 10వ తేదీవరకు 16 రోజులపాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుంటే హింస నుంచి బయటపడవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సమన్వయకర్త లోవరాజు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు వరలక్ష్మి, సునీత, నాగమణి పాల్గొన్నారు.

# హ్యాట్రిక్ 'మెగాస్టార్' డాక్టర్ రామారెడ్డి!

- 73ఏళ్ళు .. 73డిగ్రీలు ..
- ఒకే సెమిస్టర్ లో 12 ఎన్ పీటీఈఎల్ కోర్సులు పూర్తి
- 9కోర్సులలో టాపర్ గా నిలిచి వరుసగా మూడోసారి మెగాస్టార్ అర్హత
- డాక్టర్ రామారెడ్డి విద్యాభ్యాస జీవితంలో మరో అద్భుత అధ్యాయం
- వచ్చే సెమిస్టర్ లో 16కోర్సులు చేయడానికి ప్రణాళిక : డాక్టర్ రామారెడ్డి
- కోర్సులు చేయడం ద్వారా యంగ్ లైఫ్ పొందుతున్నానని వెల్లడి
- ఇవేమీ అల్లాటప్పా కోర్సులు కాదన్న హర్షకుమార్
- ఖచ్చితంగా భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని అభినందన
- డాక్టర్ రామారెడ్డిది విరామం లేని ప్రయాణం : ఓలేటి సత్యనారాయణ
- భారత ప్రభుత్వ పురస్కారాలు రావాల్సినపుడు వస్తాయని విశ్లేషణ





**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** సుదీర్ఘ కాలంగా విద్యను విశ్వసిస్తూ, నిరంతరంగా అభ్యసిస్తూ, జ్ఞానవృద్ధిని జీవన విధానంగా మార్చుకున్న ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మరో అరుదైన విద్యా మైలురాయి అధిగమించారు. ఇప్పటికే పలు భిన్నమైన డిగ్రీలు సాధించిన ఆయన దేశంలో పేరుగాంచిన ఐఐటీ సంస్థలు నిర్వహించే ఎన్ పీటీఈఎల్ కోర్సులు పూర్తిచేయడంపై దృష్టి సారించి ఒకే సెమిస్టర్ లో 12 కోర్సులు పూర్తిచేసి రికార్డు సృష్టించారు. అంతే కాదు ఫలితాలలో చూస్తే, 8 కోర్సులు పరమ విశిష్ట శ్రేణి (ఎలైట్ ప్లస్ గోల్డ్) లోనూ, 4 కోర్సులు విశిష్ట శ్రేణి (ఎలైట్ ప్లస్ సిల్వర్) లోనూ ఉత్తీర్ణత పొంది, వరుసగా మూడవసారి మెగాస్టార్ సాధించి, హ్యాట్రిక్ కొట్టారు. ఒక పక్క వైద్య వృత్తిలో ఉంటూ సైకియాట్రీ, సైకాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, న్యాయశాస్త్రం, ఎడ్యుకేషన్, ఆంగ్ల సాహిత్యం, లైబ్రరీ సైన్స్, యోగా థెరపీ, జర్నలిజం, కామర్స్, పొలిటికల్ సైన్స్ ఇలా అనేక విభాగాలలో ఇప్పటికే విశేషాధ్యాయనం ద్వారా సంపాదించిన మొత్తం డాక్టరేట్లు, పీజీలు, డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్ కోర్సులు, తాజాగా సాధించిన 12 సర్టిఫికెట్ కోర్సులతో కలిసి మొత్తం 73కు చేరుకున్నాయి. డాక్టర్ రామారెడ్డి వయస్సు 71ఏళ్ళు అయినప్పటికీ రికార్డుల ప్రకారం 73ఏళ్ళు. నిరంతర అధ్యయనం, క్రమశిక్షణ, ఆసక్తి కేవలం వ్యక్తిగత విజయాలు మాత్రమే కాదు, విద్య పట్ల స్ఫూర్తిదాయకమైన సందేశం కూడా అని చెప్పక తప్పదు.

ఈ నేపథ్యంలో స్థానిక మానస హాస్పిటల్ పైన మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ తానూ పూర్తి చేసిన డిగ్రీలు, పీజీలు, సర్టిఫికెట్ కోర్సులు ఏదీ కూడా అయాచితంగా వచ్చిందో, గౌరవపూర్వకమైన నామమాత్రపు అర్హతో కాదని చెప్పారు. ప్రతి సర్టిఫికేషన్ పూర్తిగా పరీక్షల ఆధారంగానే సంపాదించినవేనని, పూర్తి సామర్థ్యంతో, శ్రమతో సాధించినవే అన్నారు. కష్టార్జితం, ఇష్టార్జితం అని ఆయన స్పష్టం చేశారు. కాన్పూర్, రూర్కెలా, ఖర్గపూర్ ఐఐటీలనుంచి మూడేసి కోర్సులు, గౌహతి ఐఐటీ నుంచి రెండు కోర్సులు, మద్రాస్ ఐఐటీ నుంచి ఒక కోర్సు వెరసి ఈ ఏడాది జులై – డిసెంబరు మధ్య జరిగిన సెమిస్టర్ లో 12ఎన్ పీటీఈఎల్ కోర్సులు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. ఇందులో 9 కోర్సులలో టాపర్ గా నిల్చినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు సార్లు మెగాస్టార్ అర్హత సాధించగా వరుసగా మూడవ సెమిస్టర్ కు కూడా మెగాస్టార్ అర్హత వచ్చిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అన్ని పరీక్షలు రాజమహేంద్రవరంలోని రాజీవ్ గాంధీ కళాశాల కేంద్రంలో నిర్వహించబడ్డాయని, చాలా కఠిన నిబంధనల నడుమ పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉందని డాక్టర్ రామారెడ్డి పేర్కొంటూ కళాశాల నిర్వాహకులు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే సెమిస్టర్ లో 16 కోర్సులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు డాక్టర్ రామారెడ్డి తెలిపారు. విద్యాభ్యాసానికి వయస్సు కేవలం సంఖ్య మాత్రమేనని, నేర్చుకోవడం జీవితాంతం కొనసాగించవచ్చని ఆయన చెప్పారు. ఇలా కోర్సులు చేయడం ద్వారా యంగ్ లైఫ్ ని పొందుతున్నానని ఆయన వ్యాఖ్యానించారు. హర్షకుమార్ మాట్లాడుతూ డాక్టర్ రామారెడ్డి చేసినవేమీ అల్లాటప్పా కోర్సులు కాదన్నారు. ఎన్ పీటీఈఎల్ ఐఐటీల ఆధ్వర్యంలో ఉండే కఠినమైన ఆన్ లైన్ కోర్సుల పరీక్షలు రాయడం అద్వితీయ విషయమన్నారు. ఏడు పదుల (70) వయస్సు దాటిన తరువాత కూడా ఇంతటి తీవ్ర అధ్యయనం చేయడం అరుదైన విషయమని, ఇది ప్రజలకు, భావితరాలకు స్ఫూర్తి అని ఆయన అభినందించారు. ఇప్పటికే డాక్టర్ రామారెడ్డికి డా బీసీ రాయ్ అవార్డు వచ్చిందని హర్ష కుమార్ గుర్తుచేస్తూ, వంద డిగ్రీలు పూర్తయ్యే సమయానికి కేంద్ర పురస్కారాలు కూడా వస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ డాక్టర్ రామారెడ్డి ఇష్టంగా, నిష్ఠగా అధ్యయనం చేస్తున్నారని, ఇది విరామం లేని ప్రయాణమని అన్నారు. అందరిలాగే ఆయనకు కూడా రోజుకి 24 గంటలే ఉన్నాయని, అయినా సరే ప్రణాళికా బద్ధంగా పనులు చేసుకుంటూ, వృత్తి నిర్వహిస్తూ, అధ్యయనం సాగిస్తున్నారని అన్నారు. వయస్సు మీద పడుతున్న సరే, శరీరాన్ని, వ్యాధులను నియంత్రించుకుంటూ పనిచేస్తున్నారని ఆయన అన్నారు. మన సంస్కృతిలో జీవన ప్రయాణానికి విరామం లేదని, శరీరం మారుతుందే తప్ప ఆత్మ ప్రయాణం జన్మజన్మలకు కొనసాగుతూనే ఉంటుందని ఆయన ప్రస్తావించారు. ఇలాంటి ఉదాత్తమైన లక్ష్యంతో ప్రయాణిస్తున్న వాళ్ళు అరుదుగా ఉంటారని ఓలేటి చెబుతూ వేలమందిలో ఒకరైనా సరే.. డాక్టర్ రామారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుంటే చాలన్నారు. వైరుధ్యాలు ఉన్నప్పటికీ ఎవరైనా సరే, తాము నమ్మిన సిద్ధాంతం కోసం తాము పనిచేస్తున్న సంస్థలలో, వ్యవస్థల్లో చివరి శ్వాస వరకు పనిచేస్తూ, మమేకమై వెళ్లిపోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వ పురస్కారాలు, అవార్డులతో సంబంధం లేకుండా డాక్టర్ రామారెడ్డిలా ప్రజా హృదయాల్లో ఉండటం ముఖ్యమని ఓలేటి పేర్కొంటూ రావాల్సిన సమయంలో పురస్కారాలు వాటంతటవే వస్తాయనున్నారు. ఐఎంఏ కార్యదర్శి నగర కార్యదర్శి డాక్టర్ దాట్ల సతీష్ రాజు మాట్లాడుతూ ఇన్ని డిగ్రీలు వచ్చే తరంలో ఎవరూ చేయలేరని, అందుకే డాక్టర్ రామారెడ్డి తమకు స్ఫూర్తిదాయకమన్నారు. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర పూర్వాధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు స్వాగతం పలికారు. హర్షకుమార్, ఓలేటి సత్యనారాయణ, డాక్టర్ సతీష్, కృష్ణారావు లను దుశ్శాలువాలతో డాక్టర్ రామారెడ్డి సత్కరించగా, డాక్టర్ రామారెడ్డిని కూడా వారు సత్కరించారు.

# అన్నదాతల అభివృద్ధికై కూటమి ప్రభుత్వం కృషి

## - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు -



**కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 25..** కొత్తపేట మండలం, బిళ్లకుర్రు శివారు కముజువారిపాలెం: మంగళవారం కముజువారిపాలెం లో నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని. ఇంటింటికి వెళ్లి రైతులకు కరపత్రాలను అందజేసారు., ప్రభుత్వం అందిస్తున్న సాయపథకాలు, పెట్టుబడి సహాయం, వ్యవసాయ పరమైన అవకాశాల, వివరించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాతల అభివృద్ధి కోసం అన్ని విభాగాల్లో కట్టుదిట్టంగా కృషి చేస్తోందన్నారు. కర్షకులను చైతన్యవంతులను చేసేందుకు రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపకల్పన చేసిందని తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే పంచసూత్రాల ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామని వివరించారు. పురుగుమందులు, రసాయన ఎరువుల,అధిక వినియోగం వల్ల పంటలు, నీరు, మట్టి కలుషితం అవుతున్నాయని, క్యాన్సర్ వంటి వ్యాధులు వ్యాపించడానికి ఇవే ప్రధాన కారణాలని పేర్కొన్నారు. అందువల్ల ప్రకృతి సేద్యం, సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు తిరిగి రావాల్సిన అవసరం ఉందని సూచించారు. సరైన సమయంలో సరైన పంటలను సాగు చేయడం ద్వారా గిట్టుబాటు ధరలు సాధ్యమవుతాయని చెప్పారు.వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని, డ్రోన్ల ద్వారా మందులు, ఎరువులు పిచికారీ చేయడం వల్ల రైతులకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని తెలిపారు. పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాల కింద రైతులకు రెండు విడతల్లో రూ. 14,వేలు అందజేశామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ. 13,500తో రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా రైతులకు 35శశాతం సబ్సిడీతో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం విస్తృత ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కొబ్బరిలో 20 వరకు, అరటిలో 10 వరకు, అలాగే డైరీలు వంటి అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రైతు కుటుంబాలకు చెందిన మహిళలు, యువతకు సబ్సిడీ రుణాల ద్వారా పరిశ్రమలు స్థాపించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.అవగాహన కార్యక్రమాల నిర్వహణ కోసం రావులపాలెంలో 10 రోజుల్లో ప్రత్యేక ఆఫీసు ఏర్పాటు చేస్తామని, నాలుగు మండలాల రైతులు అక్కడికి వెళ్లి పరిశ్రమలపై పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. యూరియా వినియోగం తగ్గించి, ద్రవ జీవామృతం వంటి సేంద్రీయ ప్రత్యామ్నాయాలను ఉపయోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గి, ఆదాయం పెరుగుతుందని రైతులు ఆ దిశగా ఆలోచించాలని సూచించారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యం

## - ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 25:** స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన కాకినాడ నిర్మాణంలో ప్రజల సహకారమే కీలకమని మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన నగరంలోని సర్కిల్–5, 7, 11, 12 పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పర్యటన సందర్భంగా కమిషనర్ స్థానికులతో ముచ్చటిస్తూ ఇంటింటికీ పారిశుద్ధ్య కార్మికులు సమయానికి చేరుతున్నారా చెత్త సేకరణ సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలను స్వయంగా విచారించారు. చెత్త వర్గీకరణపై అవగాహన కల్పిస్తూ "తడి–పొడి చెత్తను వేరుచేసి ఇవ్వడం నగర పరిశుభ్రతకు అత్యంత కీలకం" అని పేర్కొన్నారు. కార్మికులు రాని రోజుల్లో చెత్తను రోడ్లపై వేయడం పూర్తిగా మానుకోవాలని, ఇంట్లోనే నిల్వచేసి తదుపరి రోజు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. "పరిశుభ్రమైన కాకినాడ కోసం ప్రజల భాగస్వామ్యమే ప్రధాన శక్తి. ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించినప్పుడే పరిశుభ్ర నగర లక్ష్యం నిజం అవుతుంది" అని కమిషనర్ స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దళే పృధ్విచరణ్, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.



# మెగా కంటి వైద్య శిబిరం.. తరలి రండి..

**పెద్దాపురం (మనసులో మాట) నవంబర్ 25..** సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయం వద్ద నవంబర్ 27 నుండి డిసెంబర్ 5 వరకు జరిగే మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎర్నేని చారిటబుల్ ప్రతినిధులు శివ ,శ్యాం, సునీత, సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయ ఈవో బల్ల నేలకంఠం, చైర్మన్ కంటే జగదీష్ మోహన్ కోరారు. మంగళవారం ఆలయ ప్రకటనలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నై కి చెందిన శంకర్ నేత్రాలయ వైద్య బృందం ప్రజలకు కంటి వైద్య పరీక్షలు అందించేందుకు ప్రత్యేక వాహనాలతో తరలివస్తున్నట్లు తెలిపారు. సుమారు 25 మంది వైద్యులు వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. అందత్వ నిర్మూలనకు, పేదలకు ఆధునిక కంటి వైద్యాన్ని అందించేందుకు చేపట్టిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శివ, శ్యామ్, సునీత కోరారు. వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, కళ్ళజోళ్ళు, మందులు ఉచితంగా అందించడం మాత్రమే కాకుండా, ఆపరేషన్ అనంతరం కూడా మళ్లీ ఉచితంగానే వైద్య పరీక్షలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పేద ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షలకు వచ్చే ప్రతి ఒక్కరికి టిఫిన్లు భోజనం ఏర్పాట్లు చేపట్టినట్లు భీమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ తెలిపారు. ఈ సమావేశంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు చీమల కొండ ప్రసాద్, అరుణ వంశీ, గోల్టి సత్యనారాయణ, పడాల వీరబాబు, జార్జ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు

అర్హులైన ప్రతి ఒక్కరికి

# సొంత ఇల్లు కల్పించాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గిడ్డి



**అమలాపురం (మనసులో మాట) నవంబరు 25:** కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇంటి కళ నెరవేర్చే విధంగా గృహ నిర్మాణ అధికారులు చర్యలు తీసుకోవాలని పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశించారు. నియోజకవర్గంలో గల నాలుగు మండలాలలో గల హౌసింగ్ ఏఈలు గృహ నిర్మాణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంపీడీవోలు సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇంటి కల నెరవేరుస్తామని ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో సర్వే నిర్వహించేటప్పుడు ఏ ఒక్క అర్హుడుని వదలకుండా పేర్లు నమోదు చేయాలని ఎమ్మెల్యే సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈనెల 30వ తేదీ లోపు హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించిన సర్వేలు పూర్తి చేయాలని 2026 జనవరి నెల నుండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మాణం కోసం రుణాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రవ్యాప్తంగా జనవరి నెల నుండి అర్హులైన నిరుపేదలు ఇల్లు నిర్మించుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారని ఎమ్మెలకార్యక్రమంలో. నియోజవర్గంలో గల నాలుగు మండలాల ఎంపీడీవోలు హౌసింగ్ ఏఈలు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ క్రియాశీలక ప్రమాద భీమా చెక్ అందజేత



**గండేపల్లి (మనసులో మాట) నవంబర్ 25.** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన లక్కాకుల వెంకటేశ్వరరావు (కొండ) ప్రమాదంలో మృతి చెందాడు.మంగళగిరిలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చేతుల మీదుగా మృతుడి కుమారుడు అయిన తాతబ్బాయి కి జనసేన పార్టీ క్రియాశీలక ప్రమాద బీమా చెక్ ను అందజేశారు. జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ సూచనల మేరకు ఉప్పలపాడు గ్రామానికి చెందిన సత్తి సోమరాజు బాధ్యత తీసుకుని ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని రకాల డాక్యుమెంట్స్ స్వయంగా మా దగ్గరకు తిరిగి,జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వారికి పంపించి మంజూరు చేయించినట్లు తాతబ్బాయి తెలియజేశారు. తుమ్మలపల్లి రమేష్ కు, సత్తి సోమరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన క్రియా వాలంటీర్ మింగి వెంకట సత్యనారాయణ (శ్రీను), జనసైనికులు అడబాల వీరబాబు, మద్దూరి రమణ, ఎద్దు శ్రీను, కాటుమల్ల నాగేంద్ర, పాల్గొన్నారు.

## పంచముఖ ఆంజనేయ స్వామి వార్షికోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 25..** కొత్తపేట మండలం, గొలకోటివారిపాలెం గ్రామంలో కొలువుదీరి ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి పంచమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వామి ని దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వార్షికోత్సవోత్సవలలో భాగంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త గోలకోటి మాధవ్ తదితర సంఘం సభ్యులను అభినందించారు.





# విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఎన్నికల జరిగే విధానపై అవగాహన కలిగి ఉండాలి

**-ప్రధాన ఉపాధ్యాయుడు కోళ్ల రాంబాబు-**

**రౌతులపూడి, (మనసులో మాట )నవంబర్ 25..** నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల విధానంపై విద్యార్థులకు మాక్ పోలింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్ సలీమ్ కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల విధానాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు కోళ్ల రాంబాబు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఒక భాగమైన ఎన్నికల విధానంపై విద్యార్థులు అవగాహన చేసుకోవాలని తద్వారా దేశ భవిష్యత్తు బాగుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేటు కు దీటుగా..

**ప్రభుత్వ పాఠశాల లో క్యాబినెట్ ఎన్నికలు...**
**వల్లూరు పాఠశాలలో మాక్ పోలింగ్....**



**కపిలేశ్వరపురం (మనసులో మాట)నవంబర్ 25** సాధారణం గా ప్రైవేటు పాఠశాల ల్లో మాత్రమే స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు నిర్వహిస్తూ ఉంటారు. దీనికి భిన్నంగా ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థి సంఘం ఎన్నికలు జరిగాయి. అచ్చం సాధారణ ఎన్నికల మాదిరి ఈ ఓటింగ్ జరిగింది. వల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ పోలింగ్ లో విద్యార్థులే విద్యార్థి నాయకున్ని ఓటు వేసి ఎన్నుకున్నారు. విద్యార్థులచే నామినేషన్ స్వీకరణ ఉపసంహరణ ప్రచారం గుర్తుల కేటాయింపు పోలింగ్ సిబ్బంది నియమకం వారి విధులు బాధ్యతలు గురించి తెలియజేసారు. విద్యార్థులు అందరూ ఓటింగ్ లో పాల్గొన్నారు. పరిశీలకులుగా ప్రధానోపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, ఉపాధ్యాయులు రామ తులసి వ్యవహరించారు.విద్యార్థులు క్యూ లైన్ లో నిలబడి ఓట్లను వేశారు. తల్లిదండ్రులు ఎన్నికల తీరును పరిశీలించి అభినందన తెలియజేశారు. ఆ తర్వాత ఎన్నికల ఫలితాలను లెక్కించి విజేతలను అభినందించారు.

# సుబ్రహ్మణ్యేశ్వర షష్టికి ఘనంగా ఏర్పాటు, గ్రామోత్సవం, రాత్రి కళ్యాణం



**కపిలేశ్వరపురం (మనసులోమాట) నవంబర్ 25..** కపిలేశ్వరపురం మండలం అంగర, గ్రామంలో గౌతమీ గోదావరి తీరన స్వయం భూ గా వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, స్థానిక శివాలయం లోనూ సుబ్రహ్మణ్యేశ్వర షష్టికి సంబంధించి ఏర్పాట్లను ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులు దగ్గరుండి పరిశీలించిన ఏర్పాట్లు గావించారు. సుబ్రహ్మణ్యేశ్వర షష్టికి ఎంతో విశిష్టత కలిగిన అంగర గ్రామం లో స్వయం స్వయ%శీ%భూ గా వెలసిన సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకునేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి భక్తులు వేలాదిమంది వచ్చారు.వారికి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే ప్రతిరోజు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో హెూమాలు, అభిషేకాలు, కల్యాణాలు జరుగుతాయని తెలియజేయడం జరిగింది.భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసిందని ఆలయాల అర్చకులు మంగళవారం విలేకరులకు తెలిపారు.సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తుల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించి రాత్రి కళ్యాణం జరిగింది. ఈ ఉత్సవాలు 5 రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# రైతు భద్రత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ**

**- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** రైతుల పట్ల ప్రభుత్వం పూర్తి నమ్మకం నింపి అండగా నిలుస్తూ, పరిపాలనలో మార్పులు నేపథ్యంలో రైతు గుండెల్లో నమ్మకం నింపే విధంగా కూటమి ప్రభుత్వం రైతు ప్రజా సంక్షేమ పరిపాలన అందిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

మంగళవారం రాజానగరం మండలం సంపత్ నగరంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తదితరులతో కలిసి సందర్శించారు. అనంతరం రైతులతో, రైతు సేవా కేంద్రం సిబ్బందితో ముఖాముఖి సంభాషించి వారి నుంచి సంతృప్తి స్థాయిలో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, గోనె సంచులు లేకపోవడం, దూరప్రాంత మిల్లులకు లింక్ చేయడం వంటి సమస్యలు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం హయాంలో రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1674 కోట్లు, రైస్ మిల్లర్లకు బకాయి పెట్టిన రూ.1100 కోట్లలో. రూ.470 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సారి 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమై ఉందని, రాజానగరం నియోజకవర్గంలో 1.24 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి నమోదు అయినట్లు వివరించారు. రాజానగరం నియోజక వర్గంలోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా "రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం, కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యం ఇస్తూ ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తోందన్నారు. ఎన్నికల ముందు, 48 గంటల్లో చెల్లిస్తామని చెప్పినా అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. పంటలకు సాగునీటిని సమృద్ధిగా అందించడంతో రైతులు రెండు పంటలు విజయవంతంగా సాగుచేశారని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తదుపరి వారి నుంచి వేలి ముద్రలు తీసుకున్న రెండు గంటల్లో నగదు జమ చేయడం జరుగు తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, దిశ నిర్దేశం వల్ల రైతులకి ఎంతో ప్రయోజనం చేకూరుతోందని ఆయన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి నాదెండ్ల మనోహర్, తూర్పు గోదావరి జిల్లా రైతులు, అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆదర్శంగా అమలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 89 వేల మంది రైతుల నుండి 1.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.430 కోట్లు రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు వెల్లడించారు. తేమ శాతం, గోనె సంచులు, రవాణా వంటి అంశాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మూడు నెలలుగా పర్యాయ పరిశీలనతో శిక్షణ ఇస్తున్నామని, తద్వారా రైతుల్లో అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. డిసెంబరు 31 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పూర్తవుతుందని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, రుడా చైర్పర్సన్ బొడ్డు వెంకటరమణ, ఆర్డీఓ ఆర్ కృష్ణనాయక్, డీఎస్వో వీ పార్వతి, డీఎంసీఎస్ బీ గణేష్‌కుమార్, డీసీఓ ఎం వెంకటరమణ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబీ, సివిల్ సప్లైస్ చైర్మన్ తోట సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విధానాలు అవలంబించడం ద్వారా లాభసాటి వ్యవసాయం

**మల్లిశాలలో రైతన్నా మీ కోసం కార్యక్రమం**




**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 25..** రైతును రాజుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వం ఆలోచన అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలియజేశారు. మంగళవారం జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా ఇంటింటికి వెళ్లి రైతన్నా మీకోసం కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయంతో పాటు వివిధ పథకాల గురించి వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే గ్రామాలు బాగుంటాయి, కుటుంబాలు బాగుంటాయనే తలంపుతో రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులను చైతన్యవంతులను చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పంచ సూత్రాలతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. నీటి భద్రత సూత్రం ద్వారా సాగునీటిని వృధా కాకుండా వినియోగించుకోవడం ముఖ్యమన్నారు. డిమాండ్ ఆధారిత పంటలు ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.ఇందులో భాగంగా సరైన సమయానికి సరైన పంట వేయడంతో పాటు సరైన సమయానికి దిగుబడి వచ్చే విధానాలు అవలంబించడం ద్వారా గిట్టుబాటు ధరలు పొందవచ్చన్నారు. అగ్రిటెక్ ద్వారా వ్యవసాయంలో సాంకేతిక సాయాన్ని అందించడం జరుగుతుందన్నారు.డ్రోన్ల ద్వారా మందులు, ఎరువులు పిచికారీ చేయడం వల్ల సమయం, ఖర్చు అదా అవుతుందన్నారు.అందుకే వ్యక్తిగతంగా రైతులకు యంత్రాలు సరఫరా, కిసాన్ డ్రోన్ సేవలు అందిస్తోందన్నారు.రైతుల పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలన్నారు. ఈ క్రమంలో ఆ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ - పి. యం. కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ. 14 వేల వంతున అందజేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.13,500 ఇవ్వడానికి ఎన్నో రోజులు పట్టేదన్నారు. పంటల మార్పిడితో, వైవిధ్యమైన పంటలు వేయడంతో, ప్రకృతి వ్యవసాయంతో, సేంద్రియ సేద్యంతో, అధునాతన టెక్నాలజీతో, శాస్త్రీయతను వినియోగించుకోవడం ద్వారా రైతులను ముందుకు తీసుకువెళ్లాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. రైతులు సైతం వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా భావించి పెట్టుబడి, ఉత్పత్తి వ్యయం, లాభనష్టాలు బేరీజు వేసుకునే విధానం రావాలన్నారు. పురుగు మందులు ఎక్కువగా వినియోగించడం, యూరియా వాడకం ద్వారా దిగుబడులు ఎక్కువగా వస్తాయనే ఆలోచనావిధానాన్ని రైతులు పునరాలోచించి సమీక్ష జరుపుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. పురుగుమందులతో, యూరియా అధిక వినియోగంతో మనం పండించే పంట మన పిల్లలు తినే ఆహారం విషతుల్యం అవుతుందని తెలుసుకోవాలన్నారు. క్యాన్సర్ వంటి మహమ్మారి పెరగడానికి కారణం రసాయన ఎరువులు, పురుగుమందులేనని గుర్తించాలన్నారు. మరలా అందరూ ప్రకృతి సేద్యం, సేంద్రీయ సేద్యం వైపు మరలాల్సిన అవసరం ఉందన్నారు. మంచి ఆహారం, సరైన ఉత్పత్తి, తక్కువ ఖర్చు, సరైన దిగుబడి వైపు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయం గురించి మనకు ఒకరు చెప్పాలా? అనే ధోరణి వదిలేయాలన్నారు. మంచి దిగుబడి, మంచి ఆహారం, మంచి ఆదాయం గురించి ఆలోచించాలన్నారు. పాడి పంట రెండూ ఉండాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, అందులోనూ మహిళా రైతులకైతే 35శాతం సబ్సిడీ ద్వారా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, పిల్లా చంటిబాబు, సర్వసిద్ధి నూక రత్నం లక్ష్మణరావు, పురం శెట్టి శివాజీ, యిడుదల అర్జున్ రావు, కనవరెడ్డి రామకృష్ణ, పల్లికొండ భద్రం, గుమ్మల్ల అనంతలక్ష్మి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మార్పు కోసం ముందడుగు వికసిత గ్రామీణ భారతదేశ దిశ

**డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. శ్రీనివాసరావు**





**కాకినాడ (మనసులో మాట )నవంబర్ 25..** లింగ అసమానత్వ సమస్యలు ఎదుర్కొనేందుకు నూతన చైతన్యం 4 ను మార్పు కోసం ముందడుగు వికసిత గ్రామీణ భారత్ దిశగా సమ్మిళత వృద్ధికి ఆర్థిక సాధికారతకు మహిళలే ముందు ఉండాలనే నినాదంతో జిల్లాల స్థాయిలో జెండర్ కార్యక్రమములు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసురావు అన్నారు.

నూతన చైతన్యం 4 ప్రచారాన్ని మంగళవారం న్యూఢిల్లీ నుంచి వ్యవసాయ మరియు రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వర్చ్యువల్ గా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి కాకినాడ గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసురావు జిల్లా సమాఖ్య సభ్యులు, సిబ్బందితో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా లింగ అసమానత్వ సమస్యలను ఎదుర్కొనే లక్ష్యంతో ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు నూతన చైతన్యం 4 మార్పు కోసం ముందడుగు వికసిత గ్రామీణ భారతదేశ గా సమ్మిళిత వృద్ధికి ఆర్థిక సాధికారతకు మహిళలే ముందుండాలనే నినాదంతో జిల్లాలో లింగ సమానత్వంపై ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ మరియు సంఘ స్థాయిలను భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రాముఖ్యంగా పంచాయత్ రాజ్ స్త్రీ శిశు సంక్షేమం పోలీస, జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ యూత్ వెల్ఫేర్ పాఠశాల విద్యా, సాంఘిక సంక్షేమం పౌర సంబంధాలు సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ (సి ఎస్ ఓ ) ల సమన్వయంతో జిల్లాసమాఖ్య వారితో జాయింట్ యాక్షన్ ప్లాన్ ద్వారా జిల్లా లోని అన్నీ మండలములలో నేటి నుంచి నెల రోజుల పాటు వివిధ కార్యక్రమములు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడం జరిగిందన్నారు. నూతన చైతన్యం 4 కార్యక్రమంలో ద్వారా మహిళా సంఘములలో అనగా గ్రామ మండల తో పాటు అంగన్వాడి, పాఠశాలలో లింగ అసమానతలు, హింస, వివక్షపై అవగాహన పెంపుబీ మహిళల సురక్షిత గమనాన్ని (సేఫ్ మోబిలిటీ ) ప్రోత్సహించడం. కుటుంబం మరియు సమాజంలో మహిళల ఆర్థిక సహకారదారులుగా గుర్తింపు పెంపు, మహిళల గృహ సంరక్షణ పనులను గుర్తించడం, పునర్విభజనబీ వనరులపై మహిళల ప్రవేశం మరియు నియంత్రణకు ప్రోత్సాహం, జెండర్ ఆధారిత వివక్ష మరియు హింసను తగ్గించడం కోసం మహిళల ఆర్థిక సాధికారతను పెంపొందించడం వంటి ప్రధాన లక్ష్యాలను దృష్టి సారించడం జరుగుతుందని డీఆర్డిఏ పీడీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఏపీడి ఎం.ఎం. జిలాని, డీపీఎంలు, అన్ని మండలాల జిల్లా సమైక్య సభ్యులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బిటి రోడ్లకు శంకుస్థాపన

**- ఎమ్మెల్యే జ్యోతుల**

**గండేపల్లి (మనసులో మాట) నవంబర్ 25..** కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గండేపల్లి మండలంలోని సింగరం పాలెం నుండి కనుపూరు వరకు1 కోటి 20 లక్షలతో బీటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మురారి నుండి కలవచర్ల వెళ్లే బీటీ రోడ్డు 1కోటి రూపాయలతో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ సింగరం పాలెం కనుపూరు,మురారి,కలవచర్ల బీటీ రోడ్ల శంకుస్థాపన నిర్వహించామని తొందరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందని,గోకవరం నుండి తిరుమలాయపాలెం,కనుపూరు, సింగరంపాలెం,గండేపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని మహిళలు కోరడం జరిగిందని బస్సు కూడా తొందరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు,పోతుల మోహనరావు,కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్,సుంకవిల్లి రాజు, అక్కిన సుదర్శన్ రావు, గోరిజాల వెంకన్న దొర, ఉండవల్లి బుల్లి రాజు, గద్దె అబ్బన్న, గల్లా రాము, గొల్లవిల్లి శ్రీదేవి,ధర్మాజీరావు,ఆర్ అండ్ బి జెఈ సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

**త్వరలో రాష్ట్ర పండుగగా జగ్గన్నతోట**

# ప్రభల తీర్థ మహెూత్సవం

**రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**



**రాజోలు (మనసులో మాట), నవంబరు 25:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పీ గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా నిర్వహించే "జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని" రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సమ్మతించారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం రాజోలు పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి కోనసీమ వాసులు ఈ అంశాన్ని తీసుకువచ్చి వినతి పత్రం అందించగా మంత్రి దుర్గేష్ స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగగా జరుపుకునే సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా లక్షలాది మంది భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగే జగ్గన్న తోట ప్రభల తీర్థ మహెూత్సవానికి ప్రత్యేకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక మంత్రిగా తాను, సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఛైర్ పర్సన్ తేజస్విని పొడపాటి వేర్వేరు సందర్భాల్లో 450 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. ఈ క్రమంలో ప్రభల తీర్థాన్ని త్వరలోనే పూర్తి స్థాయిలో రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం వెంటనే సమ్మతించారని స్పష్టం చేశారు. ప్రతి ఏటా కన్నుల పండువగా జరిగే ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి భక్తి పారవశ్యంలో మునిగి తేలుతారన్నారు. ఎన్నో తరాల నుండి సంప్రదాయంగా వస్తోన్న ఈ ప్రభల తీర్థం జరిగే సమయంలో పండుగ వాతావరణం నెలకొని అధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందన్నారు. వీటన్నింటితో పాటు కోనసీమ వాసుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఏకాదశ రుద్రులతో పాటు వివిధ రూపాలతో తీసుకువచ్చే జగ్గన్నతోట ప్రభల తీర్థ అద్భుత ఘట్టాన్ని అందరం కలిసి ఘనంగా నిర్వహించుకుందామని, అదే విధంగా ప్రపంచానికి చాటి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

**29, 30 తేదీల్లో గోదావరి బాలోత్సవం**

# 3 వ పిల్లలపండుగ

**- ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకుల వెల్లడి**



**రాజమహేంద్రవరం, (మనసులో మాట), నవంబరు 25:** రాజమహేంద్రవరం ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాలలో గోదావరి బాలోత్సవం 3వ పిల్లల పండుగ కార్యక్రమాన్ని ఈ నెల 29, 30 తేదీల్లో ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ పీ తులసి, అసోసియేట్ అధ్యక్షుడు వీఎస్ఎస్ కృష్ణ కుమార్ వెల్లడించారు. 'ది రాజమండ్రి ప్రెస్ క్లబ్' లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 29వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ బాలోత్సవాన్ని ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా టీచర్స్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ వై మేఘా స్వరూప్, గౌరవ అతిథులుగా డీఈఓ కే వాసుదేవవరావు, నున్న తిరుమల రావు, పంతం కొండలరావు తదితరులు హాజరవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా 150 పాఠశాలల నుంచి 6 వేల మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని అకడమిక్, కల్చరల్ విభాగాల్లో మొత్తం 71 పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ముగింపు సభలో బహుమతులు అందజేస్తామన్నారు. తల్లితండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు తమ పిల్లలని తీసుకుని బాలోత్సవానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకోని వాళ్ళు ఎవరైనా కార్యక్రమం జరిగే రోజు ఉదయం 8 గంటలకు వచ్చి స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోవచ్చునని తెలియజేశారు. రెండు రోజులు కూడా బాలోత్సవంలో పాల్గొనేవారంతా ఉదయం 8 గంటలకే వెన్యూ దగ్గర ఉండాలని, సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం పూర్తయ్యే వరకు ఉండాలని, రెండ్రోజులు జరిగే ఈ బాలోత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. సమావేశంలో బాలోత్సవం కార్యదర్శి పువ్వుల ఆనంద్, ఉపాధ్యక్షులు నవీన కుమారి, అంజలి తదితరులు పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన

# దిగ్విజయంగా జరగాలి

## - అధికారులను ఆదేశించిన కలెక్టర్

**అమలాపురం (మనసులో మాట) నవంబరు 25 :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనను మినిట్ టూ మినిట్ అధికారుల సమన్వయంతో దిగ్విజయం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులకు సమావేశం నిర్వహించి ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు, పర్యటన నిర్వ హణ తీరును క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తమకు కేటాయించిన విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పర్య టనను విజయవంతం చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో స్టార్ హీరో పవన్ కళ్యాణ్ జిల్లాకు మొట్టమొదటి సారిగా విచ్చేయడం జరుగు తుందని జన సైనికులు అభిమానులు పూర్తి సం యమనం పాటిస్తూ పర్యటన ఆద్యంతం సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్థానికంగా ల్యాండ్ అయినప్పటి నుండి తిరిగి మళ్ళీ టెకాఫ్ అయ్యే వరకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పల్లె పండుగ 2.0 రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గూడపల్లి హెలి ప్యాడ్ నుండి కేశనపల్లి వ్యూ పాయింట్, రైతులతో ముఖాముఖి ఛాయాచిత్ర ప్రదర్శన తిలకించడం, శివకోడు నందు పల్లె పండుగ టు పాయింట్ జీరో పైలాన్ ఆవిష్కరణ, ఎగ్జిబిషన్ తిలకించడం జ్యోతి ప్రజ్వలన, బహిరంగ సభ వేదిక ఏర్పాట్లపై అధికా రులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా డిఆర్ఓ కే మాధవి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం రాష్ట్ర సంచాలకులు వై షణ్ముఖ కుమార్ ఆర్డీవోలు పి శ్రీకర్, డి అఖిల, డ్వామా పిడి మధుసూదన్, ఆర్ అండ్ బి ఎస్ ఈ బి రాము పంచాయతీరాజ్ ఎస్ ఈ పి రామకృష్ణారెడ్డి, డి సి హెచ్ ఎస్ కార్తీక్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ ఏవీఎస్ రాజన్, సమగ్ర శిక్ష ఏపీసి జి మమ్మీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

**కాజులూరు (మనసులోమాట) నవంబర్ 25..** విద్యుత్ సరఫరా లో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్ భాస్కర్ కోరారు. మంగళవారం ఆర్యవటం విద్యుత్ సబ్ స్టేషన్ నందు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలుపుతూ బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గం"ల వరకు 33/11కేవీ కుయ్యేరు సబ్ స్టేషన్ 11కేవీ ఫీడర్స్ పరిధిలో గల కుయ్యేరు , ఉప్పుమిల్లి ,దుగ్గదురు ,చింతల్లంక , రేగుబడవ ,పల్లిపాలెం గ్రామాలకు మరియు ఆక్వా ఏరియాలకు ,మరియు ది 27-11-25 గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కే వీ కాజులూరు సబ్ స్టేషన్ లో గల 11 కే వీ ఫీడర్స్ పరిధి లోని గ్రామాలైన కాజులూరు ,ఐతపూడి ,తిప్పరాజుపాలెం గ్రామములకు మరియు కాజులూరు ఇండస్ట్రియల్ పరిధిలో గల ఆక్వా సర్వీస్ లకు కొత్త లైన్ (కుయ్యేరు నుండి కాజులూరు) వేయుటకు సప్లై నిలిపివేయిదురు . విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ భాస్కర్ కోరారు.

# పేకాట స్థావరంపై దాడి ఆరుగురు అరెస్ట్



**ఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల 25(మనసులో మాట) ..** ద్వారకా తిరుమల మండలం జజులకుంట గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై ఎస్సై సుదీర్ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఆకస్మిక దాడులను నిర్వహించారు. రాబడిన సమాచారం వరకు దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.19,300 నగదును, మూడు మోటర్ సైకిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే ఎవరినైనా క్షమించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా కోడిపందాలు, పేకాటను నిర్వహిస్తే 112 కు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## 2 కోట్ల 68 లక్షలతో రహదారుల అభివృద్ధి

# పనులకు శంకుస్థాపనలు

## మల్లిశాల తిరుమలయపాలెం, కాట్రావులపల్లి సీతానగరం రహదారి పనులకు శ్రీకారం



**జగ్గంపేట (మనసులోమాట) నవంబర్ 25..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లుజగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన జగ్గంపేట మండలం మల్లిశాల నుండి తిరుమలయపాలెం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు 68 లక్షలతో బీటీ రోడ్డు వేయడానికి శంకుస్థాపన చేశారు.కాట్రావులపల్లి నుండి సీతానగరం వెళ్లే రహదారి కి రెండు కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక గుంతలు లేని రహదారులే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మత్తు పనులు నిర్వహించామన్నారు.నూతన రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గ్రామ స్థాయి మొదలుకుని రాష్ట్ర స్థాయి వరకూ ప్రతీ రహదారి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. వైకాపా పాలనలో గుంతల రహదారులు వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఐదేళ్ల పాటు రోడ్ల అభివృద్ధి, మరమ్మత్తులపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు, రోడ్లు కూడా దారుణంగా దెబ్బతిన్నాయని, వాటన్నిటిని తిరిగి బాగు చెయ్యడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, పో తుల మోహనరావు, కొత్త కొండబాబు, ఉంగరాల రాము, పిల్లా చంటిబాబు, పైడిపాల సూరిబాబు, ఏలేశ్వరం మండలం టిడిపి అధ్యక్షుడు జ్యోతుల పెద్దబాబు, మునిరెడ్డి నాగేశ్వరరావు, పురం శెట్టి శివాజీ, సర్వసిద్ధి నూక రత్నం లక్ష్మణరావు, ముండ్రు ఎర్రబాబు, ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, కమ్మిల వెంకటేశ్వరరావు, సుంకర సీతారామయ్య కంటే రామారావు, బిక్కిన బాబి, పోలినాటి ధర్మానందకుమారి శాస్త్రి, ఆర్ అండ్ బి ఈ ఈ రాఘవరావు, ఆర్ అండ్ బి జె ఈ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి నాయకులు పైన దాడులకు ప్రేరేపించిన రంపచోడవరం తహసీల్దార్ పై

# ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

## ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ డిమాండ్



**రంపచోడవరం( మనసులో మాట) నవంబర్ 26 ...** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ జేఏసీ చింతూరు మండల చైర్మన్ పొడియం రామకృష్ణ అధ్యక్షతన అత్యవసర సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశం ఉద్దేశించి ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ మాట్లాడుతూ ఆదివాసి సంక్షేమ పరిషత్ (ఏ ఎస్ పి ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా. శ్రీను పై జరిగిన దాడిపై చింతూరు డివిజన్ జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆదివాసి ప్రాంతాలలో జరుగుతున్నటువంటి న్యాయమైనటు వంటి ఆదివాసి చట్టాలపై శ్రీను చేస్తున్న పోరాటాన్ని అలాగే నర్సాపురం క్వారీ పైన పోరాటం లో రంపచోడవరం తహసీల్దార్ అక్కడ విచారణ పేరుతో వెళ్లి అక్కడకి క్వారీ నిర్వహిస్తున్న గిరిజనేతరుల తో కుమ్మకుఅయి కొందరు జీర్ణించుకోలేక చట్టాలపై అవగాహన లేని కొంతమంది ఆదివాసులను ఆసరాగా తీసుకొని ఇటువంటి దాడులకు పాల్పడటం చాలా దారుణమైన సంఘటన అని పేర్కొన్నారు. ఏజెన్సీ చట్టాలను కాపాడవాల్సిన తహసీల్దార్ అమాయక ఆదివాసీలను ప్రేరేపించి కొట్టుకోవాలి అని మేము వెళ్లిన తరువాత అని మాట్లాడం అయన అవివేకం అన్నారు.అయన ప్రేరణతోనే ఆదివాసీ నాయకులు పైన డాడీ చేసిన నా వారిపైన తహసీల్దార్ పైన ఎస్టి అట్రాసిటీ కేసు వెంటనే నమోదు చేయాలన్నారు.ఇప్పటికైనా ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి చట్టాల గురించి ఆదివాసులు చేస్తున్న న్యాయమైన పోరాటాలపై చట్టాల గురించి పూర్తిగా తెలిసిన అధికారులు మౌనం వీడాలన్నారు. లేదంటే ప్రతి ఆదివాసి మీద జరిగే ప్రతి దాడులకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. రాజ్యాంగపరంగా ఆదివాసులకు ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయి. కాబట్టి ప్రతి ఒక ఆదివాసి సంఘాలు గాని ఉద్యోగ సంఘాలు గాని న్యాయపరమైన పోరాటాలు చేయగలుగుతున్నాము. అటువంటి చట్టాలను నీరు గార్చే ప్రయత్నాలు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ చింతూరు డివిజన్ జేఏసీ మరియు మండల జేఏసీ తీవ్రంగా ఖండిస్తుంది ఈ సారి ఏ దాడి జరిగిన ప్రతి దాడి ఉంటది అని ఇదే హెచ్చరిక అని అధికారులకు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఆదివాసి జేఏసీ మండల చైర్మన్ పోడియం. రామకృష్ణ,మడివి.రాజు సోడే శ్రీను,గోరం. రాఘవ,కాకా సీతరామయ్య,మడకం రమేష్ తదితరులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో సమగ్రాభివృద్ధి..



**కొత్తపేట( మనసులో మాట )నవంబర్ 25..** కొత్తపేట మండలంలోని రూ.1.15కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. మంగళవారం కొత్తపేట మండలం ఏనుగుమహల్ వద్ద ఎంపీ హరీష్ మాధుర్, రాష్ట్ర బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్,ఆకుల రామకృష్ణ,కె వి సత్యనారాయణ రెడ్డి,వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు,లతో కల్సి పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. రూ.3కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ కు భూమిపూజ,మాజీ జెడ్పీటీసీ సభ్యులు ధరణాల రామకృష్ణ ఏర్పాటు చేసిన తెలుగుదేశం జెండా స్థూపాన్ని ప్రారంభించారు.అనంతరం మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకము నిధులు రూ.23.94 లక్షలతో నిర్మించిన అగ్రికల్చర్ ప్రొడక్ట్స్ స్టోరేజ్ భవనం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూ.17.50 లక్షలు, హెల్త్ డిపార్ట్మెంట్ నిధులు 4.30 లక్షలతో నిర్మించిన భారత నిర్మాణ సేవాకేంద్రం(హెల్త్ క్లినిక్), రూ. 7 లక్షలతో నిర్మించిన, స్నానాలరేవు,రూ. 9.80 లక్షలతో నిర్మించిన సి.సి.రోడ్డు, రూ.10 లక్షలతో నిర్మించిన డ్రెయిన్, రూ.13 లక్షలతో బి.సి.కాలనీలో నిర్మించిన డ్రెయిన్ యస్.సి.పేటలో రూ. 4 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డు, రూ.4 లక్షలతో సచివాలయం నుండి ఏటిగట్టు వరకు నిర్మించిన గ్రావెల్ రోడ్డు , ఏనుగుమహల్ వద్ద రూ.7లక్షలతో నిర్మించిన స్నానాల రేవు,రూ.15లక్షలతో నిర్మించిన అక్షర చిల్డ్రన్ పార్క్ లను ఆయన ప్రారంభించారు.. గ్రామాలు అభివృద్ధి చెందినపుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నామన్నారు. ఏనుగు మహల్ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గర్భస్థ పిండ ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి పరీక్షలుపేరు తో

# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

## - డి ఐ ఓ డాక్టర్ కేవీ సుబ్బరాజు



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 25..** కాకినాడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియెట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్డీటీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డీఐఓ డా.కె.వి. సుబ్బ రాజు మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. స్కాన్ సెంటర్స్ నిర్వహిస్తున్న వైద్యులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిస్తే పీసీపీఎన్డీటీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్కాన్ సెంటర్ ను సీజ్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 115 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, చేసి ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. నవంబర్ నెలలో 3 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 24 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. శ్రీ కైరా ఎమర్జెన్సీ ట్రామా కేర్ సెంటర్, కాకినాడ, కాకినాడ ఒయాసిస్ ఫెర్టిలిటి సెంటర్ వారు న్యూ రిజిస్ట్రేషన్ కొరకు, కాకినాడ కీర్తి స్కాన్ సెంటర్ వారు రెన్యువల్ కొరకు, కాకినాడ మెడ్ వే సంజీవి హాస్పిటల్ యాడింగ్ ఆఫ్ మెషిన్, చేంజ్ ఆఫ్ ఎంప్లాయ్ కొరకు మరియు సృజన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, కాకినాడ వారు చేంజ్ ఆఫ్ ఎంప్లాయ్ కొరకు నమోదు చెయ్యడం జరిగినది. ఈ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటి ఆమోదం తర్వాత డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీకి పంపడం జరుగుతుందన్నారు. తదుపరి వారి అనుమతితో సంబంధిత యాజమాన్యం వారికీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని పిండ లింగ నిర్ధారణ చట్టం పై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తగా గర్భిణీ స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాల సమ చారము లేక నమోదు కానీ స్కానింగ్ కేంద్రాలు మరియు అర్హత లేని వైద్యులు వివరములు టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 3365 వాట్సప్ నెంబర్ - 9494113365కు తెలియ చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి.హరిత, వన్ టౌన్.సి.ఐ పి.స్వామి నాయుడు, పిఠాపురం సీహెచ్సీ డా.చందన, హెల్త్ ఎడ్యుకేటర్లు విజయ లక్ష్మి, రాంబాబు, కృష్ణ శేఖర్, ఎల్.శృతి మోనిటరింగ్ కాన్సల్టెంట్ ఇతర సిబ్బంది ఇతర పాల్గొన్నారు.



# అలజడి రేపిన పుట్టినరోజు వేడుక..!

- గొల్లపల్లి సభ విజయవంతంతో ప్రత్యర్థుల గుండెల్లో గుబులు..
- ఎమ్మెల్యే తనయుడు రాణా పుట్టినరోజు కార్యక్రమానికి 25 వేల మందికి పైగా హాజరు
- గొల్లపల్లి వర్గీయుల హర్షాతిరేకాలు..
- యానాం మళ్లీ తనదేనంటూ అశోక్ ధీమా..!
- అయోమయంలో పడిన ప్రత్యర్థి వర్గాలు..
- ఇంటిలిజెన్స్ సమాచారంతో పుదుచ్చేరిలోనూ చర్చ..
- రసవత్తరంగా మారనున్న యానాం అసెంబ్లీ ఎన్నికలు..

**యానాం (మనసులో మాట), నవంబరు 25:** ఒక పుట్టినరోజు వేడుక యానాంలోనే కాకుండా పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యర్థుల గుండెల్లో గుబులు రేపింది. ఈ ఆత్మీయ కలయికకి పెద్ద సంఖ్యలో అన్ని సామాజిక వర్గాల నుండి ప్రజలు హాజరు కావడంతో పుట్టినరోజు వేడుక హాట్ టాపిక్ గా మారింది. రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది...

ఒక సభ వేయి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లయ్యింది. యానంలో ఇటీవల నిర్వహించిన గొల్లపల్లి తనయుడు పుట్టినరోజు వేడుకకు భారీ ఎత్తున జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. దీంతో గొల్లపల్లి శకం ముగిసిందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఏమాత్రం గొల్లపల్లి ప్రభావం ఉండదని విష ప్రచారం చేస్తున్న వారి నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్లు అయింది. ఒకే ఒక్క పిలుపుతో కుమారుడు పుట్టిన రోజు వేడుకకు వేలాదిమంది తరలి రావడంతో ఇప్పుడు అదే యానాంలో తీవ్ర చర్చనీయాంశం అయింది. గొల్లపల్లి పాలనలో అభివృద్ధి, సంక్షేమ%శీ% కుంటుపడిందని, ప్రచారం చేస్తూ ఇక అధికారంలో వచ్చేది తామేనంటూ ప్రత్యర్థి వర్గాలు సంబరాలు చేసుకుంటున్న తరుణంలో ఒకే ఒక కార్యక్రమం అందరి అంచనాలను తారుమారు చేసింది. ఇటీవల యానం రాజీవ్ బీచ్ లో నిర్వహించిన గొల్లపల్లి శ్రీనివాస అశోక్ తనయుడు గొల్లపల్లి గంగాధర్ ప్రతాప్ రాణా పుట్టినరోజు కార్యక్రమానికి యానం పరిసర ప్రాంతాల నుంచి సుమారు 30 వేల మందికి పైగా జనం తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా ప్రముఖ నేతలు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, టిడిపి సీనియర్ నాయకుడు మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ, తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వి, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ తదితర ప్రముఖులు హాజరు కావడం గమనార్హం. ఒక్క పిలుపుతో వేలాదిమంది తరలి రావడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. యానంలో సభపై పుదుచ్చేరిలోని ప్రధాన పార్టీలు సైతం ఒకన్నేసాయి. గొల్లపల్లి పిలుపుకు భారీ స్థాయిలో జనం హాజరయ్యారన్న ఇంటిలిజెన్స్ సమాచారంతో పుదుచ్చేరిలో కూడా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరో మూడు, నాలుగు నెలల్లో యానం అసెంబ్లీ స్థానానికి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ చర్చ తారాస్థాయికి చేరింది. ఇలా ఉండగా యానా%శీ%కు వెన్ను చూపనని, యానాం ప్రజలందరికీ అండ దండగా ఉంటానని గొల్లపల్లి భరోసా ఇవ్వడంతో ఆయనపై మరింత విశ్వాసాన్ని పెంచింది. అంతటితో ఆగకుండా కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో తాను మంత్రినై అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని ధీమాగా చెప్పారు. ముఖ్యంగా ఐదేళ్లలో తాను చేయాలనుకున్న అభివృద్ధిని అడ్డుకున్న వారిపై భారీ స్థాయిలో విమర్శలు గుప్పించడంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుంది. గత కొన్నేళ్లుగా యానాంలో రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి అక్రమాలకు తెర తీశారని, కోట్లాది రూపాయల ప్రజాధనంతో భవనాలు, విగ్రహాలు నిర్మించి అదే అభివృద్ధి అని యానాం ప్రజలను నమ్మించారన్నారు. నిజమైన అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాను అని సవాల్ విసిరారు. తన తండ్రి గంగాధర్ ఆశయాలను నెరవేర్చడానికి మాత్రమే తాను రాజకీయాల్లోకి వచ్చానని, యానం అభివృద్ధి తన ధ్యేయమని గొల్లపల్లి చెప్పుకొచ్చారు. అలాగే తనకోసం పనిచేసిన కార్యకర్తలకు వెన్నంటి ఉంటానని, సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ఎన్నికల్లో తన సత్తా చూపిస్తానని గొల్లపల్లి చెప్పకనే చెప్పారు. దీంతో నిన్నటి వరకు యానం ఎన్నిక వన్ సైడ్ గా ఉంటుందని భావించిన వారంతా ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. ప్రజల్లో గొల్లపల్లి హవా ఏ మాత్రం తగ్గలేదంటూ ఈ కార్యక్రమం రుజువు చేయడంతో వచ్చే ఎన్నికల్లో రసవత్తర పోరు తప్పేటట్టు లేదు. ఈసారి ఎన్నికలలో విజయం సాధించేది తామే అంటూ జబ్బలు చరుస్తున్న నాయకులు సైతం అయోమయంలో పడ్డారు.

# పిఠాపురం విద్యార్థులకు అసిస్టెంట్ కలెక్టర్ అభినందనలు



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు25:** అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 7వ తేదీన పిఠాపురం ఆర్ఆర్బీ హెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్, పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఉమా అలీషా ఉద్యానవనం సహా పలు కార్యాలయాలను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు లాలం షణ్ముఖ ప్రియా,సుశాంత్,రొంగల సత్యాంబికాలను నవంబర్ 24వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ మనీషా అభినందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి జి శ్యాంబాబు పాఠశాల ఆవరణలో ఈ ముగ్గురు విద్యార్థులను అభినందించారు. బాలల హక్కుల గురించి అవగాహన కల్పించడంలో విద్యార్థులు చూపిన ఉత్సాహం ప్రతిభను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఐసిడిఎస్ పిఠాపురం సిడిపిఓ దుర్గాదేవి, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు బాలల హక్కుల పరిరక్షణకు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. మండల విద్యాశాఖ ఐసీడీఎస్ బాలల హక్కుల పరిరక్షణ విభాగం సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం బాలల హక్కుల గురించి సమాజంలో అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ప్రతి ఒక్కరూ బాలల హక్కులను గౌరవించి వారి సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రతి కుటుంబంలో ఒక్క మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలి


**- 35% సబ్సిడీతో రుణాలు - మహిళా వ్యాపారాలకు కొత్త అవకాశాలు**

**- జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సహాయ ప్రాజెక్టు మేనేజర్ పి విజయలక్ష్మి**



**గొల్లప్రోలు (మనసులో మాట) నవంబరు 25:** గొల్లప్రోలు మండలం పరిధి చేబ్రోలు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మరియు జిల్లా పరిశ్రమల శాఖ సంయుక్తంగా ఉద్యమ నమోదు పై రెండవ విడత శిక్షణ శిబిరం కార్యక్రమంని నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఆర్ డి ఎ సహాయ ప్రాజెక్టు మేనేజర్ పి. విజయలక్ష్మి మాట్లాడుతూ..
ప్రతి కుటుంబంలో ఒక మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలి అన్ని పేర్కొన్నారు. అంతే కాకుండా వ్యాపార అభివృద్ధికి అవసరమైన శిక్షణలు, యంత్ర సామగ్రి కొనుగోలు కోసం 35 శాతం ప్రోత్సాహక రాయితీతో రుణాలు పొందవచ్చు అని తెలిపారు.
ఆహార ప్రాసెసింగ్ పథకం నిపుణుడు చె. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆహార పదార్థాల తయారీకి సంబంధించిన పరిశ్రమలు స్థాపించాలనుకునే మహిళల కోసం ప్రత్యేక పథకం ద్వారా 35 శాతం రాయితీతో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నాం అని వివరించారు. అదేవిధంగా పరిశ్రమల అధికారి సందీప్ మాట్లాడుతూ..ప్రధాని ఉపాధి సృష్టి పథకం పై
చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందేందుకు ప్రధాని ఉపాధి సృష్టి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంది అని, పరిశ్రమ స్థాపనకు అవసరమైన ఉద్యమ నమోదు పై మహిళలకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని అని తెలిపారు.
అలాగే, ఈ పథకం ద్వారా మహిళలకు వివిధ రంగాల్లో 35 శాతం రాయితీతో రుణాలు మంజూరు అవుతున్నాయని చెప్పారు. డిఆర్డిఏ సహాయ ప్రాజెక్టు మేనేజర్ సన్యాసిరావు మాట్లాడుతూ..
మండలంలోని స్వయం సహాయక సంఘాల ప్రతి సభ్యురాలు ఒక ఆదాయ సంఘటన కార్యక్రమం చేపట్టి కుటుంబ ఆదాయం పెంపొందించుకోవాలి అని, దాని ద్వారా మరికొందరికి ఉపాధి లభించేలా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ప్రతి కుటుంబం నుండి ఒక్క మహిళ పారిశ్రామిక వేత్త ఎదగడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమానికి మండల ఏపీఎం ఆర్ సన్యాసిరావు, డి ఆర్ డి ఏ సిసి లు నాయుడు, శ్రీనివాస్, వెంకటరమణ, డి ఆర్ పి లు సిహెచ్ పవన్ వీరేష్, ఎమ్ సూరిబాబు, వి ఆనంద్, ద్వాక్రా సంఘ వివో లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థికాభివృద్ధికే రైతన్న మీకోసం



**కాజులూరు (మనసులో మాట) నవంబరు 25..** రైతుల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమం చేపట్టిందని రామచంద్రపురం మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెనుమళ్ళ తర్లంపూడి గ్రామాలలో "రైతన్న ...మీకోసం" కార్యక్రమంలో రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు పంచసూత్ర ప్రణాళికలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ రైతన్న మీకోసం కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులకు భరోసా ఇవ్వగల పంచ సూత్ర ప్రణాళిక అయిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు సాగు, అగ్రిటెక్ , ఫుడ్ ప్రాసెసింగ్ , సాగుకు ప్రభుత్వాల మద్దతు గురించి రైతులకు వివరంగా తెలియచేశారు. రైతన్న మీకోసం వారోత్సవాల అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని దీని ప్రకారం ప్రాథమిక రంగాన్ని పునర్ వ్యవస్థీకరించడానికి రైతులను వ్యవసాయ సంరక్షకులుగా మార్చడం ద్వారా వారి జీవనోపాధి , ఆర్థిక ప్రమాణాలను పెంచడానికి సీఎం చంద్రబాబు నాయుడు నిర్దేశించిన పంచ సూత్రాలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. అంతేకాకుండా సోమవారం నుంచి రైతు సేవా కేంద్రం యూనిట్గా ప్రతి రైతు ఇంటికి ఈ పంచ సూత్రాల ఉద్దేశాన్ని తీసుకువెళ్లాలని రైతు సేవా కేంద్రంలోని వివిధ శాఖల సిబ్బందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రతి రైతుంసేవ కేంద్రం కింద ప్రతి మూడు ఇళ్లను ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసి , ప్రతి బృందం రోజుకు 30 క్లస్టర్లు కవర్ చేయాలని, రైతు సంక్షేమ చర్యలపై సీఎం లేఖను కరపత్రాలుగా పంపిణీ చేసి రైతులకు ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా పంచ సూత్రాల గురించి వివరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కూటమి పెద్దలు , అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సీఎం కరపత్రాలను రైతు ఇళ్లకు వెళ్లి వారికి వివరించి , అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెనుమళ్ళ , జగన్నాదగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు కొల్లు వెంకటేశ్వరరావు, కొండమూరి సత్యనారాయణ మండల వ్యవసాయ అధికారి విత్తనాల అశోక్ సిరిపురం దుగ్గుదురు నీటి సంఘం అధ్యక్షులు పేపకాయల నారాయణరావు లకాని కృష్ణ చైతన్య నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు బులుసు శివప్రసాద్ పలువురు రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పండుగగా జగ్గన్నతోట ప్రభల తీర్థం

**త్వరలో ప్రకటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు - రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**





**అమలాపురం (మనసులో మాట) నవంబరు 25:** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి కనుమ రోజున నిర్వహించే "జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని" రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబునాయుడు సమ్మతించారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం రాజోలు పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ ను %ూూ×ణజ% డైరెక్టర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు కలసి ప్రభుత్వ తీర్థం యొక్క ప్రాముఖ్యతను ఆయనకు చెప్పి వినతి పత్రం అందించగా మంత్రి దుర్గేష్ స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగగా జరుపుకునే సంక్రాంతిని పురస్కరించుకొని ఏటా లక్షలాది మంది భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగే జగ్గన్న తోట ప్రభల తీర్థ మహోత్సవానికి ప్రత్యేకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక మంత్రిగా తాను, సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఛైర్ పర్సన్ తేజస్విని పొడపాటి వేర్వేరు సందర్భాల్లో 450 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. ఈ క్రమంలో ప్రభల తీర్థాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం వెంటనే సమ్మతించారని స్పష్టం చేశారు. ప్రతి ఏటా కన్నుల పండువగా జరిగే ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి భక్తి పారవశ్యంలో మునిగి తేలుతారన్నారు. ఎన్నో తరాల నుండి సంప్రదాయంగా వస్తోన్న ఈ ప్రభల తీర్థం జరిగే సమయంలో పండుగ వాతావరణం నెలకొని అధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందన్నారు. వీటన్నింటితో పాటు కోనసీమ వాసుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఏకాదశ రుద్రులతో పాటు వివిధ రూపాలతో తీసుకువచ్చే జగ్గన్నతోట ప్రభల తీర్థ అద్భుత ఘట్టాన్ని అందరం కలిసి ఘనంగా నిర్వహించుకుందామని, అదే విధంగా ప్రపంచానికి చాటి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# ఇంటర్ ఫలితాలే లక్ష్యంగా సంకల్ప్ 2026



**పిఠాపురం, (మనసులో మాట నవంబరు) 25..** ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఇంటర్మీడియట్ విద్యాశాఖ 'సంకల్ప్ 2026' పేరుతో 50 రోజులు ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను ప్రారంభించిందని ఆర్ఆర్ బి హెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఊటుకూరి కేశవరావు తెలిపారు. నవంబరు 24వ తేదీ నుండి ఫిబ్రవరి 20, 2026 వరకు ఈ కార్యక్రమం అమలు చేయబడుతుందన్నారు. విద్యార్థులు అభ్యాస సామర్థ్యాల ఆధారంగా ఏ, బి, సి అనే మూడు కేటగిరీలుగా విభజించి ప్రతి కేటగిరీ విద్యార్థికి ప్రత్యేక శ్రద్ధతో బోధనా కార్యక్రమాలు చేపడతామన్నారు. మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి అభ్యాస లోపాలను సరిదిద్ది ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక బోధనలకు ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం లభించి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ప్రిన్సిపల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ కళాశాలలో విద్య నాణ్యతను పెంచేందుకు ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన పేర్కొన్నారు.



## అన్నదాత సుఖీభవ ఇంటింటా ప్రచారం



**ముమ్మిడివరం (మనసులో మాట ) నవంబరు 25:** అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ అన్నదాత సుఖీభవ పథకం అందేలా చర్యలు తీసుకుంటామని ముమ్మిడివరం శాసనసభ్యుడు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి గ్రామం లో మంగళవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో మాట్లాడుతూ అర్హత గల రైతుకు పీఎం కిసాన్ లబ్ధి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, రైతు అభివృద్దే రాష్ట్ర అభివృద్ధి కి పునాది అన్నారు. రైతు కోసం, అన్నదాత కోసం రైతన్న సేవలో మా ప్రయాణం నిరంతరం కొనసాగుతుందని సుబ్బరాజు తెలిపారు. ఈ కార్యక్రమం లో గోలకోటి దొరబాబు, పి. నారాయణ రావు, తాడి నరసింహారావు, అర్దాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, ఎ ఎం సీ చైర్మన్ ఓరుగు భాగ్యశ్రీ, గుద్దటి జమ్మి, బద్రి రమా, దాట్ల పృథ్వీ లతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పచ్చని బాటలో ఎన్ఎస్ఎస్ అడుగులు



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 25:** పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలో జిఎస్ఎల్ దంత వైద్య కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్-ఎస్)యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. మొక్కల ద్వారా పర్యావరణ సమతుల్యత పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమారపురం గ్రామ సర్పంచ్ నల్లా రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ డానియేలు, జిఎస్ఎల్ దంత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంటా సునీల్ , ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణం రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ సాహి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు,దంత వైద్య కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా వైద్యశాలను డిఎం అండ్ హెచ్ఓ ప్రసన్న ఆకస్మిక తనిఖీ



**పల్నాడు, నవంబర్ 25,(మనసులో మాట):** సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యాశాల ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రసన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులు లైను లో గంటల తరబడి వేచి ఉండడాన్ని గమనించి, వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉండాల్సిన సెక్యూరిటీ గార్డులు తమ స్థానాల్లో లేకపోవడాన్ని గుర్తించి, వారి పనితీరుపై మండిపడ్డారు. ఆసుపత్రిలో ఎవరి ఇష్టానుసారం వారు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, బాధ్యతాయుతంగా పనిచేయాలని హెచ్చరించారు. ఎవరికి కేటాయించిన విధుల్లో వారు ఉండాలని, రోగులను ఎక్కువసేపు నిలబెట్టకూడదని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



## గొల్లపల్లి తనయుడికి ఏపీ మంత్రి సుభాష్ శుభాకాంక్షలు

**యానాం (మనసులో మాట), నవంబరు 25:** కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ తనయుడు గొల్లపల్లి గంగాధర్ ప్రతాప్ రాణాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం యానంలో గొల్లపల్లిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ను గొల్లపల్లి దుస్సాలవాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు నాయకులు టీ. లక్ష్మణరావు, పి. సత్తిబాబు, కే త్రిమూర్తులు పాల్గొన్నారు.

## సామర్థ్యాల మదింపు సర్వే



**రామచంద్రపురం(మనసులో మాట)నవంబరు 25..** విద్యార్థులు అభ్యసన సామర్థ్యల మదింపు కొరకు పాఠశాల విద్యా శాఖ రాష్ట్ర వ్యాప్తంగా గ్యారంటీడు(ప్రాథమిక చదువు,లెక్కల నైపుణ్యాన్ని)చేపట్టిందని జిల్లా సీఎంఓ సీహెచ్ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని చింతపల్లి సూరన్న నగర్లో మంగళవారం డివిజన్ పరిధిలోని ఆరు క్లస్టర్లోని వివిధ పాఠశాలకు చెందిన విద్యారులతో జిల్లా విద్యా శిక్షణ సంస్ద సర్వేను నిర్వహించిందని జిల్లా విద్యా శిక్షణాసంస్థ భౌతిక శాస్త్ర అధ్యాపకుడు కే శ్రీకృష్ణసాయి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా విచ్చేసిన డీవైఈఓ పీ రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ భారత్ లక్ష్యాలు కొరకు ఉపాధ్యాయులు అందరూ కృషిచేయాలన్నారు. ఒకటి నుంచి అయిదు చదువుతున్న విద్యార్దుల సామర్ధాన్ని లీప్ యాప్ ద్వారా ఆన్లైన్లో ఉంచుతున్నట్లు ఎంఈఓ వీ నాగేశ్వరి వెల్లడించారు. డైట్ విద్యార్థిలు కె. మాధురి, సీహెచ్ దుర్గా భవాని,రాజేశ్వరి,ప్రవీణ,వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముద్రగడను కలిసిన

**ప్రకాశం, గుంటూరు, ఒంగోలు, జిల్లాల కాపు నాయకులు**

**న్యూస్ ఛానల్ అధినేత సాయి సుధాకర్**



**ప్రత్తిపాడు (మనసులోమాట) నవంబరు 25..** రాష్ట్ర కాపునాయకుడు. జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆ మంచి స్వాములు నెంబర్ 1 తెలుగు న్యూస్ ఛానల్ అధినేత మంచాల సాయి సుధాకర్ గుంటూరు ప్రకాశం ఒంగోలు. ఏలూరు జిల్లాల కాపు నాయకులుమంగళవారం కిర్లంపూడి లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యులు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ను ఆయన నివాసం లో మర్యాదపూర్వకంగా కలిశారు .ముద్రగడ తనయుడు ప్రత్తిపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును ఈ సందర్భంగా ఆయన సాయిసుధాకర్ ఆమంచిలకు పరిచయం చేశారు .వారు ముద్రగడతో కొంతసేపు ముచ్చటించారు పద్మనాభం గారి తో తమకున్న పరిచయాన్ని ఈ కలయిక సందర్భంగా గుర్తు చేసుకున్నారు ముద్రగడ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాపు జాతికి కొండంత అండ ముద్రగడ అని ముద్రగడ పద్మనాభం వల్లనే రెండు తెలుగు రాష్ట్రాల్లో కాపు జాతి నాయకులకు జాతి బిడ్డలకు గుర్తింపు వచ్చిందన్నారు కాపులకు మంత్రి పదవులు ఎమ్మెల్యే టిక్కెట్లు పార్టీ పరమైన పదవులు సంఖ్య పెరగడానికి ముద్రగడ కాపు జాతి కోసం చేసిన ఉద్యమమే కారణమని ఈ విషయం జాతి నాయకులందరికీ తెలుసని వారన్నారు . ముద్రగడ వంటి నీతి నిజాయితీ నిబద్ధత కల నాయకులు నేటి రాజకీయాలలో లేరన్నారు .ఆయన పూర్తి ఆరోగ్యంతో కూలుకున్నారని జనవరి నెల నుండి ముద్రగడ ప్రజల్లోకి రాబోతున్నారని నెంబర్ వన్ తెలుగు ఛానల్ అధినేత మంచాల సాయి సుధాకర్ అన్నారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తోటరామకృష్ణ పలు జిల్లాలకు చెందిన నాయకులు ముద్రగడను కలిసిన వారిలో ఉన్నారు.

## బొటనికల్ గార్డెన్ లో మొక్కలు నాటిన వీసీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ బోటనీ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ వెనుక బొటనికల్ గార్డెన్ ను పునరుద్ధరిస్తూ వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ మొక్కలు నాటారు. మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ, ఆర్కిటెక్ కే విజయనాంద్, హిందీ తెలుగు అనువాదకులు డాక్టర్ గణేష్ రామ్ అనువేది హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నన్నయ విశ్వ విద్యాలయాన్ని నందన వనం చేయడానికి కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా అన్ని మెడిసిన్ మొక్కలు, అరుదైన జాతి మొక్కలు ఇక్కడ నాటి బొటనికల్ గార్డెన్ ను పునరుద్దరిస్తామని తెలియజేశారు. యూనివర్సిటీలోని బోటనీ విద్యార్థులంతా మొక్కలు నాటి పర్యావేకిస్తారని, విశ్వ విద్యాలయంలోని విద్యార్థులు, అధ్యాపకులు దీనిలో భాగస్వామ్యం కావాలన్నారు. హిందీ - తెలుగు అనువాదకులు డాక్టర్ గణేష్ రామ్ అనువేది సహృదయంతో ముందుకు వచ్చి నన్నయ విశ్వ విద్యాలయాన్ని నందనవనంగా తీర్చిదిద్దేందుకు తమ కుటుంబ తరుపున రూ. లక్ష బహుకరిస్తున్నట్టు ప్రకటించారు. భవిష్యత్తులో విశ్వ విద్యాలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయం తరుపున వీసీ, విద్యార్థులు ఆయనను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ బోటనీ విభాగ అధ్యాపకులు డాక్టర్ వీ పద్మావతి, డీ స్పందణ, జెడ్ లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# అన్నదాతలకు చంద్రబాబుతోనే సురక్షిత భవిష్యత్తు - వర్మ

- జగన్మోహన్ రెడ్డి రైతులను మోసం చేశారు

- రైతు కుటుంబం నుండి వచ్చిన చంద్రబాబు రైతులకు ఎల్లప్పుడూ మేలు చేసేందుకు ప్రయత్నిస్తారు



**పిఠాపురం మనసులో మాట నవంబరు 25:** అన్నదాతలకు చంద్రబాబు తోనే సురక్షిత భవిష్యత్తు ఉంటుందని పిఠాపురం మాజీ శాసనసభ్యుడు ఎస్ వివిఎస్ఎన్ వర్మ అన్నారు. మంగళవారం పిఠాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు పక్షపాతి అన్నారు. ఎన్నికల హామీ మేరకు రైతులకు ఇప్పటివరకు రెండు విడతలుగా 14000 అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి రైతులను నిలువుల మోసం చేశారన్నారు. పోటం ప్రభుత్వం ఏర్పడ్డాక పోలవరం పట్టిసీమ పురుషోత్తపట్నం ప్రాజెక్టుల పనులు పరుగులు పెడుతున్నాయని వర్మ అన్నారు రైతుకు శాశ్వతమైన ఆర్థిక మార్పు లక్ష్యంగా 'రైతన్నా మీకోసం' అనే కార్యక్రమం ఈనెల 24 నుండి 29 వరకు జరుగుతుందని తెలిపారు. 'రైతన్నా మీకోసం' అనే కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రజాప్రతినిధులు రైతుల ఇంట వద్దకు వెళ్లి నూతన వ్యవసాయ పద్ధతులు పంచవర్ష సూత్రాలపై అవగాహన కల్పిస్తారన్నారు. భవిష్యత్తులో రైతును రాజుగా చేసేందుకు ఐదు విధానాల కార్యచరణ అమలు చేస్తామన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుండి రైతులకు కావలసిన సహాయాలు అందజేయనున్నట్లు తెలిపారు.

సూపర్ సిక్స్ అమల్లో భాగంగా ప్రతి హామీ అమల్లోకి తెచ్చామన్నారు అన్నదాత సుఖీభవ అంటే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, నాయకులు సకుమళ్ల గంగాధర రావు, సోము సత్యనారాయణ, గాది రాజబాబు, అనిశెట్టి సత్యానంద రెడ్డి, బర్ల అప్పారావు, పిల్లి చిన్న, దేవరపల్లి రామారావు, అద్దూరి శ్రీను, సంగిశెట్టి నానాజీ, ఏలుబండి బాబులు, సురవరపు సుబ్బారావు, పొన్నాడ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మిడివరం నియోజకవర్గం అభివృద్దే లక్ష్యం!

- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**ముమ్మిడివరం (మనసులో మాట ) నవంబరు 25..** ముమ్మిడివరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడం లో ఏ రోజూ వెనకడుగు వేయకుండా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం లోని పలు గ్రామాల్లో సీ.సీ. రోడ్ల కి మంగళవారం శంకుస్థాపన చేశారు. మండలం లో ఎం. జీ. ఎన్. ఆర్. ఈ. జి. ఎస్ నిధులతో మర్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ. 15 లక్షల వ్యయం తో నిర్మించబోయే మూడు సీసీ రోడ్లకు, అలానే అన్నంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 42.25 లక్షలు వ్యయంతో నిర్మాణం చేయబోయే రెండు సీసీ రోడ్లకు, చిన్న కొత్తలంక గ్రామం లో రూ. 42.66 లక్షలు వ్యయం తో నిర్మించబడనున్న ఆరు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అన్నంపల్లి లో డ్వాక్రా, రైతు సంఘాలు కిసాన్ సంఘాల 30 గ్రూపులకు 3 లక్షలు రూపాయల చెక్ ను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లో మహిళలకి అన్ని విషయాల్లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నాడు చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలు స్థాపించి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే స్థితి కి తీసుకొని వొచ్చారని, అలానే అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు కలసి కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో గోలకోటి దొరబాబు, పోద్దొకు నారాయణరావు, తాడి నరసింహారావు అర్ధాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, ఏ ఎం సీ చైర్మన్ ఓరుగు భాగ్యశ్రీ, గుద్దటి జమ్మి, వీరాస్వామి నాయుడు, గోదాశి పుండరీష్, కట్టా సత్తిబాబు, దొమ్మేటి రమణ కుమార్, అడబాల సతీష్, యాళ్ళ ఉదయ్, బొక్క రుక్మిణి, బద్రి రమా, మెండి కమల, తహసీల్దార్ టి. సుభాష్, డి.ఈ. శ్రీనివాస్, ఎంపీడీఓ దీక్షితులు తో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

### రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన

# ఐదు సూత్రాలపై అవగాహన చేసుకోవాలి

### రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎం. రజనీకుమారి



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 25..** రైతులు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలపై అవగాహన చేసుకోవాలని రాష్ట్ర ప్రస్తుత శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎం. రజనీకుమారి అన్నారు. మంగళవారం యు కొత్తపల్లి మండలం శీలంవారిపాలెం, కాకినాడ రూరల్ మండలం తమ్మవరం రైతు సేవా కేంద్రం నందు రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు .ఈ శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ, విజయవాడ, అదనపు సంచాలకులు డాక్టర్ ఎన్. రజిని కుమారి మాట్లాడుతూ రాష్ట్ర స్థూల విలువ జోడింపు (జి వి ఏ) నకు పశుసంవర్ధక శాఖ ద్వారా పాలు, గ్రుడ్లు, మాంసం ఎంతో దోహద పడతాయని. వీటిని పెంపొందించడతోనే పాడిరైతులకు, రాష్ట్రానికి అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.కె. కృష్ణమూర్తి సంయుక్త సంచాలకులు వారు పాల్గొని రైతన్న మీకోసం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకాలు కార్యక్రమం ప్రారంభించారు. మేకలకు మసూచి టీకా, పశువులలో దొమ్మ టీకా వేయడం జరిగింది. ఈ కార్యక్రమలలో డా. అంబేద్కర్, ఉప సంచాలకులు, కాకినాడ, డా.రాంప్రసాద్, ఉప సంచాలకులు, విజయవాడ, డా.రమేష్ చంద్ర సహాయ సంచాలకులు పిఠాపురం , డా.కె. ప్రత్యూష, నాగులాపల్ల పశువైద్యులు, డా.ప్రసాద్, డా.నవీన్, కాకినాడ పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 65-పశువులకు గర్భం ఎదగని, చూలు కట్టని వాటికి ఉచితంగా మందులు పంపిని చేసారు. సుమారు 50 మేకలకు మసూచి టీకాలు, 30 పాడి పశువులకు దొమ్మ టీకాలు వేయడమై నది .


# పిఠాపురంలో వైయస్సార్సీపి నిరసనలు, కోటి సంతకాల సేకరణ



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 25:** ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం పిఠాపురం పట్టణంలో తమ ఆందోళనలను కొనసాగించారు.

వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమంలో భాగంగా ఈ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. పట్టణంలోని 10 వ,11వ వార్డులలో వైసీపీ శ్రేణులు కోటి సంతకాల సేకరణను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మిరపకాయల వీధిలో రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు, ప్రజలకు కలిగే నష్టాలను పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకి వివరించారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మండలి సభ్యుడు గండేపల్లి బాబి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు నాణ్యమైన వైద్యం విద్య అందించే లక్ష్యంతో 17 ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి స్వీకారం చేపట్టినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటిని ప్రైవేటు పరం చేయడం పేద విద్యార్థుల కలలను నాశనం చేయడమేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పశ్చిమల్ల జ్యోతి అప్పలరాజు ,పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, కౌన్సిలర్ లు బొజ్జా రామయ్య ( పెద్దకాపు) అరిగెల వరలక్ష్మి, చెల్లూరి లోవరాజు, నాయకులు బత్తుల నాగ సాయిరాం , పితాని కాశీ విశ్వనాథ్, మొహిద్దిన్, జోగా రత్నరాజు, బిరుసు వర్ణేశ్వరరావు, అరిగెల రాజా, జవహర్ అలీ, రామకుర్తి నాగబాబు, బుక్క సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పందలపాకలో ఘనంగా సుబ్రహ్మణేశ్వరస్వామి కళ్యాణం మహోత్సవం



**అనపర్తి (మనసులో మాట) నవంబరు 25:** అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలంలోని పందలపాక గ్రామంలో,ప్రసిద్ధి చెందిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ నెల26 తేదీన షష్ఠి వేడుకలు సందర్భంగా, దేవదాయ శాఖ అధ్వర్యంలో స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు సిహెచ్ రవింద్ర శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకరించారు. ఈ కార్యక్రమంలోని ఆలయం ఇవో ఆకెళ్ల రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, ఈశ్వర్, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి చైర్మన్ కర్రి శ్రీను,శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామి చైర్మన్ కర్రి అయ్యప్ప రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎస్. విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పరాల వెంకట్ రెడ్డి, ఏం సి డైరెక్టర్ యమాల చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



### రాజీవ్ గాంధీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో

# భారత రాజ్యాంగ దినోత్సవం

**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 25..** ఎంపీజే సంస్థ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ హై స్కూల్ కాకినాడ లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసారు . ఈ కార్యక్రమానికి ఎంపీజే జిల్లా అధ్యక్షులు హలీమ్ అధ్యక్షత వహించగా ఆ పాఠశాల హెచ్ ఎమ్ జె సుబ్బలక్ష్మి ముఖ్య అతిధిగాను, ప్రముఖ న్యాయవాది సయ్యద్ సాలార్ ప్రతేక అతిధిగాను, ఏపీ రాష్ట్ర సుప్రీమ్ కౌన్సిల్ మెంబెర్ షేక్ హుస్సేన్ , జనరల్ సెక్రటరీ ఉస్మాన్ షబ్బీర్ , జాయింట్ సెక్రటరీ బషీరా సుల్తానా, కోఆప్షన్ మెంబెర్ గిరిజా జిల్లా సభ్యులు ఎండి ఇబ్రహీం, నాయన రాజు పాఠశాల బోధనా సిబ్బంది 10 మంది పాల్గొన్నారు. స్కూల్ విద్యార్థులు 400 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం హక్కులు అనే అంశము పై విద్యార్థులకు వక్తృత్వము, వ్యాసరచన, చిత్రాలేఖనం లో పోటీలను నిర్వహించి విజేతలు 27 మందికి బహుమతుల తోపాటు సర్టిఫికెట్స్ ప్రదానము చేసారు . పోటీలు నిర్వహించిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్ తో అభినందించడం జరిగింది.రాజ్యా%శీ%గ దినోత్సవ సందర్భముగా సభాధ్యక్షులు హలీమ్ మాట్లాడుతూ రాజ్యాంగం యొక్క ఆవశ్యకత ను ఉదాహరణాలతో వివరించారు. విద్యార్థి దశ లోనే క్రమశిక్షణ, నైతిక విలువలు పాటించాలని ఉద్బోధించారు. స్కూల్ హెచ్ ఎమ్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతీ దేశానికి అత్యవసరమని, పాఠశాల నిర్వహణ కూడా ఒక రాజ్యాంగం వంటిదేనని ఉదాహరణలు ఇచ్చారు. ఎంపీజే సుప్రీమ్ కౌన్సిల్ మెంబెర్ మాట్లాడుతూ ఎంపీజే సంస్థ పూర్తి స్థాయిలో రాజ్యాంగం ను అమలు పరుస్తూ పనిచేస్తుందని వివరించారు. ప్రత్యేక అతిధిగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది సయ్యద్ సాలార్ సుధీర్ఘ ప్రసంగం చేశారు. ఆ ప్రసంగం లో భారత దేశ పూర్వ చరిత్ర, ప్రస్తుత చరిత్ర ను సరిపోలుస్తూ రాజ్యాంగం ఆధారముగా ప్రజలు అనుభవించిన కష్టాలు, హింసలు తెలుపుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత పేద ప్రజలు విద్య, ఆరోగ్యం, ఉద్యోగం రిత్యా ఎలా అభివృద్ధి చెందారో వివరంగా తెలిపారు. ఆ పాఠశాల లో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు కూడా భారత రాజ్యాంగం గూర్చి విద్యార్థులకు వివరించారు. అనంతరం న్యాయవాది సాలార్ ని పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం సభా అధ్యక్షులు ఎంపీజే కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎండి హలీమ్ విద్యార్థులను, అక్కడ హాజరైన వారందరికీ చేత భారత రాజ్యాంగ పీఠిక ను ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీజే జనరల్ సెక్రటరీ ఉస్మాన్ షబ్బీర్ వందన సమర్పణ చేసిన తరువాత అందరూ జాతీయ గీతము జనగణమన పాడిన తరువాత విద్యార్థులదరికి స్నాక్స్ పంపిణి చేసి ముగించడం జరిగింది.

# పంచ్ పడింది.. పతకం వచ్చింది

- కాంస్యంతో మెరిసిన పిఠాపురం బాక్సర్



**పిఠాపురం,( మనసులో మాట) నవంబరు 25:** బాక్సింగ్ క్రీడలో పిఠాపురం పేరు మరోసారి ప్రతిధ్వనించింది. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న రాజమహేంద్రవరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర కళాశాల మహిళా బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పిఠాపురం విద్యార్థిని కాకడ హరిని కాంస్య పతకం సాధించినట్లు కోచ్ పీ లక్ష్మణరావు తెలిపారు. 54 కేజీల విభాగంలో తన అద్భుతమైన ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న హరిణి ని తన బలమైన పంచులు ఆత్మవిశ్వాసంతో కూడిన ఆటతీరితో ఈ ఘనత సాధించింది. క్రీడాకారిణిగా ఆమె చేసిన కృషి పట్టుదల ఆమెకు ఈ విజయాన్ని తెచ్చిపెట్టాయని పలువురు కొనియాడారు. ఆమె సాధించిన ఈ విజయం పిఠాపురానికి గర్వకారణం అని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ కె.వి స్వామి చేతుల మీదుగా హరిణి కి కాంస్య పతకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన హరిణిని అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



# సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం

### ఉత్సాహభరిత ఏర్పాట్లతో సిద్ధమైన ఆలయాలు

**కాజులూరు (మనసులో మాట) నవంబరు 25..** సుబ్రహ్మణ్య స్వామివారి సేవకు, భక్తి పరవశంతో జరిగే సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం సందర్భంగా పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కాజులూరు, గొల్లపాలెం, శీల, జగన్నాధగిరి, పెనుమళ్ళ ప్రాంతాల ఆలయాలు పండుగ సందడితో ముస్తాబయ్యాయి. ప్రతి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చక వర్గం సిద్ధం చేసిన శాస్త్రోక్త సేవలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విస్తృత ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువజం నుండే ప్రత్యేక పూజలు అనంతరం దర్శన ఏర్పాట్లు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి. భక్తులను కనువిందు చేసే ఆలయ అలంకార శోభతో ఆధునిక విద్యుత్ వెలుగులు భక్తులను మై మరిపించేలా చేస్తున్నాయి.ఈ ప్రాంతంలోని ప్రధాన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాలు పూలతో, విద్యుత్ దీపాలతో, తోరణాలతో అలంకరించబడి శోభాయమానంగా నిలిచాయి. పల్లిపాలెం ఉప్పుమిల్లి కాజులూరు మరియు గొల్లపాలెం షీలా జగన్నాథగిరి పెనుమళ్ళ ఆలయాల్లో స్వామివారి కోసం ధ్వజస్తంభం పరిసరాలు ధార్మిక చిహ్నలతో అలంకరించారు.ప్రాంతాల్లో శాశ్వత మండపాలను శుభ్రపరిచి పునరుద్ధరించారు. పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత పండుగ సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండనుండడంతో పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం క్యూలైన్‌లు, మహిళల భద్రత కోసం ప్రత్యేక సిబ్బంది నియామకం వంటి చర్యలు చేపట్టారు. ఇక అంబులెన్స్, ఫస్ట్‌ఎయిడ్ టీంలు కూడా సిద్ధంగా ఉంచడం ద్వారా అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నారు. ఉపవాస దీక్షలు, నాగబలి, సర్పసంకల్పం, లఘు రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు వంటి శాస్త్రోక్త సేవల ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం , షెల్టర్ ఏర్పాట్లు కూడా నిర్వహించబడ్డాయి.

**భక్తి సందడితో జరగనున్న మహోత్సవం..**

ప్రతి సంవత్సరం వైభవంగా జరిగే సుబ్రహ్మణ్య షష్టి ఈసారి మరింత భక్తిపారవశ్యంతో జరగనుంది. గ్రామాలన్నింటిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుండగా, స్వామివారి దర్శనానికి ప్రాంతం నలుమూలల నుంచి భక్తులు తరలి రానున్నారు. భక్తుల సౌలభ్యానికి ప్రభుత్వ, ఆలయ కమిటీలు, స్థానికులు కలిసి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయడం పండుగ విజయానికి తోడ్పడనుంది.

### వైద్య, ఆరోగ్య చేనేత, జౌళి శాఖల అధికారులతో

# ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సమీక్ష



**కాకినాడ ( మనసులో మాట) నవంబర్ 25..** డిసెంబర్ 1 నుండి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో జిల్లా లో పలు కీలక శాఖల అభివృద్ధికి సంబంధించి నిధులు మంజూరు, కొత్త ప్రాజెక్టుల కోసం పార్లమెంట్ లో జిల్లా వాణిని బలంగా వినిపించేందుకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సమాయత్తమవుతున్నారు. ఇందుకోసం కాకినాడ క్యాంపు కార్యాలయంలో జిల్లాలో పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించి, అధికారుల నుండి సమాచారాన్ని సేకరిస్తున్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, చేనేత, జౌళి శాఖల ఉన్నతాధికారులతో విడివిడిగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. తొలుత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి జిల్లాలో ఆసుపత్రులు అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పన, కొత్త ఆసుపత్రుల నిర్మాణం, కోసం ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆదేశించారు, అనంతరం చేనేత, జౌళి శాఖ అధికారులతో సమీక్షించి జిల్లాలో చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లాలో ఉన్న 23 వీవర్స్ సొసైటీలను మరింత బలోపేతం చేయడంతో పాటు, చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 4000 మంది కార్మికుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను చర్చించి, కేంద్రం నుండి మరిన్ని నిధులు సాధించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరసింహ నాయక్, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడి బి. తవిట నాయుడు,డిఓ రవికుమార్, ఏవో లు రాంబాబు, చేతన్, రాష్ట్ర పద్మశాలి డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతే దేశానికి వెన్నుముక



**పల్నాడు, నవంబర్ 25,(మనసులో మాట)...** రైతే దేశానికి వెన్నుముక అనే నినాదాన్ని నిజం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీకోసం అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టటం ఎంతో శుభ పరిణామం అని టిడిపి నాయకులు వెన్నా సీతారామిరెడ్డి అన్నారు.బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1200 మంది రైతు కుటుంబాల సమాచారం సేకరించినట్లు ఆమె తెలిపారు. మండలంలోని రైతులందరూ సహకరించి ఈనెల 29వ తారీకు లోపు రైతు సేవా కేంద్ర సిబ్బందికి రైతుల వివరాలు అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, కిచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రాజవోలులో పంట పొలాలను పరిశీలించిన మంత్రి నాదెండ్ల

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం రాజానగరం మండలంలోని రాజవోలు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి వెంట రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. గ్రామంలోని పంట పొలాల వద్ద ప్రస్తుత కోతల పురోగతిని మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. పంట కోతల కోసం ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన రైతు కూలీలతో మంత్రి మనోహర్ మాట్లాడి వారి సమస్యలు, పని పరిస్థితులు, వేతనాలు వంటి అంశాలను తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో ఏ రకం ధాన్యం సాగు చేశారు, ఇప్పటి వరకు ఎంత దిగుబడి వచ్చిందనే వివరాలను సేకరించారు. రైతుల కష్టాన్ని మంత్రి ప్రశంసిస్తూ, పంటను సురక్షితంగా కోయడంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 28వ తేదీ తర్వాత వాతావరణంలో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు వేగంగా కోతలు పూర్తి చేసి, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ ఏడాది ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సంపూర్ణంగా సిద్ధంగా ఉందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. రైతు ప్రయోజనాలే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమన్నారు. రైతులకు సమయానుకూల సహాయం, పారదర్శక కొనుగోలు విధానం, సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖలు సమన్వయంగా పని చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కోతలు, రవాణా, కొనుగోలు వ్యవహారాలలో ఎలాంటి ఆటంకాలు రాకుండా కలెక్టర్ కార్యాలయం నుండి నిరంతర మానిటరింగ్ జరుగుతుందని తెలిపారు.

## గుమ్మళ్ళదొడ్డిలో నేటి నుండి 96వ షష్టి మహోత్సవాలు

### కోర్కెలు తీర్చే స్వామి సుబ్రహ్మణ్యేశ్వరుడు





**గోకవరం (మనసులో మాట), నవంబర్ 25:** గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో సుందరగిరిపై శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సహిత గాయత్రీ సమేత పంచముఖ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 26వ తేదీ నుండి డిసెంబర్ ఒకటో తేదీ వరకు 96వ షష్టి కళ్యాణ మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఏ ఎన్ ఎస్ ఆచార్యులు మాట్లాడుతూ గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో సుందరగిరి పై లోక కళ్యాణార్థమై వేంచేసియున్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్టి మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా 26వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి స్వామి వారి దివ్య కళ్యాణం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా 28వ తేదీ ఉదయం 8 గంటల నుండి శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తామని ఆచార్యులు వివరించారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దివ్య సన్నిధిలో భక్తుల ఆయురారోగ్యాలు, ఐశ్వర్య, అభివృద్ధికై షష్టి ఆరు రోజులు గోత్ర నామములతో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని వారికి అర్చన, అభిషేకములు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి మంగళవారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసుకోవడం వల్ల అనేక జన్మల ప్రారబ్ద కర్మలు తొలగి, జీవితం ఆనందమయమై సకల ఐశ్వర్యములు అభివృద్ధి కలుగుతుందన్నారు. ఈ ఆలయంలోని స్వామివారిని దర్శిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సంతాన ఫలం కలుగుతుందని, ఇలా అన్ని విధాల స్వామివారి ఆశీస్సులు లభిస్తాయని తెలియజేశారు. భక్తులు షష్టి మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు

## గొల్లప్రోలు బాలికల పాఠశాలలో ఘనంగా మాక్ పార్లమెంట్ కార్యక్రమం

### - వేషధారణలు, సభా చర్చలు, తీర్మానాలతో ఆకట్టుకున్న బాలికలు




**గొల్లప్రోలు (మనసులో మాట), నవంబరు 25:** గొల్లప్రోలు పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారి బి. వెంకట శివప్రసాద్ ఆధ్వర్యంలో వాక్ పార్లమెంట్ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు భారత రాజ్యాంగం, పార్లమెంటు విధానం వంటి అంశాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖల వేషధారణలతో ఆకట్టుకున్నారు. రూపొందించిన అలంకరణ, బ్యానర్లు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ స్వయంగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి కె వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ... పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తూ, గ్రామీణ ప్రాంతాల బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్యంపై అవగాహన, ధైర్యంగా మాట్లాడే నైపుణ్యాలు పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై బాలికలు సభా విధానాలను అనుసరించి ప్రశ్నోత్తరాలు, చర్చలు, తీర్మానాలు ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించిన తీరు నిజమైన ప్రజాప్రతినిధుల సమావేశాన్ని ప్రతిబింబించేలా ఉందని విద్యార్థులను అభినందించారు..

ఈ కార్యక్రమంలో సమయపాలన, విషయం స్పష్టత, ఆత్మవిశ్వాసం, ప్రదర్శన నైపుణ్యాల ఆధారంగా బాలికల తమ ప్రతిభను గొప్పగా ప్రదర్శించారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు వలన గ్రామీణ బాలికల్లో సామాజిక సమస్యలపై అవగాహన పెంపు, భవిష్యత్తులో నాయకత్వ స్థానాలకు చేరుకునే అవకాశాలను, తమలో ధైర్యం, మాట్లాడే నైపుణ్యం, సమాజంపై అవగాహన పెరుగుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె వెంకట శివప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం మండల వ్యవసాయ శాఖ అధికారి ఉద్యాన వన శాఖాధికారి ఆధ్వర్యంలో మర్రివీడు గ్రామం లో రైతన్న మీ కోసం



**ఏలేశ్వరం (మనసులో మాట)నవంబర్ 25..** ఏలేశ్వరం మండలం వ్యవసాయ అధికారి ఏ. వి.రాజేష్ మండల ఉద్యానవన శాఖ అధికారి కె.దివ్య శ్రీ ఆధ్వర్యంలో మర్రివీడు గ్రామం లో రైతన్నా మీకోసం వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి హాజరైయ్యారు. గ్రామ నాయకులతో కలిసి గ్రామ రైతుల ఇంటి వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులను రాబోయే ఐదు సంవత్సరాలలో రైతునే రాజుగా చేయడానికి సంకల్పం చేసుకున్నారని దానిలో భాగంగా ఐదు ప్రధాన అంశాలను గూర్చి ఈ రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్,ఫుడ్ ప్రోసెసింగ్,ప్రభుత్వం నుంచి మద్దతు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు .వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు, యంత్ర పరికరాలు, డ్రోన్స్, సూక్ష్మ నీటి పారుదలకు సంబంధించి డ్రిప్, స్ప్రింకర్ పైపులను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే రైతుల కోసం ఏపీ ఎయిమ్స్ రైతు యాప్ ను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని రైతులు ఈ యాప్ నందు రిజిస్ట్రేషన్ అవ్వడం ద్వారా ప్రస్తుత వాతావరణ పరిస్థితి, మార్కెట్ కి సంబంధించిన ధరలు,ముందస్తు చీడపీడల పరిస్థితి, పంటనమోదు వివరాలు, పంట నష్టం వివరాలు రియల్ టైంలో తెలుసుకోవచ్చున్నారు. ఇతర వ్యవసాయ ఆధారిత వీడియోలు వీక్షించవచ్చని తెలిపారు.ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి పెట్టాలని తద్వారా తమ పంటలకు నాణ్యమైన దిగుబడితో పాటుగా ఇంటర్నేషనల్ స్థాయి గుర్తింపు రావడంతో ఆర్థికంగా మరింత బలపడవచ్చని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలోఎంపిడిఓ రవికుమార్ వర్మ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ.నిఖిల్ టిడిపి నాయకులు నీలి సత్యనారాయణ,బుచ్చి అప్పలరాజు,సిరిపురపు శ్రీను,గ్రామ కూటమి నాయకులు,వ్యవసాయ,ఉద్యానవన శాఖ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా దృక్పథంతో ప్రజలకు వైద్యం అందించాలి

### ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 25 :** గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జగ్గంపేట శాసనసభ్యుడు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పురం శెట్టి శివాజీ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందించాలని సతద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నాయని తెలిపారు. కొత్తపల్లి పిహెచ్ కి అనుసంధనంగా ఈ వెల్ నెస్ సెంటర్లు ఆరోగ్య సేవలు అందిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అదేవిధంగా గ్రామంలో సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు.

**మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు**

తిరుమలాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పర్యటించి విద్యార్థులకు పెడుతున్నటువంటి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పెడుతున్నటువంటి ఆహారాన్ని ఎమ్మెల్యే నెహ్రూ స్వయంగా తిన్నారు. అలాగే విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు కావలసిన వసతులను మంజూరు చేయవలసిందిగా విద్యార్థులు ఎమ్మెల్యేకు విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ భరత్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్ వి ఎస్ అప్పలరాజు, సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ రాము, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొండబాబు , మండల టిడిపి అధ్యక్షుడు పిల్లా అర్జున సారథి (చంటిబాబు), క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, దొరబాబు, సత్యనారాయణ, బుజ్జి, చెన్నంశెట్టి చక్ర రావు, సూర్యప్రకాశ్రావు , బాబ్జి, మహాలక్ష్మి, జయరాజు తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ రెహానా బేగం చొరవతో గోవుల సంరక్షణకు కీలక ఆదేశాలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** గో సంరక్షణలో ఆర్టీఐ కీలక ఆదేశాలు. రాజమహేంద్రవరం సమీపంలోని బొబ్బిల్లంకలో శ్రీ భగవాన్ మహావీర్ జైన్ గోశాలలో గోవులు చనిపోతున్నాయన్న అంశంపై సమగ్ర విచారణకు ఆదేశించిన ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ రెహానా బేగం. కమిషనర్ ఆదేశాలతో కదిలిన జిల్లా యంత్రాంగం. బొబ్బిల్లంకలోని శ్రీ భగవాన్ మహావీర్ జైన్ గోశాలలో చనిపోయిన గోవులు ఎన్ని, ఏ కారణాల వల్ల చనిపోయాయి, గోసాల కెపాసిటీ ఎంత, సిబ్బంది, ఆహార, నీటి నిల్వలు తదితర అంశాల పై ఆర్ శ్రీనివాస్ అనే సామాజిక కార్యకర్త ఆర్టీఐ కింద 2023 అక్టోబరు 30న సమాచారాన్ని అడిగారు. రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సరైన సమాధానం రాకపోవటంతో గత ఏడాది జూన్ లో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ కమిషన్ లో సెకెండ్ అప్పీల్ దాఖలు చేశారు. ఈ కేసును ఈ ఏడాది ఆగస్టు 12న విచారించిన ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ రెహానా బేగం దరఖాస్తుదారుకు పూర్తి సమాచారం ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఆ సందర్భంగా హాజరైన రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శ్రీ భగవాన్ మహావీర్ జైన్ గోశాల ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో ఉందని, ప్రభుత్వ యంత్రాంగం అధీనంలో లేదని ఆర్టీఐ కమిషనర్ దృష్టికి తీసుకుని వచ్చారు. గోశాల ప్రైవేటు సంస్థ నిర్వహణ కింద ఉన్నప్పటికీ మూగ జీవాలు ముఖ్యంగా గోవుల సంరక్షణ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం తమ బాధ్యత నుంచి తప్పించుకోవటం సరైంది కాదని, గోశాలలో గోవుల మరణాల ఆరోపణలు, వాస్తవ పరిస్థితి పై క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆర్టీఐ చట్టం, సెక్షన్ 18 (2) కింద కమిషనర్ డాక్టర్ రెహానా బేగం ఆదేశించారు. దీంతో మంగళవారం మంగళగిరి కమిషన్ కార్యాలయంలో జరిగిన విచారణకు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న ప్రత్యక్షంగా హాజరై విచారణ నివేదిక కమిషనర్ కు, దరఖాస్తుదారుకు సమర్పించారు. కమిషనర్ డాక్టర్ రెహానా ఆదేశాలతో జిల్లా యంత్రాంగం గోశాలలో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపింది. గోశాల నిర్వహణలో ఉన్న లోపాలను గుర్తించింది. సీసీటీవీ కెమెరాలు పని చేయటం లేదని, రికార్డులను సరిగా నిర్వహించటం లేదని నివేదికలో పేర్కొన్నారు. గోసాల నిర్వహణను ఎండోమెంట్ శాఖ అధీనంలోకి తీసుకుని వచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ జిల్లా కలెక్టర్ కు లేఖ రాశారు. కమిషన్ ఆదేశాల నేపథ్యంలో గోవుల ఆరోగ్య స్థితి, అందిస్తున్న ఆహారం, నీరు, తదితర అంశాలను రెగ్యులర్ గా పర్యవేక్షించేందుకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ను నియమిస్తూ జిల్లా యానిమల్ హజ్బెండరీ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ అన్ని అంశాలను మంగళవారం జరిగిన విచారణ సమయంలో కమిషనర్ కు వివరించారు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి.




## ఎంఈఓ లు తరచూ భవిత కేంద్రాలను సందర్శించాలి

### - సమగ్ర శిక్షా ఏపీసీ సుభాషిణి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** మండల విద్యాశాఖాధికారులు భవిత కేంద్రాలను కూడా సందర్శించి, సూచనలు చేస్తూ ఉండాలని జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్ సుభాషిణి అన్నారు. స్థానిక లాలా చెరువు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఎంఈఓలకు ఒక రోజు శిక్షణా తరగతులను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమగ్రశిక్షా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. భవిత కేంద్రాలను కూడా ఎంఈఓ లు సందర్శించి, సూచనలు ఇవ్వాలన్నారు. భవిత కేంద్రాలకు అధికంగా ప్రాధాన్యత ఇచ్చి, దివ్యాంగ విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ కనకబాబు, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ ఎస్తేరు రాణి, కొయ్యలగూడెం డీవైఈఓ రామన్నదొర, అర్బన్ రేంజ్ రేంజ్ డీఐ బీ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

## మహిళా హక్కులపై అవగాహన సదస్సు




**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 25:** అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, విద్యార్థులకు వారి హక్కులు చట్టపరమైన రక్షణలు ఎదురయ్యే సమస్యలపై ఈ కార్యక్రమంలో విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా మండల న్యాయ సేవా అధికార సంఘం న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొని మహిళల భద్రత, గృహహింస నివారణ లైంగిక వేధింపులు ఇతర నేరాలు గురించి వివరించారు. మహిళల హక్కులను పరిరక్షించే వివిధ చట్టాల గురించి వాటిని ఎలా ఉపయోగించవచ్చో వివరించారు. ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించేందుకు న్యాయ సేవా అధికార సంఘం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక ఆర్థిక విద్యాపరమైన సమస్యలను అధిగమించడానికి చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మహిళల సాధికారతకు ఉపయోగపడతాయని సమాజంలో లింగ వివక్షత తగ్గించడానికి దోహదపడతాయని న్యాయ సేవ అధికార సంఘం వారు తెలిపారు.మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## కన్వీర్జెన్సీ సమావేశం



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 25:** గోకవరం మండలం జి. కొత్తపల్లి వైద్యాధికారి డా నిఖిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కన్వీర్జెన్సీ మీటింగ్లో ఐ. సి. డి. ఎస్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. నిఖిత మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్, ఏ యెన్. ఎమ్ లు ఆశాలు సమన్వయం తో ముందుకు వెళ్లాలని ప్రతీ నెలా వి. హెచ్. యెన్. డి కార్యక్రమం లో లోకల్ లీడర్స్ ను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఫీల్డ్ లెవెల్ లో గర్భవతులను నమోదు చేసినపుడు అందరు రిజిస్టర్లు నమోదు చేసి ఫాలో అప్ చేయాలని ఈ సందర్బంలో వైద్య ఆరోగ్య శాఖ వారితో సమన్వయం చేసుకోవాలని, వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చునపుడు అందరూ లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. పిల్లలను ఎవ్వరూ వదిలివేయకుండా సమన్వయంతో పనిచేసుకోవాలని, డిసెంబర్ నెలలో 21, 22, 23 తేదీలలో జరిగే పల్స్ పోలియో కార్యక్రమం ను విజయవంతం చేయాలని, తీవ్ర పోషకాహార లోపం తో వున్న పిల్లలకు అంగన్వాడీ సెంటర్స్ లో అనుబంధ ఆహారం ఇవ్వాలని వైద్యాధికారులు సెంటర్స్ సందర్శించినపుడు ఆహరలోపం గల పిల్లలకు సమస్యలేమైనా ఉంటే చూపించాలని తగిన చికిత్స జరుగునట్లు చూడాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది ఫోక్సో చట్టం గూర్చి అవగాహన కల్పించారు. ఐ. సి డి.ఎస్. సూపర్ వైజర్ ఎల్. రజని మాట్లాడుతు అంగన్వాడీ సెంటర్స్ పరిశుభ్రము గా ఉంచుకోవాలని ప్రతీ స్కూల్ పిల్లలు పౌష్టిక ఆహరం తీసుకొనున్నట్లు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెచ్. ఎస్. బి. రాజేశ్వరి, ఎమ్. పి. హెచ్.ఎ. పవన్, ఎ.యెన్.ఎమ్‌లు, అంగన్వాడీ టీచర్స్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

## స్వచ్ఛత హి సేవా కార్యక్రమం పై పోటీలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 25:** విద్యార్థులకు జీఎస్టీ విభాగంచే 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమం పై పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తం అని జీఎస్టీ సూపరింటెండెంట్ విజయప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం వస్తు సేవల పన్నుల విభాగం (జీఎస్టీ) ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం పై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నగరంలో పది పాఠశాలలకు త్వరలో ఆర్వో ప్లాంట్లను అందుచేయనున్నట్లు ప్రసాద్ ప్రకటించారు.

**విజేతల వివరాలు..** వ్యాస రచనలో ప్రథమ బహుమతి జీ వీరా స్వామి (ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల), చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి ఎల్ మహేష్ లక్ష్మణ్ (ఎస్ కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల), వక్తృత్వంలో ప్రథమ బహుమతి ఏ ఎస్తేరు జ్యోతి (ఎస్ కేవీటీ ప్రభుత్వఉన్నత పాఠశాల) పొందారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ బీ దిలీప్ కుమార్, జీఎస్టీ అధికారి సునీల్, ఎస్ కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పుప్పాల బాపిరాజు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
బుధవారం 26 నవంబర్ 2025
పేజీ : 17

# ఘనంగా జరిగిన అంతర్జాతీయ మహిళ హింస నిర్మూలన దినోత్సవం

## - సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు




**ధర్మవరం నవంబర్ 25 (మనసులో మాట)..** పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో, సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహిళలపై హింస నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవం కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస వేధింపులు, విషయములో అనేక చట్టాలు ఉన్నాయని తద్వారా నేరం చేసిన వారు ఖచ్చితంగా శిక్షింపబడు దురు అని తెలిపారు. ప్రతి సంవత్సరం నవంబర్ 25న అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం జరుపుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దినోత్సవం లక్ష్యం మహిళలపై హింస అనేది మానవ హక్కుల ఉల్లంఘన అని అందరికీ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మహిళలు బాలికలపై జరిగే దాడులు లైంగిక వేధింపులు ఇంట్లో తదుపరి బయట జరుగుతున్న ప్రతి హింస చర్యను నివారించాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జ్ హరీష్, న్యాయవాదులు బాలసుందరి, సుమలత తో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



### పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

## సిరిపురం హరి

**పలమనేరు నవంబర్ 25 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం (రెజి. నం. 298/2023) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు జిల్లా, పలమనేరు మండలం, సముద్రపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి సిరిపురం హరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ....ఈ బాధ్యతకు ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు రమేష్ బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సంఘ అభివృద్ధి, పంచాయతీ కార్యదర్శుల సంక్షేమం కోసం త్రికరణ శుద్ధిగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలమనేరు ఏపీఎన్జీజీవో సంఘం అధ్యక్షుడు ఆనంద బాబు వీరి ఎన్నికపై హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర స్థాయి బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు.

### వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

### సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్



**ధర్మవరం నవంబర్ 25 (మనసులో మాట)..** వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, వ్యవసాయ అధికారి ముస్తఫా తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పోతుకుంట గ్రామం వద్ద రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రస్తరించార్జ్ మహేష్ చౌదరి కూడా పాల్గొన్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశాన్ని కూడా వివరించడం జరిగిందని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న వివిధ సేవలు, అన్నదాత సుఖీభవ, రాయితీపై డ్రిప్పు పరికరాలు, పొలం పిలుస్తోంది మొదలైన పథకాలు గూర్చి తెలియజేయడం జరిగిందని తెలిపారు. తదుపరి రైతుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని సచివాలయ సిబ్బంది ద్వారా తెలియజేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి రైతుల వివరాలు సేకరించాల్సి ఉందని కావున రైతు సోదరులు కూడా సచివాలయ ఉద్యోగులకు సహకార అందించాలని వారు తెలిపారు.

### ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి

## బి కృష్ణవేణి పై వేటు..

### సర్వీస్ నుంచి తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలు

ధర్మవరం నవంబర్ 25 (మనసులో మాట) శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం సీనియర్ సివిల్ జిర్జి బి. కృష్ణవేణి (ప్రస్తుతం సస్పెండ్ లో ఉన్నారు) తొలగిస్తూ న్యాయశాఖ ఈనెల 24న ఉత్తర్వులను జారీ చేసింది. వీరు మూడు సంవత్సరాలుగా ధర్మారం కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్నప్పుడు ఎన్నో ఆరోపణల విషయంలో, అప్పటి జిల్లా జడ్జికి ఫిర్యాదులు పోయాయి. తీర్పులు రాయకపోవడం, ఉత్తర్వులపై సంతకాలు చేయడంలో విఫలం కావడం, సిబ్బందికి కొన్ని పనులు అప్పగించడం తదితర ఆరోపణలపై కృష్ణవేణి పై కలవు. అంతేకాకుండా ధర్మవరం బార్ అసోసియేషన్ జడ్జి కృష్ణవేణి పై కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. మొత్తం 12 అభియోగాలు నమోదు కావడంతో విచారణ కొన్ని రుజువు కాగా మరికొన్ని నిరూపణ కాలేకపోయాయి. రుజువైన అభియోగాలు నిజమేనని విచారణ నివేదికలో పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఆమెని సర్వీసు నుంచి తొలగించాలని సిపార్సి చేయడం జరిగింది. దీంతో జడ్జి కృష్ణవేణి తక్షణమే సర్వీసు నుంచి తొలగిస్తున్నట్లు న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులను జారీ చేశారు. అప్పట్లో న్యాయవాదులు ఫిర్యాదు చేసిన వాటికి నేడు కోర్టు ద్వారా న్యాయం జరిగిందని ధర్మవరం న్యాయవాదులు తెలిపారు.

### వ్యవసాయానికి పూర్వవైభవం...

# అన్నదాతకు ఆనందం

- వైసీపీ పాలనలో కీలకమైన పథకాలన్ని నిర్వీర్యం
- నాడూ..నేడూ రైతుల గురించి ఆలోచించేది చంద్రబాబే
- రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



పలమనేరు నవంబర్ 25( మనసులో మాట) : వ్యవసాయానికి పూర్వ వైభవం తీసుకొచ్చి అన్నదాతల కళ్ళలో ఆనందం నింపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పలమనేరు శాసనసభ్యులు అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలోని శివాజీ గ్రామంలో జరిగిన రైతన్న కోసం- ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతన్నల ఇంటింటికి వెళ్లి అన్నదాత సుఖీభవ,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను అందించడంతో పాటు రైతుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ...అన్నదాతల కోసం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమం చేపట్టిందన్నారు. రైతన్నా మీకోసం పేరుతో ఈ నెల 29వ తేదీ వరకు రైతులకు వివిధ అంశాలపై అవగాహన పెంచే కార్యక్రమాలు జరగనున్నాయన్నారు.

వచ్చే ఐదేళ్లలో ఐదు విధానాలతో కార్యాచరణ రూపకల్పన జరిగిందనినీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు ధర కల్పన తదితర లక్ష్యాలతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందని వివరించారు. వైసీపీ పాలనలో బిందు తుంపర్ల సేద్యంతో పాటు, యాంత్రీకరణ, సూక్ష్మ పోషకాల పంపిణీ తదితర పథకాలన్నింటిని మూలన పెట్టేశారని గుర్తు చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాత సుఖీభవ పథకంలో రూ.6 వేలకు రూ.14 వేలు కలిపి రూ.20 వేలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు హంద్రీనివా ద్వారా అన్ని చెరువులకు నీటిని అందించిన ఘనత కూడా తమ ప్రభుత్వానికే దక్కుతుందని, కాబట్టి రైతులు ఏ ప్రభుత్వం మంచి చేసిందో గుర్తించి మద్దతుగా నిలవాల్సిన అవసరముందన్నారు. ఆనాడు ఇజ్రాయిల్ సేద్యన్ని పరిచయం చేసి ఆధునిక వ్యవసాయ పద్ధతులకు శ్రీకారం చుట్టింది... నేడు టెక్నాలజీని అనుసంధానం చేస్తూ కొత్త ఒరవడులు సృష్టిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఆయనకు తెలియజేశారు. ఇలా ఉండగా కార్యక్రమం ఆరంభం నుంచి చివరిదాకా రైతులు పెద్ద ఎత్తున ఆయనకు ఘనస్వాగతం తెలియజేసి అడుగడుగునా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న,సర్పంచ్ లలితమ్మ గిరి, తహసిల్దార్ హనుమంతు, ఎంపీడీవో బాలాజీ, ఏవో హేమలత, కూటమి నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, ఆనంద్, చలపతి,మురహరి రెడ్డి, శ్రీరాములు, పసుపులేటి దిలీప్, బాలరాజు, ఎం.నాగరాజు, నంద గోపాల్, జ్ఞానేంద్రలతో పాటు నాగిరెడ్డి, ముబారక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా ప్రతినిధులు అధికారులను

# సమన్వయం చేసుకోవాలి

### చవట గుంట సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి




**పెనుమూరు, నవంబర్25 (మనసులో మాట):** మండలంలోని ప్రజా ప్రతినిధులు అధికారులను సమన్వయం చేసుకొని అభివృద్ధి పనులు చేసుకోవాలని చవటగుంట సింగల్ విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. నాయకులను ప్రజా ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. మండలంలోని అన్ని పంచాయతీలలో ఉన్న గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసిమెలిసి ముందుకు నడవాలని సూచించారు. స్థానిక శాసనసభ సభ్యులు డాక్టర్ వి ఎం థామస్ నేతృత్వంలో వెదురు కుప్పం మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని హితవు పలికారు.

### డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న

# ఫ్లెక్సీలను తొలగించాలి

### ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు కేసగాళ్ల వెంకటేష్ డిమాండ్



**ధర్మవరం నవంబర్ 25 (మనసులో మాట)** పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద స్థాపించబడిన భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం చుట్టూ అనధికారికంగా ఏర్పాటు చేసిన రాజకీయ నేతల ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ రక్షణ పోరాట సమితి (ఏపీ ఎమ్మార్పీఎస్) నాయకులు మున్సిపల్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు కేసగాళ్ల వెంకటేష్ నేతృత్వంలో ప్రతినిధి బృందం ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసింది. అంబేద్కర్ విగ్రహం ప్రజల గౌరవానికి ప్రతీకగా ఉండే స్థలం కాగా, రాజకీయ ప్రకటనల కోసం దాన్ని వినియోగించడాన్ని వారు ఖండించారు. పట్టణంలోని ప్రజలు, సంఘాలు కూడా ఫ్లెక్సీల తొలగింపుకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రజా ప్రదేశాల్లో అనధికారిక ఫ్లెక్సీల వ్యవస్థ పూర్తిగా నిలువరించాలని వారు మున్సిపల్ అధికారులను కోరారు. ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు కేసగాళ్ల వెంకటేష్ మాట్లాడుతూ. "డాక్టర్ అంబేద్కర్ గారి విగ్రహం చుట్టూ రాజకీయ ప్రచారం చేయడం అనేది విగ్రహానికి, ప్రజాస్వామ్యానికి అవమానం. వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

# రజనీ ట్రస్ట్, రక్త బంధం ట్రస్ట్ సేవలు అమూల్యమైనవి

### ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ తిపేంద్ర నాయక్



ధర్మవరం నవంబర్ 25 (మనసులో మాట) పట్టణంలోని రజిని ట్రస్ట్, రక్త బంధం ట్రస్ట్ సేవలు అమూల్యమైనవని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ తీపేంద్ర నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త బంధం రజనీ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి తిపేంద్ర నాయక్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్నదానం బ్రహ్మస్వరూపమని, అన్ని దానాల కన్నా అన్నదాన ముఖ్యమని వారు తెలిపారు. దాదాపు 70 మందికి సూపర్డెంట్ చేతుల మీదుగా అల్పాహారాన్ని పంపిణీ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అనంతరం వారికి కృతజ్ఞతలను తెలిపారు. తదుపరి రజనీ ట్రస్ట్, రక్త బంధం ట్రస్ట్ అధ్యక్షులు కన్నా వెంకటేష్ మాట్లాడుతూ నేటి ఈ సేవా కార్యక్రమం పట్టణానికి చెందిన చిప్పల చంద్రశేఖర్, అనిత, కుమారుడు చిప్పల యశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలుపుతూ, దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కేతా లోకేష్, చంద్రశేఖర్ రెడ్డి, దాదు తదితరులు పాల్గొన్నారు.




# అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం

**పలమనేరు నవంబర్ 25( మనసులో మాట ):** అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం గురించి సమావేశంలో మాట్లాడుతున్న.... బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్. భాస్కర్.పలమనేరు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీ వావిలి ఆదినారాయణ ఆదేశాలు మేరకు గంగవరం మండల వెలుగు ఆఫీస్ ముందు అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం జరుపుకున్నారు. ఈ సమావేశంలో పలమనేరు అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ.... మంగళవారం యొక్క ప్రత్యేకత ఏమిటంటే మహిళలపై జరుగుతున్న అత్యాచారం, లైంగిక వేధింపులు, అడుగడుగున అవమానాలు అన్నింటిని అరికడదాం అని తెలిపారు. మనకు బ్రతుకు నిచ్చే స్త్రీని గౌరవంగా బ్రతకనిద్దాం అని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కృష్ణమూర్తి, సీనియర్ అడ్వకేట్ ఆరిపుల్లఖాన్, వెలుగు గ్రూపు క్యాంప్ క్లర్కులు బాబు, ఆశ, వెలుగు గ్రూపు సభ్యులు,కోర్టు సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ పోస్టర్ల ఆవిష్కరణ



**పెనుమూరు, నవంబర్ 25 ( మనసులో మాట):** రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ పోస్టర్లను, కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎంపీడీవో నీలకంఠేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందుతాయని తెలిపారు. అలాగే భూ కాలుష్యం, వాతావరణ కాలుష్యం తగ్గి మానవ జాతి మునగడ సులభతరం అవుతుందని తెలియజేశారు. మండలంలో 12 క్లస్టర్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబం తమ అవసరాల కోసం పెరటి తోటలు, ఆకు కూరలు, కూరగాయల సాగు ,మునగ సాగు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెనుమూరు , తిరిగిరెడ్డి పల్లె, కామ చిన్నయ్యపల్లి, సాతంభాకం, పులికల్లు, కలికిరి పంచాయతీలో జరుగుతున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతుల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రావణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిని సుహార్లత, ఏ. పి. ఎం చిరంజీవి,ఏ.పీ.ఓ .గుణశేఖర్ ,మండల ప్రకృతి వ్యవసాయ అధికారులు హనుమంతు, లక్ష్మి, హరికృష్ణారెడ్డి సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

# పాఠశాల సోషల్ ఆడిట్ పై ఒక్కరోజు శిక్షణ



పలమనేరు నవంబర్ 25 ( మనసులో మాట) :పాఠశాల పనితీరుపై మూల్యాంకనం (పాఠశాల సోషల్ ఆడిట్) ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాల విద్యా వ్యవస్థ యొక్క పనితీరును అంచనా వేయడానికి మంగళవారం అనగా 25 -11- 2025 వ తేది పలమనేరు మండలంలో స్థానిక గవర్నమెంట్ పాఠశాలలో సోషల్ ఆడిట్ పై ఎఫ్ ఎల్ ఎన్( ఫౌండేషనల్ లెటర్స్ అండ్ న్యూమరసి )పై పలమనేరు డివిజన్స్ కు సంబంధించిన 10 మండలాలు పలమనేరు ,బంగారు పాల్యం, గంగవరం, పంజాని పుంగనూరు, సోమల ,సదుం బైరెడ్డిపల్లి, వీకోట, చౌడేపల్లి మండలాలలో పనిచేస్తున్న సి ఆర్ ఎం టి లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం పలమనేరు మండల విద్యాశాఖ అధికారులు లీలరాణి,బాలసుందరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ..... సోషల్ ఆడిట్ అనేది పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు అములు నిధుల వినియోగం ,మెటీరియల్స్ వంటిపై విషయాలపై తనిఖీ పాఠశాలకు వెళ్ళినప్పుడు నిశితంగా పరిశీలించి యాప్ లో నమోదు చేయాలని సూచించడం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ.... విద్యార్థుల హాజరు, ట్రాకింగ్, టీచరు హాజరు లీవ్ మేనేజ్మెంట్ స్కూల్ వనరుల సమాచారం ఫండ్ కేటాయింపులపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమిటీ సభ్యుల యాపులో నమోదు చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గవర్నమెంట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షంషీర్, జిల్లా అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైలైజర్ మధు, జి సి డి ఓ ఇంద్రాణి,డివిజనల్ రిసోర్స్ పర్సన్ లుగా జడ్పీహెచ్ఎస్ ఉర్దూ పలమనేరు సి ఆర్ సి, సి ఆర్ ఎం టి,అనిల్ కుమార్, జడ్పీహెచ్ఎస్ నెల్లిపట్ల సి ఆర్ సి, సి ఆర్ ఎం టి వెంకటరమణ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

బుధవారం 26 నవంబర్ 2025


# ఐబొమ్మ రవిని మేమే పట్టుకున్నాం

- ఆయన భార్య ఎలాంటి సమాచరం ఇవ్వలేదు
- సీసీఎస్ అడిషినల్ సీపీ శ్రీనివాస్



**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

ఐబొమ్మ రవి కేసుకు సంబంధించి అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. కీలక సమాచారాన్ని రాబడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఐబొమ్మ రవి కేసుపై సీసీఎస్ అడిషినల్ సీపీ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవికి బెట్టింగ్, గేమింగ్ యాప్స్ ద్వారా డబ్బులు వచ్చేవని అన్నారు. యాడ్ బుల్ కంపెనీ రవికి చెందినదేనని తెలిపారు. యాడ్స్ ద్వారా వచ్చిన డబ్బుల్ని యాడ్ బుల్ కంపెనీకి మళ్లించారని చెప్పారు. ఇమంది రవి ఇప్పటి వరకు 20 కోట్ల రూపాయల వరకు సంపాదించాడని వెల్లడించారు. . 'ఐబొమ్మ, బప్పం సైట్లను రవి స్నేహితుడు నిఖిల్ డిజైన్ చేశాడు. ఐబొమ్మ రవి ఓవర్ కాన్ఫిడెన్స్‌తోనే దొరికాడు. రవి భార్య మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మరికొన్ని పైరసీ వెబ్‌సైట్లు నడుస్తూనే ఉన్నాయి. మూవీరూల్జ్, తమిళ్‌ఎంవీ లాంటి పైరసీ సైట్లు ఇంకా నడుస్తున్నాయి. పైరసీ సైట్ల నిర్వాహకులను పట్టుకునే పనిలోనే ఉన్నాం. ఐబొమ్మ పాపులర్ అయ్యాక.. దానిపేరును చాలామంది వాడుకుంటున్నారు. సినిమా సమీక్షలకు కూడా ఐబొమ్మ సైట్ పేరు వాడుకుంటున్నారు. భవిష్యత్‌లో వెబ్-3 టెక్నాలజీ కూడా రాబోతుంది. వెబ్-3 టెక్నాలజీతో పైరసీ చేస్తే పట్టుకోవడం కష్టం' అని అన్నారు. కాగా, నిన్న(సోమవారం) సాయంత్రంతో ఐబొమ్మ రవి కస్టడీ ముగిసింది. చివరి రోజు కస్టడీలో అధికారులు 3 గంటల పాటు అతడ్ని విచారించారు. విచారణలో రవి నుంచి పోలీసులు ఎలాంటి సమాధానాలు రాబట్టలేకపోయారని తెలుస్తోంది.



- మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడి

## మోగిన పంచాయతీ

# ఎన్నికల నగారా

**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకునోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరా లు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నేటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తాం అని ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. గురువారం నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు పోలింగ్ జరగనుండగా.. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు.



# జీహెచ్ఎంసీ పరిధి మరింత విస్తరణ

- ఓఆర్ఆర్ లోపలా, బయట మున్సిపాలిటీల విలీనం
- మొత్తం 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసిలో..
- కొత్తగా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు నిర్ణయం
- ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో రామగుండంలో పవర్ ప్లాంట్
- పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడులకు ఆహ్వానం
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్నా 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను డిప్యూటి సిఎం,మంత్రి శ్రీధర్‌బాబు,జూపల్లి కృష్ణారావులు మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో హైదరాబాద్ పరిధి మరింత పెరుగుతందన్నారు. అంతేకాకుండా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రులు తెలిపారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలుకు కేబినేట్ ఆమోదించింది. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానించాలన ఇనిర్ణయించారు. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి ఇవ్వనున్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం కోసం కేబినేట్ ఆమోదించింది. పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌ను 3 సర్కిళ్లుగా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించారు. భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీ ఫైబర్ కేబుళ్ల ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపునకు ఆమోదించారు. అలాగే ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు 40 ఎకరాలు కేటాయింపు ఇవ్వనున్నారు. జూబ్లీహిల్స్‌తోపాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు.

# విలువైన భూములు హాంఫట్

- 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ
- రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతున్న సిఎం రేవంత్
- రాత్రికి రాత్రే బిలియనీర్ కావాలన్న లక్ష్యంతో పావులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

సిఎం రేవంత్ రెడ్డి అవినీతి కోసమే హిల్ట్ పాలసీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ అని అన్నారు. విద్యార్థులు, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతూ రేవంత్ సర్కార్ హిల్ట్ పాలసీకి నిర్ణయం తీసుకుందని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములను ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతినిస్తోందని తెలిపారు. దాదాపు 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నారని కేటీఆర్ తెలిపారు. దాదాపు ఆ భూములన్నింటికీ రేవంత్ సోదరులు, అనుయాయులు ఒప్పందాలు చేసుకున్నారని పేర్కొన్నారు. లక్షన్నర గజం విలువ చేసే భూమికి 10 వేలు కడితే చాలని పాలసీ తెచ్చారని తెలిపారు. పారిశ్రామిక వాడల భూములను అమ్మి 4-5లక్షల కోట్ల కుంభకోణం చేయాలని చూస్తున్నాడని అన్నారు. అంబానీ, అదానీలను ఒకే దెబ్బకు క్రాస్ చేయాలని రేవంత్ రెడ్డి స్కెచ్ వేశారని తెలిపారు. రేవంత్ రెడ్డి మనుమలు, మునిమలు కూర్చొని తిన్నా కూడా అరిగిపోని ఆస్తిని వెనకేసుకోవాలని ఈ స్కామ్‌కు తెరతీశాడని చెప్పారు. 50-60 ఏళ్లుగా హైదరాబాద్‌లో 21 పారిశ్రామికవాడలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రజల భూములు తీసుకుని ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చిందని చెప్పారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ పరిశ్రమలు మధ్యలోకి వచ్చాయని తెలిపారు. మేం అధికారంలో ఉన్నప్పుడు కూడా పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీలు ఏర్పాటు చేయాలని సూచించామని చెప్పారు. అందుకే మేం గ్రిడ్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. గతంలో 50 శాతం ఐటీ ఆఫీసులకు, 50 శాతం ఇతర అవసరాల కోసం ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టినంకనే అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ధారాదత్తం చేస్తోందని అన్నారు. భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హిల్ట్ పాలసీపై కౌన్సిల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నిలదీశారని కేటీఆర్ గుర్తుచేశారు.తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు కోర్టు ఆపింది.. మిగతావి ఎవరు ఆపారని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లింలందరికీ న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. ముస్లింలకు 4 వేల కోట్లు బ్జడెట్‌లో పెడతామని.. పెట్టలేదని మండిపడ్డారు.తెలంగాణపై బీఆర్ఎస్‌కు ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని కేటీఆర్ అన్నారు. తెచ్చిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అరాచకాలపై విద్యార్థి రణభేరీ మోగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నాయకులు సమాజం నుంచి వస్తారు.. నాయకుల చుట్టూ తిరిగితే నాయకులు కారని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

## ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలు ప్రారంభం



**హైదరాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివిధ విభాగాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు. మంగళవారం నుంచి నవంబర్ 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్లో వరుసగా ఈ సమిక్ష సమావేశాలు జరుగుతాయి. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్బాబు వరుసగా జరిగే అన్ని సమావేశాల్లో పాల్గొంటారు. ఆయా విభాగాల సమీక్షలో సంబంధిత మంత్రులు పాల్గొంటారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహణ ఏర్పాట్లు తదితర అంశాలపై మంగళవారం సీఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఆయా విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. బుధవారం మౌలిక వసతులు, అభివృద్ధిపై సీఎంతో పాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. సంబంధిత విభాగాల అధికారులు పాల్గొంటారు. నవంబర్ 28న విద్య, యువజన సంక్షేమంపై సాయంత్రం 4 గంటలకు సీఎంతో పాటు మంత్రులు వాకాటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సంబంధిత విభాగాల అధికారులతో సమిక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు టూరిజం, టెంపుల్ టూరిజంపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ సంబంధిత అధికారులతో సమిక్షిస్తారు. నవంబర్ 29 వ్యవసాయం, సంక్షేమ విభాగాలతో సాయంత్రం 4 గంటలకు: మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వాకాటి శ్రీహరి సంబంధిత అధికారులుతో సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్ పాల్గొంటారు. నవంబర్ 30న ఆరోగ్య రంగంపై సీఎంతో పాటు మంత్రి దామోదర్ రాజనరసింహ సంబంధిత అధికారులు పాల్గొంటారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# చెక్‌డ్యామ్ కూల్చివేత ఇసుక మాఫియా పనే



● గుంపుల వద్ద డ్యామ్‌ను పరిశీలించిన హరీష్ రావు

**పెద్దపల్లి, నవంబర్ 25(మనసులో మాట):**

కెసిఆర్ హయాంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డిమల్లన్న సాగర్ ఎవరు కట్టారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల వద్ద పేల్చిన చెక్ డ్యామ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను కూల్చివేసింది కాంగ్రెస్ నేతలేన న్నారు. కాంగ్రెస్ హయంలో చెరువులు, చెక్ డ్యామ్‌ల పేల్చివేత నిత్య చర్యగా మారిందన్నారు. గతంలో పెద్దపల్లి భోజన్న పేట వద్ద హుస్సేన్ మియావాగుపై కూడా చెక్ డ్యామ్ పేల్చివేశారని ఆరోపించారు. గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూడా కులలేదని.. పేల్చారని ఇక్కడి రైతులే చెప్తున్నారన్నారు. ఇసుక మాఫియానే కూల్చివేసిందని, కాంగ్రెస్ పాలనలో వేల కొద్ది లారీల్లో ఇసుక తరలిస్తున్నారన్నారు. రాత్రికి రాత్రి చెక్ డ్యామ్ పేల్చేశారని.. భోజన్నపేటలో హుస్సేన్ మియావాగుపై చెక్ డ్యామ్ పేల్చివేస్తుంటే రైతులే పట్టుకున్నారన్నారు. అప్పుడు రైతులే కేసులు పెట్టారని.. పోలీసులు ఇప్పటివరకు దోషులను పట్టుకోలేదని ఆరోపించారు. తాజాగా మరో చెక్ డ్యామ్ పేల్చారని.. అప్పుడే పోలీసులు దోషులను శిక్షిస్తే.. ఈ రోజు గుంపుల చెక్ డ్యామ్‌కు ఈ పరిస్థితి రాకుండేదన్నారు. ఈరోజు వరకు పోలీసులు వాళ్లను పట్టుకోలేదని.. మూడు రోజులు అయిన ఇక్కడి పేల్చివేత దోషులను పోలీసులు పట్టుకోలేకపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లను కాపాడుతుందని.. ఆనాడు గుండాలను అరెస్ట్ చేస్తే ఈ రోజు ఇక్కడి చెక్ డ్యామ్ పేల్చకపోయేవాళ్లని.. హైదరాబాద్‌లో ఇండ్లు, ఇక్కడ చెరువులు, చెక్ డ్యామ్‌లు కూలగొడుతున్నారన్నారు. కేసీఆర్ కట్టుడు.. కాంగ్రెసోళ్ల కూలగొట్టుడని.. మానేరు నది మీద చెక్ డ్యామ్‌లు కట్టి సస్యశ్యామలం చేశామన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కట్టిందని.. చర్యలు తీసుకోవాలంటే పొంగులేటిపై తీసుకోవాలన్నారు. రాఘవ కంపెనీని బ్లాక్ చేయాలన్నారు. పొంగులేటి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 6 లక్షల ఎకరాలు నీళ్లు ఇస్తామని ఉత్తమ్ కుమార్ చెప్పిండని.. ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు. కమిషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారని.. రెండేళ్లు అయిన కాళేశ్వరం రిపేర్ చేయడం లేదని.. కాళేశ్వరం కింద ఉన్న కాలువలు తవ్వడం లేదన్నారు. కాలువలు తవ్వితే కేసీఆర్‌కు పేరు వస్తుందని రైతును గోసపెడుతున్నారన్నారు. కాళేశ్వరం కూలిందని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకుపోతున్న నీళ్లు కాళేశ్వరంవికావా అంటూ ప్రశ్నించారు. ఈ బ్లాస్టింగ్స్ చూస్తే కాళేశ్వరం కూడా పేల్చారని అనుమానం వస్తుందన్నారు. పెద్దపల్లిలో జిలిటెన్ స్టిక్స్‌తో కాంగ్రెస్ నాయకులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని.. ఇసుక మాఫియాతో రూ.24 కోట్లు రికవరీ చేయాలన్నారు. ఎండాకాలం లోపే చెక్ డ్యామ్ నిర్మించాలని.. ఇసుక మాఫియాలో మంత్రుల వాటా ఉందని.. రాత్రిపూట పెద్దశబ్దం వినపడిందని అని మత్స్యకారులు చెప్తున్నారన్నారు. లక్ష క్యూసెక్కుల వరద వస్తే కూడా ఈ చెక్ డ్యామ్ చెక్కు చెదరలేదన్నారు. కూలితే రాత్రే ఎందుకు కూలింది? కూలలేదు కూల్చారు అంటూ ఆరోపించారు. కాంగ్రెస్‌కు రైతుల కన్నా ఇసుక మాఫియా ముఖ్యమన్నారు. టెర్రరిస్టులు కూడా ఇలాంటి పనులు చేయరని, టెర్రరిస్టులకు మించిపోయారని.. ఇసుక మాఫియా దోషులను శిక్షించకుంటే రాష్ట్రంలో మరిన్ని చెక్ డ్యామ్‌లు పేలుస్తారన్నారు. కేసీఆర్‌పై కోపంతో రాష్ట్ర రైతుల నోట్లో మట్టికొడుతున్నారని.. కాళేశ్వరం కూలిందని రేవంత్‌రెడ్డి అంటున్నాడని.. కాళేశ్వరంలో భాగంగా కట్టిన మల్లన్న సాగర్ నుంచి రూ.8వేల కోట్లతో హైదరాబాద్‌కు పైపులైన్ వేస్తా అంటున్నాడన్న హరీశ్‌రావు.. మల్లన్న సాగర్ ఎవరు కట్టారు నీ తాత కట్టిండా..? కేసీఆర్ కాదా? అంటూ ప్రశ్నించారు. ఇసుక మాఫియాపై ఉన్నత స్థాయి విచారణ జరగాల్సిందేనన్నారు. నిందితులు ఎవరైనా వారి నుంచి రూ.24కోట్లు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.



## చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

**లోతైన దర్యాప్తు జరిపించాలన్న బండి ● సీఎం రేవంత్ రెడ్డికి లేఖ**

**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

తెలంగాణలో చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై అనుమానాలున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. వీటిపై విచారణ జరగాలని అన్నారు. ఎందుకు ఇలా జరుగుతున్నా యో తేల్చాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు నదిపై కట్టిన చెక్ డ్యామ్‌లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనుగుల- గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూలడమే ఇందుకు నిదర్శనమన్నారు. బిఆర్ఎస్ పాలనతో కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యతను గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో చెక్ డ్యామ్‌లను నిర్మించిన కాంట్రాక్టర్లు కాంగ్రెస్ వాళ్లేనని అన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నిధుల చెల్లింపులపై మీరు ఆదేశించిన విజిలెన్స్ విచారణ ఏమైందని బండి ప్రశ్నించారు. ఆనాడు బాధ్యులపై చర్యలు తీసుకొని దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే తనుగుల-గుంపుల చెక్ డ్యామ్ కూలేది కాదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ డ్రామాలాడుతున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే చెక్ డ్యామ్‌ల నిర్మాణాల్లో అక్రమాలు, కూలిపోవడంపై విచారణ జరిపించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి ఆస్తులు జప్తు చేసి ఆ సొమ్ముతోనే మళ్లీ డ్యామ్‌లు నిర్మించాలని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.

## జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం గందరగోళం

**వందేమాతరం గీతానికి అవమానం ● సీట్లలోంచి లేవని ఎంఐఎం సభ్యులు**

**బీజేపీ అభ్యంతరంతో తీవ్ర వాదోపవాదాలు**



**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం తీవ్ర గందర గోళం నెలకొంది. వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాల ఆలాపన సమయంలో మజ్లిస్ కార్పొరేటర్లు కుర్చీలో నుంచి లేవలేదు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వందేమాతర గీతం పాడితేనే దేశంలో ఉండాలంటూ వారు బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో బీజేపీకి వ్యతిరేకంగా ఎంఐఎం కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ఇరు పార్టీల కార్పొరేటర్లు.. ఈ సమావేశంలో టేబుల్స్ ఎక్కి హంగామా చేశారు. దాంతో మార్షల్స్ రంగంలోకి దిగి.. వారిని బయటకు తీసుకు వెళ్లే ప్రయత్నం చేశారు. సభ సజావుగా జరిగేలా సహకరించాలంటూ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఈ రెండు పార్టీల కార్పొరేటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు జరుగుతున్న జీహెచ్‌ఎంసీ పాలక మండలి తుది సమావేశం. మరో రెండున్నర నెలల్లో ప్రస్తుత పాలక వర్గం గడువు ముగియనుంది. ఈ సమావేశంలో 95 ప్రశ్నలు, 45 అజెండ అంశాలపై చర్చించాల్సి ఉంది. ఈ తుది సమావేశానికి జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లతోపాటు సిటీలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి ముందై రభస మొదలైంది. పారిశ్రామిక వాడల భూములను అమ్మేలా రూపొందించిన పాలసీని రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లారు. రూ.5 లక్షల కోట్ల విలువైన 9,292 ఎకరాల భూములను అమ్మేస్తూ.. రేవంత్ రెడ్డి సర్కార్ దేశంలోనే అతిపెద్ద స్కామ్‌కు తెరలేపిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇండస్ట్రియల్ కారిడార్ భూములను అమ్ముతున్న పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## కౌన్సిలర్ల తీరుపై మేయర్ ఆగ్రహం

**ఏకవచన సంబోధన ఏంటంటూ ప్రశ్న**

**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల తీరుపై నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొంత మంది కార్పొరేటర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడిన ఆమె.. కొంతమంది కార్పొరేటర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారం టూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్‌లో హుందాగా, గౌరవంగా మాట్లాడాలని సభ్యులకు సూచించారు. మేయర్‌ను 'నువ్వు, నిన్ను, నీతో' అంటూ ఏకవచనంతో సంభోదించడం ఏంటని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశంలో కొత్త వారికి మాట్లాడే అవకాశం ఇద్దామన్న మేయర్.. మాట్లాడే అవకాశం ఎవరికి ఇవ్వాలో మేయర్‌గా తానే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఎవరికి మైక్ ఇవ్వాలో నాకు ఎవరూ చెప్పాల్సిన అవసం లేదన్నారు. ప్రజలు ఈ సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తున్నారని.. సభలో అందరూ హుందాగా మెలుగుతూ ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు. ఎవరికి వారు స్వతహాగా మాట్లాడుతారని.. పక్క వాళ్లు డైరెక్షన్లు ఇవ్వడం మానుకోవాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లతో మేయర్ ఎంత గౌరవంగా వ్యవహరిస్తారో.. కార్పొరేటర్లు కూడా అంతే గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. కౌన్సిల్ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీఆర్ఎస్ కార్పొరేటర్ సామల హేమ మధ్య మాటల యుద్ధం నడిచింది. మేయర్ కుర్చీకి గౌరవాన్ని ఎలా ఆశిస్తున్నారో.. కార్పొరేటర్లకు కూడా అదే విధమైన గౌరవం ఇవ్వాలని హేమ విజ్ఞప్తి చేశారు.

# నూతన 'లేబర్ కోడ్'లను అమలు చేయవద్దు

**టీయూడబ్ల్యూజే రౌండ్ టేబుల్ తీర్మానం**



**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

కేంద్ర ప్రభుత్వం అమలులోనికి తీసుకొచ్చిన నూతన 'లేబర్ కోడ్'లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేయాలని టీయూడబ్ల్యూజే-ఐజేయూ, కేంద్ర కార్మిక సం ఘాలు తీర్మానించాయి. నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ధర్నాలతో పా టు ఇందిరాపార్క్ వద్ద 'కార్మికుల తలపెట్టనున్న నిరసన గళం' కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు కే విరాహత్ అలీ అధ్యక్షతన బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మన్, ఐజెయు జాతీయ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులతో పాటు వైట్ కాలర్ ఉద్యోగులు పరోక్షంగా తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కనీసం కార్మిక సంఘాల నేతలతో చర్చించకుండానే నూతన లేబర్ కోడ్‌లను అమలు చేయడం ఆశ్చర్యకరమన్నారు. నూతన లేబర్ కోడ్‌లపై ప్రధాన మీడియాలు చర్చలు పెట్టకపోవడం విడ్డూరమని, కార్పొరేట్ శక్తుల చేతుల్లో మీడియా బంది అయిపోయిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో న్యాయవ్యవస్థ కూడా రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోవడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు. జాతీయ మీడియాతో పాటు తెలుగు ప్రధాన పత్రికలు సైతం ప్రస్తుతం అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులు, ఉద్యోగులకు కలిగే లాభ, నష్టాలను వివరించకపోవడం బాధకరమని చెప్పారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఏండి. యూసుఫ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాడే యూనియన్లను లేకుండా చేయడమే లక్ష్యంగా మోడి ప్రభుత్వం నూతన లేబర్ చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. టియుసిఐ నాయకుడు సూర్యం మాట్లాడుతూ నూతన లేబర్ చట్టాల ద్వారా గిగ్ వర్కర్లకు మేలు జరుగుతుందని ప్రధాని మోడి చెప్పడం హాస్యాస్పదమన్నారు. నూతన లేబర్ కోడ్‌లతో కలిగే నష్టాలను ప్రతి కార్మికుని వద్దకు చేరే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ మాట్లాడుతూ సత్యమేవ జయతే-శ్రమయేవ జయతే అని మోడి ప్రభుత్వం కార్మికుల శ్రమను దోపిడీ చేస్తుందన్నారు. ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లు శుష్క ప్రియులు- శూన్య హస్తాలు అనే సామెత చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, ఐజేయు జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్యదర్శి కే.రాములు, రాష్ట్ర కార్యదర్శి వి.యాదగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, కార్యదర్శి బి. వెంకటేశం, ఐ.ఎఫ్.టి.యు నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని కోణాల్లో దర్యాప్తు

**హైదరాబాద్, నవంబర్ 25(మనసులో మాట):**

శాలిబండ గోమతి ఎలక్ట్రానిక్స్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై మొగల్‌పురా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మణికంఠను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కారు డ్రైవర్ సంచలన విషయాలు బయటపెట్టారు. రాత్రి 10:30 గంటలకు ఏదో పెద్ద బ్లాస్ట్ అయినట్టుగా ఒక్కసారిగా శబ్దం వినిపించిందని.. శబ్దం రావడంతో తన కారు పల్టీ కొట్టిందని తెలిపారు. కారుకు సంబంధించిన గ్లాస్ మొత్తం కూడా ధ్వంసం అయిపోయిందన్నారు. కార్‌లో తాను ఒక్కడినే ఉన్నానని.. కార్ ముందు అద్దాలను పగలగొట్టి బయటపడినట్లు తెలిపారు. కారు నుంచి బయటకు వచ్చిన వెంటనే పూర్తిగా కాలిపోయిందని చెప్పారు. కారులో సీఎన్జీ సిలిండర్ ఏమి పేలలేదని స్పష్టం చేశారు. ఎవరెస్ట్ ఫ్లీట్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీ పేరుతో ఉబర్ డ్రైవర్‌గా ఉబర్ నడుపుతున్నట్లు వెల్లడించారు. చార్మినార్ దగ్గర ప్యాసింజర్స్‌ను డ్రాప్ చేశానని.. మరో పికప్ శాలిబండ సైడ్ పడిందని అందుకే అక్కడికి బయలుదేరినట్లు తెలిపారు. ఈ క్రమంలో గోమతి ఎలక్ట్రానిక్ షాప్ దగ్గర భారీ శబ్దం వచ్చిందని.. ఎలా వచ్చిందో తెలియదని.. వెంటనే తన కారు కూడా బోల్తా పడిందని డ్రైవర్ మణికంఠ పేర్కొన్నారు. అయితే.. ప్రమాదంపై డ్రైవర్ కొత్త అంశం చెప్పడంతో షాప్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం చోటు చేసుకుందా అనే కోణంలో ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అసలు ప్రమాదంపై ఎలాంటి క్లారిటీ లేని పరిస్థితి. దీంతో అన్ని కోణాల్లోనూ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

## ఆది శ్రీనివాస్‌కు తప్పిన ప్రమాదం

**వేములవాడ, నవంబర్ 25 (మనసులో మాట):**

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. కాంగ్రెస్ నేతలు, అధికారులతో కలిసి వేములవాడ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంగళవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ గరీమ అగర్వాల్, పార్టీ నేతలతో కలిసి గృహ సముదాయం వద్ద బేస్‌మెంట్‌పై నిల్చొని పరిశీలిస్తున్న క్రమంలో ఒక్కసారిగా అది కుంగింది. ఈ ఘటనతో అధికారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన కాంగ్రెస్ నేతలు.. ఆది శ్రీనివాస్ కింద పడిపోకుండా పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది.





## అంజన్‌కుమార్‌కు సన్మానం

**కరీంనగర్, నవంబర్ 25 (మనసులో మాట):**

కరీంనగర్ నగర పాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వైద్యుల అంజన్‌కుమార్‌ను రాష్ట్ర మున్నూరు కాపు యువజన నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు తమ అభినందనలు తెలియజేశారు. నగర కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా అంజన్‌కుమార్ చేసిన సేవలు ప్రశంసనీయమని యువజన నాయకులు పేర్కొన్నారు. పార్టీ విస్తరణకు, సామాజిక వర్గాల అభివృద్ధికి మరింత కృషి చేయాలనే, ప్రజలకు చేరువయ్యే నాయకత్వం అవసరమైన ఈ సమయంలో అంజన్‌కుమార్ నియామకం పార్టీకి శుభపరిణామమని వారు తెలిపారు. అనంతరం అంజన్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా అంకితభావంతో పనిచేస్తానని, నగరంలోని ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాటం చేస్తానని తెలిపారు.



# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు

## పోలీసులు అడ్డుపెట్టి బిసి ఉద్యమాన్ని ఆపలేరు

### బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూప్నర్ రమేష్

**ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 25 (మనసులో మాట):**

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూప్నర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిష్టిబొమ్మ దగ్ధం కార్య క్రమం చేపట్టారు దిష్టిబొమ్మను దగ్ధం చేయకుండా పోలీసులు అడ్డుకోవడంతో బీసీ సంఘం నాయకులకు పోలీసులు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్ రూపున రమేష్ మాట్లాడుతూ అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపనట్టు పోలీసులు అడ్డుపెట్టి న్యాయపరమైన బీసీ ప్రజా ఉద్యమాన్ని ఆపలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 సర్పంచ్ స్థానాలు ఉంటే అందులో కేవలం 20 స్థానాలను బీసీలకు కేటాయించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చీకటి ఒప్పంద కారణంగానే బీసీ రిజర్వేషన్ కేటాయించకుండా ఎన్నికలకు వెళ్తున్నారన్నారనీ మండిపడ్డారు. బీసీ 42% బీసీ రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే బీసీల దృష్టిలో రేవంత్ రెడ్డి చరిత్ర హీనుడిగా మిగులుతాడన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, జిల్లా నాయకులు మారుతి పటేల్ , లహు కుమార్ తదితరులు పాల్గొన్నారు

# విషాద ఛాయలు..

## పెళ్లి పీటల ముందు రెండు నిండు జీవితాలు బలి..

### కాబోయే భర్త మరణాన్ని తట్టుకోలేక యువతి ఆత్మహత్య



**వాంకిడి, నవంబర్ 25 (మనసులో మాట):**

మండలంలోని బంబారా గ్రామానికి చెందిన నీలం శ్రీలత (31) అనే యువతి తన కాబోయే భర్త మరణాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నీలం శ్రీలతకు దాదాపు ఐదు సంవత్సరాల క్రితం జగిత్యాలకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. అయితే, భార్యా భర్తల మధ్య మనస్పర్ధల కారణంగా వివాహం జరిగిన నెల రోజులకే వారికి విడాకులు అయ్యాయి. అప్పటి నుండి శ్రీలత తన తల్లి ఇంట్లో బంబారాలోనే నివసిస్తోంది. ఈ నేపథ్యంలో తేదీ 2025 ఆగస్టు 15 న జైపూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన షేర్ల రంజిత్ అనే వ్యక్తితో శ్రీలతకు వివాహం నిశ్చయమైంది. దురదృష్టవశాత్తు, కాబోయే భర్త అయిన షేర్ల రంజిత్ ఈ నేల 23 న విషం త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తన కాబోయే భర్త ఆకస్మిక మరణాన్ని తలుచుకుని శ్రీలత తీవ్ర మనస్తాపానికి లోనైంది. తన జీవితంపై విరక్తి చెంది ఈ నేల 24 న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసుకుని, తన ఇంటి దులానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి నీలం సత్తమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన బంబారా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# అరబ్‌ల సమస్యల పరిష్కారం కోసం కృషి

## ఏడబ్ల్యూఏ జిల్లా కన్వీనర్ ఫైసల్ బీన్ సులేమాన్

**సిర్పూర్ టీ, నవంబర్ 25 (మనసులో మాట):**

జిల్లాలోని అరబ్ ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అరబ్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఫైసల్ బీన్ సులేమాన్ అన్నారు. మంగళవారం అరబ్ వెల్ఫేర్ అసోసియేషన్ సిర్పూర్ టీ మండల కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అరబ్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఫైసల్ బీన్ సులేమాన్ మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతానికి , జిల్లాలోని అరబ్ ల సంక్షేమం కోరకు సంఘం కృషి చేస్తుందన్నారు.

### సిర్పూర్ టీ మండల కమిటీ ఎన్నిక

అరబ్ వెల్ఫేర్ అసోసియేషన్ సిర్పూర్ టీ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఏ డబ్ల్యూ ఏ జిల్లా కన్వీనర్ ఫైసల్ బీన్ సులేమాన్ తెలిపారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఆస్లాం బీన్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడిగా షేక్ అహ్మద్ బిన్ మొహమ్మద్ , ప్రధాన కార్యదర్శిగా షేక్ సైద్ బీన్ అబ్దుల్లా,కార్యవర్గ సభ్యులుగా సలీమ్ బీన్ సాల్మిన్ , వాసీం బిన్ సాలే, ఉస్మాన్ బీన్ సలం, అవాద్ బిన్ మొహ్మద్, అవాద్ బీన్ ముబారక్, సలే బిన్ సులేమాన్, షేక్ అంకుశ్, ముఖ్య సలహాదారులు షేక్ సాలె బీన్ సైద్, షేక్ సమద్ బీన్ అబు సాలె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంధర్భంగా అరబ్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఫైసల్ బీన్ సులేమాన్ నూతన ఎన్నికైన కార్యవర్గాన్ని శాలువాతో ఘనంగా సన్మానించారు.



# పోరాటం, పట్టుదల, విజయ పథం

## యుపీఎస్‌సి అభ్యర్థితో అనుభవాలు పంచుకున్న యువ ఐపీఎస్ చిత్తరంజన్

**ఆసిఫాబాద్ :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల కోసం సిద్ధమవుతున్న ఔత్సాహిక అభ్యర్థి ముండే సాయి కుమార్‌తో యువ ఐపీఎస్ అధికారి ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన తన వ్యక్తిగత అనుభవాలను, సివిల్ సర్వీసెస్ పరీక్షలలో విజయం సాధించడానికి అనుసరించిన ముఖ్య పాఠాలను సాయి కుమార్‌కు పంచుకున్నారు. సివిల్ సర్వీసెస్ ప్రయాణంలో అభ్యర్థులు తరచూ ఎదుర్కొనే తీవ్రమైన ఒత్తిడి, అనిశ్చితి, మరియు వైఫల్యాలను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో ఐపీఎస్ అధికారి చిత్తరంజన్ స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఎక్కువ గంటలు చదవడం కన్నా, క్రమశిక్షణతో కూడిన దినచర్యను పాటించడం అత్యంత ముఖ్యమని చెప్పారు.



ప్రతి రోజూ చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని చేరుకోవడం యు పీ ఎస్ సి సిద్ధతకు బలమైన పునాది అవుతుందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా, అభ్యర్థులు మాక్ టెస్టులను తప్పనిసరిగా, నియమితంగా రాయాలని ఆయన సూచించారు. మాక్ టెస్టులు మాత్రమే అభ్యర్థి ప్రస్తుత స్థాయి ఏంటో, ఏ అంశాలపై మరింత దృష్టి పెట్టాలో స్పష్టంగా అర్థమయ్యేలా చేస్తాయని వివరించారు. వైఫల్యాన్ని చూసి భయపడకుండా, దానిని ఒక లోపాన్ని సరిచేసుకునే అవకాశంగా ఉపయోగించుకోవాలని ముండే సాయి కుమార్‌కి ఐపీఎస్ అధికారి చెప్పిన మాటలు గొప్ప ప్రేరణను కలిగించాయి. చిత్తరంజన్ దాస్ మార్గదర్శనం స్థానిక యువతలో యు పీ ఎస్ సి పట్ల కొత్త ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని తెలుస్తోంది.

# ప్రతి మహిళకు చీర అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్ :** జిల్లాలోని ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్స్‌లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి దత్త రావు అధ్యక్షతన నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మహిళకు చీర అందించే లక్ష్యంతో లక్ష 11 వేల చీరలు పంపిణీకి సిద్ధమైనట్లు తెలిపారు. రెండు రోజుల్లో చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మహి ఓళా శక్తి ఎంతో గొప్పదని కొనియాడారు. రాష్ట్ర ప్రభు ఓత్వం మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక ఎదుగుదల కోసం పెట్రోల్ బంకు, ఆర్టీసీ బస్సు, క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటు, వడ్డీ లేని రుణాలు లాంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో నిర్ణయాధికారం ఉండే మహిళలను సిద్ధం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు మూడు విడతల్లో ఆరు కోట్ల రూపాయలు వడ్డీ లేని బ్యాంకు రుణాలు మంజూరు చేయగా, మూడో విడతలో రెండు కోట్ల 70 లక్షల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సమైక్య భవనం కూడా నిర్మాణ దశలో ఉందని త్వరలోనే పూర్తయి అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాల తిరిగి చెల్లింపులు ఆదర్శంగా నిలుస్తున్నారని జిల్లాలో 98 శాతం తిరిగి చెల్లింపు జరగడమే దీనికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ చీరలు వృధా చేయకుండా ఉపయోగించుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలలో 16 నుండి 18 సంవత్సరాల కిశోర బాలికలను కూడా చేర్చుకోవడానికి తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గదన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ తో పాటు, రెండు కోట్ల 70 లక్షల విలువ గల వడ్డీ లేని రుణాలు చెక్కు, 26 కోట్ల 53 లక్షల బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, గౌరవాధ్యక్షురాలు శ్రీదేవి, డిపిఎం యాదగిరి ఇతర సిబ్బంది లబ్ధిదారులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

# విజ్ఞాన శాస్త్రం నిరంతర ప్రక్రియ

## జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే






**ఆసిఫాబాద్ :** విజ్ఞాన శాస్త్రం అనేది ఒక నిరంతర ప్రక్రియని ఒక రోజుతో పూర్తిగా తెలుసుకోలేమని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో జిల్లా ఇన్చార్జి డిఈఓ దీపక్ తివారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్ స్పైర్ మనాక్ కు చైర్మన్ హోదాలో ముఖ్యఅతిథిగా హాజరై సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం అనేది ఒక రోజుతో అర్థమయ్యేది కాదన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో అపజయం అనేది వస్తుందని దాని నుండి పాఠాలు నేర్చుకుని చేసిన తప్పులను సరిదిద్దుకొని విజయం వైపు నడవాలన్నారు. సైన్స్ దీనిని ఎప్పుడు నేర్పుతుందని చరిత్రలో ఎంతోమంది శాస్త్రజ్ఞులు తమ ప్రయోగాలలో ఒకేసారి విజయవంతమైన వారు ఎవరు లేరన్నారు. న్యూటన్, ఐన్ స్టీన్ లాంటివాళ్ళు కూడా అనేక ప్రయత్నాలు చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు చిన్ననాటి నుండి ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని అప్పుడే ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణ ఎంతో బాగుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రత్యేకంగా బస్సు ద్వారా ఏర్పాటు చేసిన సైన్స్ లాబరేటరీ సందర్శించి కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. శోధించి సాధించాలి తప్ప సులభంగా వచ్చేదానిని ఎంచుకోవద్దన్నారు. అంతకుముందు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల యొక్క హావభావాలు క్రమశిక్షణ చూడడానికి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రస్థాయిలో విద్యార్థులను నైపుణ్యవంతంగా చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించడంతోపాటు విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుని పలు ప్రశ్నలను సంధించారు. తెలియని ప్రశ్నలను తెలుసుకోవాలని వారికి సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శన సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జిల్లావ్యాప్తంగా 300 ప్రదర్శనలు రెండు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ దేవాజి, సమన్వయకర్త మధుకర్, సభ్యులు శ్రీదేవి, రాందాస్, ప్రభాకర్, ఆర్గనైజింగ్ సభ్యులు హనుమంతు, సుభాష్ పాల్గొన్నారు.

# 28న పీడీఎస్‌యూ జిల్లా మహాభలు విజయవంతం చేయండి

## పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి



**ఆసిఫాబాద్ :** ఈ నేల 28న పీడీఎస్‌యూ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా మహాసభల నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020ని తీసుకొచ్చి విద్యా సంస్థలలో మూఢనమ్మకాలు కాషాయీకరణను చొప్పించే ప్రయత్నాలను తీవ్రతరం చేస్తోందని విమర్శించారు. సిలబస్‌లో అశాస్త్రీయంగా జ్యోతిష్యాలయాన్ని చెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే కాకుండా, సోషల్ సబ్జెక్టులో భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, డా. బీ.ఆర్. అంబేద్కర్లకు సంబంధించిన అనేక చరిత్రలను తీసివేసిందని, ప్రజాస్వామ్యం, లౌకికత్వం అనే పదాలను కూడా తొలగిస్తున్న దారుణమైన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పీడీఎస్‌యూ చేస్తున్న విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాలు, ఉద్యమాలను ఈ మహాసభలో సమీక్షించి, భవిష్యత్తులో విద్యారంగ సమస్యల కోసం ఎలాంటి ఉద్యమాలు నిర్వహించాలనే అంశంపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు. 28న మహాసభలను జిల్లా కేంద్రంలోని మాలి సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ జిల్లా మహాసభలకు విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు దుర్గం కోటేశ్వర్, అయ్యుబ్ ఖాన్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు షేక్ సమీర్, మండల ఉపాధ్యక్షులు మల్లేష్, నాయకులు ఆకాష్, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆత్రం సుగుణకు ఘన స్వాగతం

**జైనూర్:** కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ జిల్లాకు చేరుకున్న సందర్భంగా జంగామ్ హనుమాన్ ఘాట్ వద్ద జైనూర్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఆమె రాకను పురస్కరించుకుని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు డప్పుల వాయిద్యాలు, పుష్పవర్షం, పూలహారాలతో సంప్రదాయబద్ధంగా సన్మానించారు. ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపించేలా కార్యకర్తల ఉత్సాహం నెలకొంది. హనుమాన్ ఘాట్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అక్కడి నుంచి పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది బైకులతో సాగిన ఈ ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సుగుణ ఓపెన్ టాప్ జీపులో చేతులు జోడిస్తూ కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటాం

**ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్**




**ఆసిఫాబాద్:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారు, ముఖ్యంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేస్తామని ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్తో పాటు నంబర్ ప్లేట్ లేని వాహనం నడిపితే సహించేది లేదన్నారు. ఇందులో భాగంగానే సోమవారం రాత్రి రిజిస్ట్రేషన్ చేయని ఒక బైక్‌ను పట్టుకొని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 2024లో అబ్కారీ శాఖ వేలంపాటలో కొనుగోలు చేసిన ఆ బైక్‌కు రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామని, వాహనదారులు నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

## రెజ్లింగ్‌లో కాంస్య పతకం



**తాండూర్:** రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ అచలాపూర్ విద్యార్థిని చౌల్ల హర్షిత కాంస్య పతకం సాధించినట్లు వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు ఏ సాంబమూర్తి తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని ఖాదర్ పైల్వాన్ క్లబ్‌లో నిర్వహిం చిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 9వ తరగతి చదువుతున్నహర్షిత కాంస్య పతకం సాధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, ఏఏపీసీ చైర్మన్ చిలుకమ్మ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు విద్యార్థిని అభినందించారు.

## పంచాయతీ రిజర్వేషన్‌లో బీసీలకు అన్యాయం



**నేరడిగొండ:** పంచాయతీ రిజర్వేషన్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ రిజర్వేషన్ లలో నేరడిగొండ మండలంలోని 32 స్థానాలకు గాను ఎస్టీలకు 18, ఎస్సీలకు 2, జనరల్ 12 స్థానాలు కేటాయించగా, బీసీలకు ఒక్క స్థానాన్ని కూడా కేటాయించకపోవడంతో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇటీవల కేటాయించిన పంచాయతీ రిజర్వేషన్ లలో 23 శాతం రిజర్వేషన్ ప్రకారం గతంలో బీసీలకు మండలంలో 8 స్థానాలు కేటాయించగా, ప్రస్తుతం 42 శాతం అని చెప్పి ఒక్క స్థానం కూడా కేటాయించకుండా ఉన్న స్థానాలను తీసివేశారని, ఇది బీసీల పట్ల జరుగుతున్నఅన్యాయానికి నిదర్శనమన్నారు. ల్లా కలెక్టర్ వెంటనే ఈ రిజర్వేషన్ల అంశాన్ని పునఃపరిశీలించి సవరించాలని, తమకు చట్టబద్ధంగా కేటాయించాల్సిన 23 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు సాబ్లే సంతోష్ సింగ్, దిలీప్, మనోజ్, భావ్ సింగ్, ప్రశాంత్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆడే వసంతరావు, కుమారి పాక్స్ చైర్మన్ మందుల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజ అభివృద్ధి

**• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ కుమా ర్ దీపక్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వడ్డీ లేని రుణాల పంపిణీ పథకంలో భాగంగా మంగళవారం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలను అందిస్తుందని తెలిపారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళను కుటుంబ పెద్దగా గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా కోళ్ళ పెంపకం, డైరీ ఫార్మ్, క్యాంటీన్ ఇతర వ్యాపార రంగాల్లో ప్రోత్సహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేయడం జరిగిందని, మందమర్రి మండలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుతో పాటు మిగితా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దండేపల్లి మండలంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం మంచిర్యాల నియోజకవర్గంలోని 1,618 స్వయం సహాయక సంఘాలకు రూ.1 కోటి 43 లక్షల 61 వేల వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి




**ఆదిలాబాద్:** ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీలేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుందని తెలిపారు. జిల్లాకు ముఖ్యమంత్రికి రూ.3.03 కోట్ల విలువైన రుణాలు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రుణాలను వ్యక్తిగత అవసరాల కోసం కాకుండా వ్యాపారం కోసం వినియోగించాలని సూచించారు. సంఘాలను దత్తత తీసుకుని వ్యాపారాభివృద్ధికి మార్గనిర్దేశం చేస్తానని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ కుటుంబం, సమాజం అభివృద్ధి మహిళ ఆర్థిక స్థితిపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు బస్సులు, పెట్రోల్ పంపులు వంటి రంగాల్లో కూడా యజమానులు అయ్యే అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. మహిళలు ప్రతి రంగంలో రాణించాలని, పొదుపు అలవాటు పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్ రాజేశ్వర్ సూచించారు. అనంతరం ఎమ్మెల్యే, అధికారులు కలిసి వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళా సంఘాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, ఎంపీడీఓ వంశీ కృష్ణ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన**

**తాండూర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ స్టాండరైజేషన్ కమిటీ సభ్యులు బి జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఆఫీస్ గోలేటిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లు దేశంలోని కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయని తెలిపారు. కనీస వేతనాలు, సామాజిక భద్రత, యూనియన్ హక్కులు, సురక్షితమైన పని స్థలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. పని గంటలను పెంచే ప్రయత్నం, శాశ్వత ఉద్యోగులను కాంట్రాక్ట్ చేసే విధానాలు, కార్మికులకు ఉన్న న్యాయపరమైన రక్షణాలను తగ్గించే చర్యలు దేశ వ్యాప్తంగా ఆందోళనకు దారితీస్తున్నాయని తెలిపారు. కార్మిక వర్గాల హక్కులను కాపాడేందుకు ఈ అన్యాయపూరిత లేబర్ కోడ్లను వెనక్కి తీసుకునే వరకు అన్ని కార్మిక సంఘాల ఐక్యంగా పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయ పిట్ కార్యదర్శి భీమేష్, టీబీజీకేస్ కార్యదర్శి గడ్డం రవీందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరా మహిళా శక్తి

**బెజ్జూర్:** దివ్య జ్యోతి మండల సమైక్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసినట్లు అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూమండలంలోని 20 గ్రామ సంఘాల్లో 459 స్వయం సహాయక సంఘాల్లోని 6578 మంది సభ్యులకు మహిళా శక్తి చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో లేని సభ్యులను సంఘాల్లో చేర్పించి ప్రభుత్వ ఆదేశాల మేరకు చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సంఘాల్లో లేని సభ్యులందరూ స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆర్థిక స్వాలంభనతో పాటు ఆర్థిక అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను పొందాలని కోరారు. పేదరిక నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన ఇందిరా క్రాంతి పథకం ద్వారా మండలంలోని అనేక మంది మహిళల పేదరికం నిర్మూలన చేయడంలో మహిళా స్వయం సహాయక సంఘాలు చేయూతనిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య ఏపీఎం మోహన్‌దాస్, సీసీలు రంగయ్య, భద్రయ్య, సుశీల, కల్పన, గ్రామ సంఘ సామాజిక కార్యకర్తలు, మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను రక్షించండి



**తాండూర్:** ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను రక్షించాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు కోరారు. తాండూర్ తహశీల్దార్ యు జ్యోత్స్నకు మంగళవారం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కిష్టంపేట ఏజెన్సీ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నం.23లో గల ప్రభుత్వ భూమిని ఆదివారం కొంతమంది గిరిజనేతరులు ఈ భూమి తమదని ట్రాక్టర్ పెట్టి చదును చేసి కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారని తెలిపారు. ఏజెన్సీ ఏరియాలోనీ ఈ ప్రాంతం 5వ షెడ్యూల్ భూభాగ ప్రాంతంలో ఉందని, ఈ ప్రాంతంలో ఉన్న అడవి, నీరు, భూభాగం అంతా కూడా ఏజెన్సీలకు చెందుతుందన్నారు. ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన తహశీల్దార్ రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ను పిలిపించి సంబంధిత భూమి దగ్గరికి వెళ్లి విచారణ చేపట్టాలని సూచించారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో తుడుందెబ్బ మంచిర్యాల జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు మండిగ రవీందర్, తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి యపాల సమ్మయ్య, కిష్టంపేట మాజీ సర్పంచ్ గడ్డం మణికుమార్, ఆదివాసీ కొలవార్ సేవా సంఘం మండల అధ్యక్షులు గోలిశెట్టి బాపు, తదితరులు ఉన్నారు.

# ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- 'ఫ్యూచర్ సిటీ' రియల్ ఎస్టేట్ వ్యాపారమే
- రేవంత్ రెడ్డి అత్యధిక అప్పులతో రాష్ట్రాన్ని దివాలా తీస్తున్నారు
- బీజేపీ నేత డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్
- అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్



**ఖమ్మం, నవంబర్ 25 (మనసులో మాట):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బిజెపి జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తరహాలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రాష్ట్రాన్ని అత్యధిక అప్పులతో దివాలా తీస్తున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అసలైన అభివృద్ధి కార్యక్రమాలు లేకపోవడంతో, కాంగ్రెస్ ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏదో పెద్ద అభివృద్ధి కార్యక్రమంగా హడావిడి చేస్తోందని, ఇది ప్రజలను మోసం చేయడమేనని దుయ్యబట్టారు. 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం: ప్రభుత్వం 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని, ఇది భారీ స్కెచ్ అని సుధాకర్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పరిధిలోని వేలాది ఎకరాల పారిశ్రామిక భూములను పబ్లిక్ యుటిలిటీ పేరుతో 'ల్యాండ్ యూజ్' మార్చడానికి తెరవెనుక భారీ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన మండిపడ్డారు. ఈ అంశంపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల మోసం, పటేల్ అవమానం: స్థానిక సంస్థల ఎన్నికలకు 42% రిజర్వేషన్లు ప్రకటిస్తూనే, మరోపక్క కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని విమర్శించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని స్మరించుకుంటూ నిర్వహించిన 'యూనిటీ ఆఫ్ మార్చ్' వంటి జాతీయ కార్యక్రమానికి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖం చాటేయడం దేశభక్తులను, పటేల్‌ను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర పథకాలకు స్టిక్కర్లు: రైల్వే స్టేషన్ల సుందరీకరణ (అమృత్ భారత్), ఎరువుల సబ్సిడీ వంటివి కేంద్ర నిధులతో జరుగుతుంటే, స్థానిక కాంగ్రెస్ నేతలు తామే చేసినట్లు స్టిక్కర్లు వేసుకొని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు సంబంధించిన రుణమాఫీ పూర్తి కాలేదని, అకాల వర్షాలకు నష్టపోయిన వారికి పరిహారం అందలేదని, ధాన్యం కొనుగోళ్లలో బోనస్ ఊసే లేదని ఆరోపించారు. సత్తుపల్లిలో న్యాయం కోసం పోరాడుతున్న గిరిజన, బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు బనాయించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు ఇవి రమేష్, నంబూరి రామలింగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వర్లు, మందడపు సుబ్బారావు, నాయుడు రాఘవరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవి రాథోడ్, సుదర్శన్ మిశ్రా, నున్న రవికుమార్, సైదేశ్వరరావు, వీరెల్లి రాజేష్, నెల్లూరి బెనర్జీ, సురేందర్ రెడ్డి, వీరంరాజు, రజినీ రెడ్డి, దొడ్డా అరుణ, మనీ, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోసమే ఇందిరమ్మ చీరలు



- తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దిగజార్చారు
- ఇందిరమ్మకు, తెలంగాణకు ఏంటి సంబంధం?
- పెండింగ్ బిల్లులు చెల్లించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?
- బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- తొలి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత సురేష్

**జగిత్యాల, నవంబర్ 25 (మనసులో మాట):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని హుటాహుటిన 'ఇందిరమ్మ చీరల' పంపిణీ చేస్తోందని, ఇది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దిగజార్చే చర్య అని జిల్లా పరిషత్ తొలి అధ్యక్షురాలు శ్రీమతి దావ వసంత సురేష్ గారు తీవ్ర స్థాయిలో విమర్శించారు. నేడు జగిత్యాల జిల్లా భారస పార్టీ కార్యాలయంలో నాయకులు, మాజీ సర్పంచ్‌లతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోసమే చీరెల రాజకీయం: కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే, రేపో మాపో ఎన్నికల నియమావళి వస్తుందనే భయంతో నిన్న అర్ధరాత్రి వరకు గ్రామాలలో చీరలు పంపిణీ చేసిందని వసంత సురేష్ ఆరోపించారు. భారస హయాంలో పండుగ కానుకగా పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు గౌరవంగా బతుకమ్మ చీరలు అందించిన ఘనత కేసీఆర్ గారికి దక్కుతుందని అన్నారు. ఆ బతుకమ్మ చీరలకు పేరు మార్చి 'ఇందిరమ్మ చీరలు' అని పంచుతున్నారు. అసలు ఇందిరమ్మకు తెలంగాణకు ఏంటి సంబంధం అని ఆమె ప్రశ్నించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవాలనే మూర▯పు ఆలోచనతో మహిళా సంఘాల మహిళలను పావులుగా వాడుకుంటూ కేవలం వారికే చీరలు పంపిణీ చేయడం సరికాదని అన్నారు. పెండింగ్ బిల్లులపై ప్రశ్న: గతంలో పని చేసినటువంటి పెండింగ్ బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చినా కూడా ఇప్పటివరకు వాటిని చెల్లించలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ముఖ్యమంత్రి గారు సర్పంచ్ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సొంత అభివృద్ధి కోసం పార్టీ మారిన శాసనసభ్యుల వెంట ఉన్న సర్పంచులకు మాత్రమే బిల్లులు చెల్లించి, భారస పార్టీతో ఉన్న సర్పంచులకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని నిలదీశారు. బీసీల పట్ల కపట ప్రేమ: బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, వారిది కేవలం కపట ప్రేమ మాత్రమేనని వసంత సురేష్ దుయ్యబట్టారు. కామారెడ్డి ప్రకటనలో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక హామీని మర్చిపోయారని అన్నారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రికి సత్సంబంధాలు ఉన్నప్పుడు బీసీల రిజర్వేషన్ల కోసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. షెడ్యూల్ తొమ్మిదిలో బీసీ రిజర్వేషన్లను చేర్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసినట్టేనని ఆమె హెచ్చరించారు. విద్య, ఉద్యోగం, కాంట్రాక్టుల పరంగా బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉన్న సమస్య అని అన్నారు. మోసపూరిత పాలన: కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకోవడానికే చూస్తోందని, కమిషన్లతో జేబులు నింపుకుంటున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామన్న మహాలక్ష్మి పథకం (పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ఆడబిడ్డకు రెండు వేల ఐదు వందలు) వంటివి ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. దాదాపు తొమ్మిది నెలల నుంచి ఇందిరమ్మ ఇళ్లకు ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్నా.. కేవలం పదకొండు ఇండ్లు మాత్రమే గృహప్రవేశాలు పూర్తి చేసుకున్నాయని విమర్శించారు. కేసీఆర్ గారు రెండు వేల రూపాయల పింఛను ఇస్తే, రేవంత్ రెడ్డి గారు నాలుగు వేలు చేస్తా అని మోసం చేశారని వృద్ధులు గమనించాలని కోరారు. కేసీఆర్ శ్రీరామరక్ష: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ గారు సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ నిర్వహించి, కేంద్రం మెడలు వంచి ఢిల్లీలో బిల్లు పాస్ చేయించి తెలంగాణ సాధించారని, అదే స్ఫూర్తిని తీసుకొని ఈ బీసీ బిల్లును శ్రీకారం చుట్టాలని వసంత సురేష్ అన్నారు. ఎప్పటికైనా తెలంగాణ ప్రజలకు కేసీఆర్ గారే శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు తప్పకుండా గ్రహించి, తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు అని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్, అర్బన్ మండల అధ్యక్షులు ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్, మాజీ సర్పంచ్‌లు ఎల్లా రాజన్న, జక్కుల తిరుపతి, బుర్ర ప్రవీణ్ గౌడ్, గంగారం, నాడెం శంకర్, భారస నాయకులు కమలాకర్ రావు, గంగారెడ్డి, హరీష్, బాలే చందు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

**నిజామాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

గ్రామ పంచాయతీ సర్పంచ్ మరియు వార్డు స్థానాలకు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా పూర్తి సన్నద్ధతతో ఉండాలని జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీవోసీ) నుండి మంగళవారం జిల్లా పంచాయతీ అధికారులు (డీఎల్‌పీఓలు), ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. నిబంధనల అమలులో జాగరూకత: కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమ, నిబంధనలపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. అధికారులు, సిబ్బంది పరస్పరం సమన్వయంతో పని చేస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాఫీగా జరిగేలా కృషి చేయాలని కోరారు. ప్రవర్తనా నియమావళి పక్కాగా: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) పక్కాగా అమలయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లు, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై ఉన్న రాతలను



తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను నిరోధించడానికి నిఘా బృందాలను నియమించి, మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల పంపిణీపై పకడ్బందీగా నిఘా ఉంచాలని తెలిపారు. లాజిస్టిక్స్, వసతులపై దృష్టి: ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించాలని, ఇబ్బందులుంటే వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తయిందని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరి చూసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్ వంటి కనీస వసతులు లేనిచోట యుద్ధప్రాతిపదికన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ, ఫిర్యాదుల పరిష్కారం: సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల జాబితాను మరోమారు పరిశీలించుకోవాలని, తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, నోడల్ అధికారులు, డీఎల్‌పీఓలు పాల్గొన్నారు. ఇదిలాఉండగా, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడానికి ముందు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం బోధన్ ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నద్ధతను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎంపీడీవో కిషోర్ కుమార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ప్రజావాణికి కన్నా దున్నపోతుకు ఇవ్వడమే మేలు

**భాజపా పాలకమండలి సభ్యులు**



**హైదరాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికై ఏర్పాటు చేసిన 'ప్రజావాణి' కార్యక్రమం పూర్తిగా విఫలమైందని, ప్రజల గోడు వినని అధికార యంత్రాంగంపై భాజపా పాలకమండలి సభ్యులు (కార్పొరేటర్లు) తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తమ వినూత్న నిరసనలో భాగంగా, ముఖ్యమంత్రికి, నగర పాలక సంస్థ అధ్యక్షురాలికి (మేయర్) వినతిపత్రం ఇవ్వడం కన్నా, దున్నపోతుకు ఇవ్వడమే మేలని వారు వ్యాఖ్యానించారు. సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే: నగర పాలక సంస్థ పరిధిలో అనేక సమస్యల పైన ప్రజలు ఇబ్బంది పడుతున్నా, ప్రజావాణి కార్యక్రమాలలో వందలాది విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తున్నా, సమస్యలు మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్టుగా ఉన్నాయని భాజపా సభ్యులు ఆరోపించారు. వందలాది విజ్ఞాపన పత్రాలు తీసుకున్న అధికారులు కనీసం పది పనులు కూడా చేయలేనటువంటి దుస్థితి నెలకొందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రికి, నగర పాలక సంస్థ అధ్యక్షురాలికి లేక అధికారులకి వినతిపత్రం ఇవ్వడం కన్నా, తమ దున్నపోతు గారికి ఇవ్వడం మేలని వారు బహిరంగంగా ప్రకటించారు. తద్వారా, ప్రజల సమస్యలపై స్పందించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగ వైఖరిని వారు నిరసించారు.

## షాహ్ అలీబండ అగ్నిప్రమాద స్థల పరిశీలన

**మృతులకు, నష్టపోయిన వ్యాపారులకు పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థన**

**గాయపడిన యజమాని, ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కమిషన్ అధ్యక్షులు**



**హైదరాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ అధ్యక్షులు శ్రీ జి. నిరంజన్ గారు ఈ రోజు హైదరాబాద్ షాహ్ అలీబండ ప్రాంతంలోని గోమతి ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణానికి మరియు పరిసర దుకాణాలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. భయంకరమైన పేలుడు శబ్దాలు: ఈ సంఘటన రాత్రి పది గంటల ఇరవై ఎనిమిది నిముషాల సమయంలో జరిగినట్లు, మూడు సార్లు భయంకరమైన పేలుడు శబ్దాలు వినిపించాయని సమీప నివాసితులు తెలిపారు. పక్కనున్న సిద్ధ వస్త్రాల దుకాణం పూర్తిగా దగ్ధమైందని, అలాగే ప్రమాద స్థలం పక్కనే ఉన్న మిఠాయి దుకాణం తలుపులకు కూడా పగుళ్లు వచ్చాయని వారు వివరించారు. ఈ ఘటనలో అక్కడ ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు మరియు ఒక కారు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిప్రమాదంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. ఆసుపత్రిలో పరామర్శ: గోమతి ఎలక్ట్రానిక్స్ యజమాని శ్రీ శివ గారిని అపోలో ఆసుపత్రి, కంచన్‌బాగ్ లోని రక్షణ పరిశోధన సంస్థ ఆవరణ ఆసుపత్రికి తరలించారు. మరొక ఇద్దరు ఉద్యోగులు గణేష్ మరియు కార్తిక్ లను ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కమిషన్ అధ్యక్షులు గారు ఈ రెండు ఆసుపత్రులను సందర్శించి, గాయపడిన వారిని పరామర్శించి, ప్రమాద నేపథ్యం గురించి ఆరా తీశారు. అపోలో ఆసుపత్రి వైద్యులు శివకు ఎనభై శాతం కంటే ఎక్కువ కాలిన గాయాలు ఉన్నాయని, అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, గణేష్ మరియు కార్తిక్ ఇద్దరికీ ఇరవై ఐదు శాతం కాలిన గాయాలు ఉన్నాయని, కోలుకునే అవకాశం ఎక్కువగా ఉందని వివరించారు. ప్రభుత్వానికి విన్నపం: ఈ అగ్ని ప్రమాదంలో నష్టం చెందిన పరిసర దుకాణదారులను ఆదుకోవడంతో పాటు, జరిగిన నష్టానికి తగిన పరిహారం ఇవ్వాలని, అలాగే పునరుద్ధరణకు సహాయం అందించాలని శ్రీ జి. నిరంజన్ గారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## పెండింగ్ ఫైల్స్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి

**విధుల్లో అలసత్వం వద్దు**

**వికారాబాద్ జిల్లా పోలీసు అధికారిణి స్నేహ మెహ్రా**

**వికారాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలోని (డీపీవో) వివిధ విభాగాలను జిల్లా పోలీసు అధికారిణి స్నేహ మెహ్రా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలోని పరిపాలనా విభాగం (అడ్మినిస్ట్రేషన్), జిల్లా నేరాల నమోదు విభాగం (డీసీఆర్బీ), ప్రత్యేక విభాగం (స్పెషల్ బ్రాంచ్), సైబర్ నేరాల విభాగం తదితర సెక్షన్లను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. అంకితభావంతో పనిచేయాలి: విధుల్లో ఉన్న సిబ్బందితో, అధికారులతో ముఖాముఖిగా మాట్లాడిన పోలీసు అధికారిణి, వారి పనితీరును, బాధ్యతలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ఆవరణను, పరిసరాలను బాధ్యతగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ ఫైల్స్ పై ఆగ్రహం: ముఖ్యంగా వివిధ సెక్షన్ల పరిధిలో ఉన్న ఫైల్స్ ఏవీ పెండింగ్ లో ఉంచకూడదని, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు గానీ, శాఖాపరమైన సమస్యలు గానీ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. అనవసరమైన జాప్యం చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, ప్రతి ఫైల్ పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ పనులను వేగవంతం చేయాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా పోలీసు అధికారిణి స్నేహ మెహ్రా హెచ్చరించారు.

## జాతీయస్థాయిలో సంగారెడ్డి విద్యార్థుల సత్తా!

'స్మార్ట్ లైఫ్ సేవర్ స్టిక్'కు ప్రత్యేక బహుమతి

రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టుకు పేటెంట్ హక్కుల ప్రయత్నం

విద్యార్థులు అంకిత్, శాంసన్ లను అభినందించిన కలెక్టర్, అధికారులు



**సంగారెడ్డి, నవంబర్ 25 (మనసులో మాట):**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్), ఇస్నాపూర్ విద్యార్థులు జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి, జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భూపాల్‌లో నవంబర్ 18 నుండి 23 వరకు జరిగిన 52వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శిన లో పాల్గొని, ఉత్తమ ప్రదర్శనకు గాను ప్రత్యేక బహుమతిని గెలుచుకున్నారు. జిల్లా నుండి ఏకైక ప్రాజెక్టుగా ఎన్నికైన జడ్పీహెచ్ఎస్ ఇస్నాపూర్ విద్యార్థులు అంకిత్ కుమార్ మరియు శాంసన్ రూపొందించిన 'స్మార్ట్ లైఫ్ సేవర్ స్టిక్ ఫర్ ఫార్మర్స్' ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ప్రదర్శనకు ఎంపికైంది. ఈ ప్రాజెక్టును పరిశీలించిన నిర్వాహకులు.. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గుర్తించారు. దీంతో, ఈ ప్రాజెక్టుకు పేటెంట్ హక్కులు దక్కేలా అవసరమైన పత్రాలను సిద్ధం చేసి, సంబంధిత అధికారులకు అందించి కృషి చేస్తామని నిర్వాహకులు తెలియజేయడం విశేషం. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అంకిత్ కుమార్, శాంసన్ మరియు వారి గైడ్ టీచర్ భాస్కర్ దేశ్ గారిపై అభినందనల వెల్లువ కురిసింది. వీరిని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గారు, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ గారు, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వెంకటేశ్వర్లు గారు ప్రత్యేకంగా అభినందించారు.

## పరిగికి తీరని లోటు

ప్రముఖ వ్యాపారవేత్త 'క్యాంటీన్ మక్బూల్' మృతి

వ్యాపార రంగంలో సయ్యద్ మక్బూల్ సేవలు చిరస్మరణీయం

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



**పరిగి, నవంబర్ 25 (మనసులో మాట):**

పరిగి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆ ప్రాంతంలో 'క్యాంటీన్ మక్బూల్' గా సుపరిచితులైన సయ్యద్ మక్బూల్ అహ్మద్ (78) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన మరణ వార్త తెలియగానే పరిగి ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మంగళవారం జరిగిన అంత్యక్రియలలో వికారాబాద్ జిల్లా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మీర్ మహ్మూద్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సయ్యద్ మక్బూల్ అహ్మద్ భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. పరిగి ప్రాంతంలో వ్యాపార రంగంలో సయ్యద్ మక్బూల్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన అనేక మందికి మార్గదర్శకుడిగా నిలిచారని, ఆయన మృతి పరిగి ప్రాంతానికి తీరని లోటని అన్నారు. మక్బూల్ కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో ధైర్యం, ఓర్పు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మీర్ తాహేర్ అలీ, రవికుమార్, నయీం, మసరత్ తదితరులు పాల్గొని సయ్యద్ మక్బూల్ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

## మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. 7.38 కోట్ల వడ్డీ లేని రుణాలు

కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వయం సహాయక సంఘాలకు (ఎస్హెచ్‌జీలకు) సంబంధించిన వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయడం జరిగిందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని 9,232 స్వయం సహాయక సంఘాల మహిళలకు సంబంధించిన రూ. 7.38 కోట్ల వడ్డీ లేని రుణాల మొత్తాన్ని విడుదల చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ నిధులు జులై, 2025 వరకు బకాయి ఉన్నవి కాగా, ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా విడుదలైన ఈ మొత్తం నేడు స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాలలో జమ చేయబడింది. ఈ నిధుల పంపిణీ ద్వారా జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు, వారి సంక్షేమానికి ప్రభుత్వం మరింత తోడ్పాటు అందించిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

- సహకార సంఘాల పాలకవర్గాలు టార్గెట్ రీచ్ కావాలి
- ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వా



**కరీంనగర్, నవంబర్ 25 (మనసులో మాట):**

ఆయిల్ ఫామ్ తోటల సాగుతో అత్యధిక లాభాలు గడించవచ్చని ఒకసారి పంట సాగు చేస్తే 30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే పేర్కొన్నారు. ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు పాలకవర్గాలు కార్యదర్శులకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి జిల్లాలో 3000 ఎకరాల్లో రైతులు ఆయిల్ ఫామ్ తోటల సాగు చేపట్టేలా కృషి చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయిల్ ఫామ్ తోటల పెంపకం పై కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు పాలకవర్గాల సభ్యులు కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటల పెంపకంతో అత్యధిక లాభాలు గడించవచ్చని తెలిపారు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు పాలకవర్గ సభ్యులు కార్యదర్శులు పెద్ద సంఖ్యలో రైతులు ఆయిల్ ఫామ్ తోటల పెంపకం చేపట్టేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి సహకార సంఘం పరిధిలో ప్రభుత్వం విధించిన టార్గెట్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో ఆయిల్ ఫామ్ తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. నాలుగు నెలల లోపు జిల్లాలో 3,000 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ తోటల సాగు ప్రారంభమయ్యేలా చూడాలని అందరూ సమిష్టిగా టార్గెట్ రీచ్ కావాలని కోరారు. వన్ టైం ఇన్వెస్ట్మెంట్ పంట ఆయిల్ ఫామ్ తోటల పెంపకం అని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ తోటల పెంపకం వల్ల లాభాలు సాగు.. అంతర పంటల సాగు తదితర వివరాలపై ఉద్యానవనం శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఒక్కసారి పంటను సాగు చేస్తే 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తూనే ఉంటుందని అధిక లాభాలు గడించవచ్చని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యానవనాధికారి కమలాకర్ రెడ్డి వివిధ ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు పాలకవర్గ సభ్యులు కార్యదర్శులు వ్యవసాయ ఉద్యానవన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వారసత్వ సంపదను కాపాడాలి

- ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి
- ముగిసిన ప్రపంచ వారసత్వ వారోత్సవాలు
- 'తెలంగాణ చరిత్ర, వారసత్వం'పై డా. శివనాగి రెడ్డి ప్రజెంటేషన్
- క్విజ్, వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



**హైదరాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

తెలంగాణ వారసత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వారసత్వ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. వారసత్వ శాఖ సంచాలకులు ప్రొఫెసర్ అర్జునరావు కుతాడి గారి పర్యవేక్షణలో నవంబర్ 19 నుండి నవంబర్ 25, 2025 వరకు తెలంగాణ స్టేట్ మ్యూజియంలోని శ్రీ భగవాన్ మహావీర్ ఆడిటోరియంలో ఈ వారోత్సవాలు జరిగాయి. వారోత్సవాల చివరి రోజున, ప్రముఖ చరిత్రకారులు డాక్టర్ ఈ. శివనాగి రెడ్డి గారు 'మైల్‌స్టోన్స్ ఇన్ తెలంగాణ హిస్టరీ అండ్ హెరిటేజ్' (తెలంగాణ చరిత్ర, వారసత్వంలోని మైలురాళ్లు) అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం, వారసత్వ శాఖ సంచాలకులు ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి గారు మాట్లాడుతూ.. వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం ప్రభుత్వాలదే కాదని, ప్రజలందరిపై ఉందని ఉద్ఘాటించారు. ఈ అమూల్యమైన సంపదను భావితరాల వారికి అందించే బాధ్యత ప్రస్తుత విద్యార్థిని, విద్యార్థులపై ఎక్కువగా ఉందని తెలియజేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు: ఈ వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ స్టేట్ మ్యూజియంలో విద్యార్థిని, విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్, పెయింటింగ్ కాంపిటీషన్‌లతో పాటు వారసత్వ శాఖ సిబ్బందికి క్రీడా పోటీలను కూడా నిర్వహించారు. వివిధ పోటీల్లో పాల్గొన్న మరియు విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు సంచాలకులు ప్రొఫెసర్ అర్జునరావు కుతాడి గారి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ పి నాగరాజు, డాక్టర్ డి రాములు నాయక్ గారు, ఎన్ నర్సింగ్ గారు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ గారు, ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ కో కన్వీనర్ శ్రీమతి అనురాధ రెడ్డి గారు, తెలంగాణ స్టేట్ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ మల్లు, శ్రీమతి గంగాదేవి, శ్రీమతి అమర జ్యోతి మరియు ఆక్స్ఫర్డ్ స్కూల్, ఉస్మానియా యూనివర్సిటీ (చరిత్ర, ఆర్కియాలజీ), శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ (చారిత్రక, పర్యాటక విభాగం), ప్రభుత్వ సిటీ కాలేజ్ విద్యార్థినీ, విద్యార్థులు, వారసత్వ శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నమోదు, పునరుద్ధరణ తప్పనిసరి

కార్మికుల సంక్షేమం కోసం 10 రోజుల అవగాహన సదస్సులు ప్రారంభం

పథకాలపై గోడపత్రాన్ని ఆవిష్కరించిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

నమోదు లేని కార్మికులకు కూడా ప్రత్యేక సహాయం



**వికారాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లాలోని నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ప్రత్యేక అవగాహన సదస్సుల కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తరపున నిర్వహించనున్న ఈ సామాజిక భద్రత పథకాలు' కార్యక్రమం గోడపత్రాన్ని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్ ఐడిఓసి కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ అందాలంటే రిజిస్ట్రేషన్ మరియు పునరుద్ధరణ (రీన్యువల్) తప్పనిసరి అని స్పష్టం చేశారు. భవన మరియు ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అందరూ విధిగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల కుటుంబాలకు భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పలు ప్రధాన సంక్షేమ పథకాలను అందిస్తోంది. వీటిలో ముఖ్యంగా.. ప్రమాద మరణం సంభవిస్తే కుటుంబానికి రూ. 10 లక్షలు, సహజ మరణ సహాయం కింద రూ. 2 లక్షలు లభిస్తాయి. వైకల్య సహాయం కింద కార్మికులకు రూ. 5 లక్షల వరకు అందుబాటులో ఉంది. వివాహం చేసుకునే కార్మికులకు పెళ్లి కానుకగా రూ. 30 వేలు, అదేవిధంగా ప్రసూతి సహాయం కింద రూ. 30 వేలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో చేరిన వారికి గరిష్టంగా మూడు నెలల వరకు నెలకు రూ. 4,500 చొప్పున హాస్పిటలైజేషన్ రిలీఫ్ లభిస్తుంది. ముఖ్యంగా, నమోదు చేసుకోని కార్మికులు మరణించినా కూడా వారి కుటుంబానికి ప్రత్యేక సహాయంగా రూ. 50,000/- అందుతాయి. ఈ పథకాలతో పాటు, ఆయుష్మాన్ భారత్ ద్వారా వార్షికంగా రూ. 5 లక్షల వరకు ఆరోగ్య సహాయం కూడా పొందవచ్చు. ఈ కార్యక్రమం ఆవిష్కరణలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, వికారాబాద్ జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ బి. వాల్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యాదయ్య, అంకిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 24, 2025 నుండి డిసెంబర్ 03, 2025 వరకు (10 రోజులు) జరగనున్న ఈ అవగాహన సదస్సుల్లో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు అందరూ పాల్గొని, పథకాల గురించి తెలుసుకుని, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్మిక శాఖ కోరింది. జిల్లా కార్మిక శాఖ, యూనియన్లు, కాంట్రాక్టర్లు మరియు స్థానిక సంస్థలు సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తామని తెలియజేశాయి.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పం

కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

బోధన్‌లో అట్టహాసంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ

**నిజామాబాద్, నవంబర్ 25 (మనసులో మాట):**

ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత సాధనలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో పనిచేస్తోందని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి గుర్తు చేశారు. మంగళవారం బోధన్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బోధన్ పట్టణంలోని రోటరీ భవన్ సమావేశ మందిరంలో వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయన లాంఛనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోధన్ సెగ్మెంట్ పరిధిలోని మూడు వేల ఏడు వందల మూడు సంఘాలకు వడ్డీ లేని రుణాల రూపేణా ప్రభుత్వం నాలుగు కోట్ల ఇరవై ఎనిమిది లక్షల రూపాయల నిధులను వారి ఖాతాలలో జమ చేసింది. నల్గొండ తరువాత రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాకే వడ్డీ లేని రుణాల కింద ఇరవై మూడు కోట్ల ఇరవై ఆరు లక్షల రూపాయల నిధులను ప్రభుత్వం కేటాయించిందని కలెక్టర్ తెలిపారు. సర్కారు తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రెండు వేల ముప్పై నాలుగు నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హులైన వారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కేవలం రుణాలు అందించడమే కాకుండా.. సౌర విద్యుత్ ప్లాంట్లు, చమురు విక్రయ కేంద్రాలు, రాష్ట్ర రవాణా సంస్థ అద్దె బస్సులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, పాఠశాల యూనిఫాంల కుట్టుపని, ఇందిరా మహిళా శక్తి భోజనశాలలు వంటి వాటిని సైతం సంఘాలకు మంజూరు చేస్తోందని గుర్తు చేశారు. కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కాకుండా, సామాజిక అభివృద్ధిని సైతం సాధించేలా మహిళలను చైతన్యవంతులను చేయాలని, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నుండి మహిళలను కాపాడాలని సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాలలో కొత్త సభ్యులను విరివిగా చేర్చుకుని, వారు కూడా ప్రభుత్వ తోడ్పాటును పొందేలా చొరవ చూపాలని అన్నారు. మహిళల పక్షాన ఇందిరమ్మ పథకాలు: మహిళల గౌరవాన్ని మరింతగా పెంచేలా ప్రభుత్వం పద్దెనిమిది సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నాణ్యతతో కూడుకుని ఆకర్షణీయంగా ఉన్న ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తుండడం పట్ల మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరిటే మంజూరు చేస్తూ, సంఘాల సభ్యులకు ఇంటి నిర్మాణం కోసం రుణాలను కూడా అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో అరవై ఏడు కోట్ల రూపాయల రుణాలు అందజేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు.

# ఓటమి లాంఛనమే..

## చేతులెత్తేసిన టీమిండియా

**రెండో ఇన్నింగ్స్ లోనూ అదే తడబాటు**

**27 పరుగులకే 2 వికెట్లు సమర్పణ**

**భారత్ ముందు 549 పరుగుల భారీ లక్ష్యం**

**260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్**

**522 పరుగుల వెనుకంజలో టీమిండియా**

**విజయానికి 8 వికెట్ల దూరంలో సౌతాఫ్రికా**



సౌతాఫ్రికాతో రెండో టెస్ట్‌లో టీమిండియా చేతులెత్తేసింది. 549 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6) దారుణంగా విఫలమయ్యారు. నైట్‌వాచ్‌మన్‌గా కుల్దీప్ యాదవ్(2 బ్యాటింగ్) బ్యాటింగ్‌కు రాగా.. సాయి సుదర్శన్(2 నాటౌట్)మరో వికెట్ పడకుండా ఆటను ముగించాడు. ప్రస్తుతం భారత్ 522 పరుగుల వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమిని తప్పించుకోవాలంటే ఆఖరి రోజైన బుధవారం మొత్తం బ్యాటింగ్ చేయాలి. లేదంటే టీమిండియా ఘోర పరాజయం తప్పదు. సౌతాఫ్రికా విజయానికి 8 వికెట్లు కావాలి. ప్రస్తుతం సౌతాఫ్రికా బౌలర్లు ఉన్న ఫామ్ నేపథ్యంలో భారత ఓటమి పెద్ద కష్టమేం కాదనిపిస్తోంది. ఇప్పటికే పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్నర్లకు అడ్వాంటేజ్‌గా మారింది. ఆఖరి రోజు పిచ్ స్పిన్నర్లకు మరింత అనుకూలంగా మారనుంది.అంతకుముందు 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా 78.3 ఓవర్లలో 260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 288 పరుగులు కలుపుకొని మొత్తం 548 పరుగుల ఆధిక్యం సాధించింది. సఫారీ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్(180 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 94) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. టోనీ డీ జోర్జీ(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 49) హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా ఒక్కడే(4/62) నాలుగు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్(1/67) ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. సెనరన్ ముత్తుసామి(206 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 109) సెంచరీ సాధించగా.. మార్కో జాన్సెన్(91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు.అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్(58), వాషింగ్టన్ సుందర్(48) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. మార్కో జాన్సెన్ 6 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి తప్పించుకోవాలంటే ఈ రోజు మిగిలిన 20 ఓవర్లతో పాటు ఆఖరి రోజు పూర్తిగా బ్యాటింగ్ చేయాలి. లేదంటే ఘోర పరాజయాన్ని భారత్ మూటగట్టుకుంటుంది. ఇప్పటికే ఈ సిరీస్‌లో సౌతాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రా అయినా సిరీస్‌ను ఆ జట్టే కైవసం చేసుకుంటుంది. ఈ క్రమంలోనే భారత జట్టుపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. 549 పరుగుల భారీ లక్ష్యాన్ని చూసి ఈ మ్యాచ్ గెలిచినట్టేనని నిట్టూరుస్తున్నారు. టెస్ట్‌ల్లో టీమిండియా మరో ఘోర పరాజయం తప్పేలా లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సిరీస్‌లో టీమిండియా టాప్ ఆర్డర్ నుంచి మిడిల్ ఆర్డర్ వరకు దారుణంగా విఫలమైంది. సీనియర్ ఆటగాళ్లు కూడా పరుగులు చేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. కేఎల్ రాహుల్ అత్యధిక స్కోరు కేవలం 39 పరుగులు కాగా, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా ఇద్దరి అత్యధిక స్కోరు కూడా 27 పరుగులే. ధ్రువ్ జురెల్ అయితే ఒక్క ఇన్నింగ్స్‌లో కూడా 20 పరుగుల మార్కును దాటలేకపోయాడు. అయితే ఈ సిరీస్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ వాషింగ్టన్ సుందర్. మూడు ఇన్నింగ్స్‌లలో కలిపి 108 పరుగులు (అత్యధికం 48) చేశాడు. సుందర్ ఒక్కడే 100 పరుగుల మార్కును దాటగా, మిగతా స్టార్ బ్యాట్స్‌మెన్‌లు ఎవరూ వంద పరుగులు కూడా చేయలేకపోయారు.

భారత బ్యాట్స్‌మెన్‌లకు సెంచరీ సాధించడం ఈ సిరీస్‌లో ఒక కలగా మారింది. టీమిండియాకు ఇప్పుడు గౌహతి టెస్టులో నాలుగో, ఆఖరి ఇన్నింగ్స్‌లో మాత్రమే బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చివరి ఇన్నింగ్స్‌లో కూడా ఏ ఒక్క భారత బ్యాట్స్‌మెన్ సెంచరీ చేయలేకపోతే, అది ఒక చెత్త రికార్డుగా నమోదవుతుంది. గత 30 సంవత్సరాలలో భారత గడ్డపై జరిగిన టెస్ట్ సిరీస్‌లలో, టీమిండియా తరఫున కనీసం ఒక్క సెంచరీ కూడా నమోదు కాని సందర్భం ఇదే మొదటిసారి అవుతుంది. ఈ రికార్డును తప్పించుకోవాలంటే ఆఖరి ఇన్నింగ్స్‌లో కనీసం ఒక బ్యాట్స్‌మెన్ అయినా సెంచరీ చేయాల్సి ఉంటుంది.

**సంక్షిప్త స్కోర్లు..**

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 489 ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్ 201 ఆలౌట్
సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 260/5 డిక్లేర్డ్
భారత్ రెండో ఇన్నింగ్స్ 27/2





# టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

**ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం**

**మార్చి 8 వరకు కొనసాగింపు**

**బ్రాండ్ అంబాసిడర్‌గా రోహిత్ శర్మ**

భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ వేదికలు ఖరారయ్యాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. అహ్మదాబాద్‌లో మార్చి 8న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే మ్యాచ్ వేదికను మార్చే అవకాశం ఉంది. ఇందుకోసం భారత్‌లో ఐదు, శ్రీలంకలో మూడు వేదికలను ఎంపిక చేశారు. ఈ టీ20 ప్రపంచ కప్ బ్రాండ్ అంబాసిడర్?గా రోహిత్ శర్మను ఎంపిక చేసినట్ల జై షా తెలిపారు.




# స్మృతి మంధాన పెళ్లి వాయిదాపై రూమర్స్



స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ల వివాహంలో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వీరి పెళ్లి వాయిదాపై అనేక రూమర్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ముందుగా అనుకున్నట్లు నవంబర్ 23న వీరి పెళ్లి మహారాష్ట్రలోకి సాంగ్లీలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రీవెడ్డింగ్ షూట్ లో స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ఫుల్ జోష్ గా డ్యాన్స్ లు చేశారు. ఒకరి మెడలో మరోకరు పూల మాలలు కూడా వేసుకున్నారు. మరికొన్ని గంటల్లో పెళ్లి వేడుక జరుగనుంది. ఇంతలో స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ కు గుండెపోటు రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత పెళ్లిని వాయిదా వేస్తున్నట్లు స్మృతి మంధాన కుటుంబ సభ్యులు ప్రకటించారు. మరుసటి రోజు పలాష్ ముచ్చల్ అస్వస్థతకు గురయ్యి వెంటనే కోలుకున్నాడు. ఆ తర్వాత స్మృతి మంధాన తన ఇన్ స్టాలోని వెడ్డింగ్, నిశ్చితార్థంకు సంబంధించిన అన్నిఫోటోలు, వీడియోలను డిలీట్ చేసింది. ఈ క్రమంలో అసలు వీరి మధ్య ఏంజరుగుతుందో అని నెట్టింట అనేక రూమర్స్ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. స్మృతి మంధాన ను.. పలాష్ చీటింగ్ కూడా చేశాడని వార్తలు తెరమీదకు వచ్చాయి. ఈ నేపథ్యంలో పలాశ్ ముచ్చల్ సోదరి, సింగర్ పలాక్ ముచ్చల్ తన ఇన్ స్టా వేదికగా వివరణ ఇచ్చారు.స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ మంధాన అనారోగ్యానికి గురవడంతో ప్రస్తుతానికి స్మృతి, పలాశ్ ల వివాహం నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం రెండు కుటుంబాలుకూడా ఒత్తిడిలో ఉన్నాయని.. ఈ సున్నితమైన పరిస్థితిలో ఇరు కుటుంబాల గోప్యతను గౌరవించాలంటూ, తొందరలోనే అన్ని సమస్యలు పరిష్కరం అవుతాయని ఇన్ స్టాలో పోస్టు పెట్టారు. మరోవైపు వీరి పెళ్లిపై ప్రస్తుతం బిగ్ సస్పెన్స్ నెలకొంది. మొత్తంగా స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ల ఎపిసోడ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా మారింది.

# టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌పై రవిశాస్త్రి ఫైర్



భారత్, సౌతాఫ్రికా మధ్య గౌహతిలో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌పై మాజీ కోచ్, మాజీ కెప్టెన్ రవిశాస్త్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు బ్యాటింగ్ ప్రదర్శన పేలవంగా ఉండటంతో, టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాన్ని శాస్త్రి తప్పుపట్టారు. 489 పరుగుల సౌతాఫ్రికా స్కోరుకు సమాధానంగా భారత్ కేవలం 201 పరుగులకే ఆలౌట్ అయింది. స్టార్ నెట్‌వర్క్‌లో కామెంటరీ ఇస్తున్న రవిశాస్త్రి, భారత జట్టు నిర్ణయాలను ఏ మాత్రం సమర్థించలేదు. “అసలు అర్థం లేదు. ఆ ఆలోచనా విధానం ఏంటో నాకు అర్థం కావడం లేదు” అని ఆయన టీమిండియా పై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌ను తరచూ మార్చడాన్ని ఆయన ప్రశ్నించారు. తొలి టెస్టులో వాషింగ్టన్ సుందర్‌ను నంబర్ 3 స్థానంలో పంపి, రెండో టెస్టులో సాయి సుదర్శన్‌ను నంబర్ 3లో ఉంచి, సుందర్‌ను ఏకంగా నంబర్ 8కి దించడం సరికాదన్నారు. “సుందర్ నంబర్ 8 బ్యాటర్ కాదు, అతను అంతకంటే మెరుగైన ఆటగాడు. ఈ సిరీస్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే, కొన్ని సెలెక్షన్ నిర్ణయాలు ఏ ఉద్దేశంతో తీసుకున్నారో ఇప్పటికీ అర్థం కావడం లేదు” అని శాస్త్రి విమర్శించారు. గతంలో కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు నలుగురు స్పిన్నర్లను ఆడించి, వారిలో ఒక స్పిన్నర్‌కు కేవలం ఒకే ఓవర్ ఇవ్వడాన్ని కూడా శాస్త్రి గుర్తు చేశారు. “అక్కడ నలుగురు స్పిన్నర్లకు బదులు ఒక స్పెషలిస్ట్ బ్యాటర్‌ను ఆడిస్తే బాగుండేది. అలాగే ఇక్కడ సాయి సుదర్శన్ వచ్చాడు కాబట్టి వాషింగ్టన్ సుందర్‌ను నంబర్ 8లో కాకుండా కనీసం నంబర్ 4లో అయినా ఆడించాల్సింది” అని ఆయన సూచించారు. భారత జట్టు బ్యాటింగ్ వైఫల్యం తర్వాత, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ ఎనిమిదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. ఈ భాగస్వామ్యం కారణంగానే భారత్ కనీసం 200 పరుగుల మార్కును దాటగలిగింది. సుందర్ 92 బంతుల్లో 48 పరుగులు చేయగా, కుల్దీప్ 134 బంతుల్లో 19 పరుగులు చేసి వికెట్ పడకుండా పోరాడాడు. అయినప్పటికీ సౌతాఫ్రికా 288 పరుగుల భారీ ఆధిక్యాన్ని తీసుకోవడాన్ని ఆపలేకపోయారు. సౌతాఫ్రికా తరఫున మార్కో జన్సెన్ 6/48తో, సైమన్ హార్మర్ 3/64తో భారత బ్యాటింగ్ పతనానికి కారణమయ్యారు.



# రోహిత్, కోహ్లీ 2027 వరల్డ్ కప్ ఆడాలి

**సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్**

ఇండియా సీనియర్ స్టార్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో పెద్ద చర్చ జరుగుతోంది. 2027 వన్డే వరల్డ్‌కప్ నాటికి వీరిద్దరూ జట్టులో ఉంటారా లేక మేనేజ్‌మెంట్ తప్పిస్తుందా? అనే సందేహాలు అందరిలోనూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రోహిత్, కోహ్లీ ఇద్దరూ 2027 వరల్డ్ కప్ ఆడాలని, వారి అవసరం టీమ్‌ఇండియాకు చాలా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో మాజీ క్రికెటర్లు సచిన్, ధోనీ పేర్లను ప్రస్తావించారు. రోహిత్, కోహ్లీకు ఉన్న అనుభవం, మానసిక దృఢత్వం వెలకట్టలేనివని జాంటీ అన్నారు. “వరల్డ్?కప్ లాంటి మెగా టోర్నీల్లో కేవలం టాలెంట్ ఉంటే సరిపోదు, ఒత్తిడిని తట్టుకునే మానసిక శక్తి కావాలి. అది వీరిద్దరి దగ్గర పుష్కలంగా ఉంది. అందుకే 2027 వరల్డ్ కప్‌లో వీరు ఆడాలని నేను కోరుకుంటున్నాను” అని రోడ్స్ చెప్పుకొచ్చారు. యువ ఆటగాళ్లు ఎంతమంది ఉన్నా, ఇటువంటి భారీ ఈవెంట్లలో సీనియర్ల పాత్రే కీలకమని ఆయన విశ్లేషించారు. రిటైర్మెంట్ ఎప్పుడు తీసుకోవాలి అనే ప్రశ్నపై స్పందిస్తూ రోడ్స్ ఆసక్తికరమైన ఉదాహరణలు ఇచ్చారు. “గతంలో సచిన్ తెందూల్కర్, ఎంఎస్ ధోనీ విషయంలోనూ ఇలాంటి ప్రశ్నలే వచ్చాయి. ఎప్పుడు రిటైర్ అవ్వాలి? ఎప్పుడు ఆడాలి? అనేది పూర్తిగా వాళ్ల ఇష్టం. వాళు పరుగులు చేస్తున్నంత కాలం, ఫిట్‌గా ఉన్నంత కాలం వాళ్లను జట్టులో సెలెక్ట్ చేయాల్సిందే. అనుభవం అనేది మార్కెట్లో దొరికే వస్తువు కాదు” అని రోడ్స్ గట్టిగా సమాధానం ఇచ్చారు. రోహిత్, కోహ్లీ ఇంకా పరుగులు సాధిస్తున్నారని, వారిని పక్కన పెట్టాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక రోహిత్, కోహ్లీ కెరీర్ విషయానికి వస్తే, 2025 మే నెలలో వీరిద్దరూ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అందరికీ షాక్ ఇచ్చారు. ఇంగ్లాండ్‌తో జరగాల్సిన ప్రతిష్టాత్మక ‘ఆండర్సన్ తెందూల్కర్ ట్రోఫీ 2025’కి ముందే వీరు సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ వన్డే ఫార్మాట్‌లో మాత్రమే దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వన్డేలపైనే పూర్తిగా దృష్టి సారించి, 2027 వరల్డ్ కప్ ఆడాలనే కసి వీరిలో కనిపిస్తోంది.మరోవైపు, టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందే రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించి, యువ సంచలనం శుభ్‌మన్ గిల్‌కు పగ్గాలు అప్పగించింది. రోహిత్ ఇప్పుడు ఒక బ్యాటర్‌గా మాత్రమే జట్టులో కొనసాగుతున్నారు. కెప్టెన్సీ భారం లేకపోవడంతో రోహిత్ మరింత స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తాడని, ఇది 2027 వరల్డ్ కప్ మిషన్‌కు ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి జాంటీ రోడ్స్ వ్యాఖ్యలు రోహిత్, కోహ్లీ అభిమానుల్లో కొత్త జోష్ నింపాయి. మరి విరాట్, రోహిత్ ఫ్యూచర్‌పై మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.



# 28న అఖండ-2 ప్రీరిలీజ్ ఈవెంట్


నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబోలో అఖండకు సీక్వెల్ గా వస్తున్న చిత్రం 'అఖండ-2. ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ సంచలనం సృష్టించింది. ఇటీవల వచ్చిన ఈ సినిమా ఫస్ట్ సింగిల్ జాజికాయ జాజికాయ భారీ వ్యూస్ రాబట్టిన ఈ సెన్సేషన్ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. డిసెంబర్ 5న అఖండ 2 వరల్డ్ వైడ్ గా రిలీజ్ కు రెడీ అయింది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో జోరు పెంచింది టీమ్. అందులో భాగంగానే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న నిర్వహించబోయే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా రాబోతున్నారు. ఇందుకు సంబంధించి అనౌన్స్ మెంట్ కూడా రాబోతుంది. అలాగే ఈ వేడుకకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ని కూడా మరో అతిథిగా పిలిచేందుకు ప్లాన్ చేశారట మేకర్స్. కానీ బన్నీ ప్రస్తుతం అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడం వల్ల రావడం కుదరడం లేదట. సినిమా రిలీజ్ అయ్యాక సక్సెస్ మీట్ కి బన్నీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు డిసెంబరు 4న రాత్రి నుంచే ప్రీమియర్లు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గ అనుమతుల కోసం నిర్మాతలు ఎదురు చూస్తున్నారు.

# భాగ్యశ్రీతో డేటింగ్ అంతా ఉత్తిదే

## కొట్టిపడేసిన హీరో రామ్




ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ హీరోయిన్ జంటగా వస్తున్న మూవీ ఆంధ్రాకింగ్ తాలూకా నవంబర్ 27న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ సినిమా మొదలైనప్పటి నుంచి రామ్, భాగ్య శ్రీ డేటింగ్ లో ఉన్నారంటూ ఓ రేంజ్ లో రూమర్లు వస్తున్నాయి. ఇద్దరూ ప్రైవేట్ గా కలుసుకుంటున్నారని.. విదేశాలకు టూర్లకు వెళ్తున్నారంటూ రకరకాల రూమర్లు వస్తూనే ఉన్నాయి. ఇక మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో వరుస ప్రమోషన్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్.. దీనిపై క్లారిటీ ఇచ్చారు. డేటింగ్ రూమర్లు అన్నీ ఫేక్ అంటూ కొట్టి పారేశాడు. భాగ్య శ్రీ తనకు మంచి ఫ్రెండ్ అని క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా కోసం నేను స్వయంగా ఓ లవ్ సాంగ్ రాశాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య ఏదో ఉందని అంతా అనుకుంటున్నారు. భాగ్య శ్రీపై ఇంట్రెస్ట్ లేకుండా ఇంత మంచి సాంగ్ రాయడు కదా అని అంతా అనుకుంటున్నారు. కానీ భాగ్యశ్రీని మా సినిమా కోసం తీసుకోక ముందే ఆ పాట రాశాను. సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రల మధ్య అంత మంచి బాండింగ్ ఉంటుంది కాబట్టే ఆ పాట బాగా వచ్చింది. అంతకు మించి మా మధ్య ఏమీ లేదు. భాగ్య శ్రీ మంచి యాక్టర్ అంటూ చెప్పాడు రామ్. భాగ్య శ్రీ కూడా ఇదే విషయంపై స్పందిస్తూ.. రామ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే అని తెలిపింది. రజనీకాంత్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి చెన్నైలో పెరిగాను. ఆయన సినిమాలన్నీ చూసేవాడిని. 'బాషా' సినిమా అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సినిమాకు 100వ రోజు కూడా టికెట్స్ దొరకలేదు. చివరి నిమిషంలో రెండు టికెట్స్ దొరికాయి. దీంతో నేను మా ఫ్రెండ్ వెళ్లాం. ఆరోజు థియేటర్‌లో అభిమానులు ఆ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడం చూసి ఆశ్చర్యపోయాను. అప్పటికే వాళ్లు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి ఉంటారు. డైలాగులు కూడా తెలిసిపోయి ఉంటాయి. అయినా అందరూ ఆసక్తిగా చూడడం చూసి నేను షాకయ్యానని రామ్ తెలిపాడు. ఎవరైనా సక్సెస్ కావాలంటే వారికి రెండు ప్రధాన కారణాలు ఉంటాయి. ఎవరికి వారు తాము చేసే పని మీద శ్రద్ధ కలిగిఉండాలి. అలాగే దానికోసమే పుట్టాం అనిపించేలా చాలా కష్టపడాలి. నాకు ఆ రెండు లక్షణాలు ఉన్నాయి. అందుకే ఎప్పటికైనా విజయం సాధిస్తాననే నమ్మకం ఉందన్నాడు.



# వారణాసి లెవల్లో ఎన్టీఆర్-నీల్ మూవీ ప్రమోషన్?

వారణాసి మూవీ టైటిల్‌ను భారీ ఈవెంట్ ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. భారతీయ సినిమా ప్రమోషన్స్‌కు ఇది కొత్త నిర్వచనంగా మారింది. ఈ వినూత్న ప్రయత్నం దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, హాలీవుడ్ మీడియా దృష్టిని కూడా ఆకర్షించి గ్లోబల్ లెవెల్‌లో పెద్ద చర్చగా మారింది. సాధారణంగా టైటిల్స్‌ను పోస్టర్, గ్లింప్స్ లేదా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ప్రకటిస్తారు. కానీ వారణాసి యూనిట్ మాత్రం పాత్రలు, కథ, థీమ్ వివరించే క్రమంలో స్టేజ్ ఈవెంట్ ఏర్పాటు చేసి ప్రమోషన్‌లో కొత్త మైలురాయి సృష్టించింది. దీనికి మంచి రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ఇదే స్ట్రాటజీని ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న సినిమాకి ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీ టైటిల్‌పై భారీ ఆసక్తి నెలకొనగా, మూవీకి డ్రాగన్ అనే పేరు ఖరారు చేసినట్టు టాక్ వినిపిస్తుంది. అయితే డ్రాగన్' పేరు ఇంకా నిర్ధారణ కాలేదని మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ రవి శంకర్ స్పష్టం చేశారు. 'డ్రాగన్ కూడా ఓ ఆప్షన్ మాత్రమే. అధికారికంగా ఏ టైటిల్ ఫైనల్ కాలేదు. ఇది పూర్తిగా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్. ప్రశాంత్ నీల్ విజన్‌లో ఎన్టీఆర్ కొత్త అవతరం చూపించ బోతున్నాడు. టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ వారణాసి మాదిరిగానే ప్రాజెక్ట్‌కి తగ్గ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తామని తెలిపారు. ఫిల్మ్ ప్రమోషన్‌లో భారీ ఈవెంట్ మోడల్ ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తోంది. సినిమా థీమ్‌ను స్పష్టంగా ప్రేక్షకులకు చెప్పే అవకాశం కలుగుతుంది. ఇలా చేస్తే గ్లోబల్ ఆడియన్స్‌ను చేరుకునే అవకాశం ఉంటుంది. హాలీవుడ్ మీడియా సహా విదేశీ ప్రెస్ అటెన్షన్, తక్కువ సమయంలో భారీ బజ్ క్రియేట్ చేయగలగడం, కంటెంట్‌పై తప్పుదారులు వెళ్లకుండా క్లారిటీ ఇవ్వడం కొత్త ట్రెండ్‌ను ఆమోదించేలా చేశాయి. వారణాసి ఈవెంట్ తర్వాత భారతీయ సినీ పరిశ్రమలో 'టైటిల్ రివీల్ ఈవెంట్' అనే కొత్త ప్రమోషనల్ ట్రెండ్ ప్రారంభమైంది. అదే మోడ్‌లో ఎన్టీఆర్-నీల్ ప్రాజెక్ట్ కూడా అడుగులు వేస్తుండటం అభిమానుల్లో భారీ అంచనాలను పెంచింది.



# 28న నెట్‌ఫ్లిక్స్‌లో మాస్ జాతర రిలీజ్

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా కనిపించిన ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహించాడు. అక్టోబరు 31న ప్రీమియర్స్ తో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. కానీ ప్రీమియర్ షో నుండే ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. రొటీన్ రెగ్యులర్ కథ, బోరింగ్ స్క్రీన్ ప్లేతో ఆడియెన్స్ కు విసుగుతెప్పించాడు దర్శకుడు. రాజేంద్ర ప్రసాద్ క్రింజ్ కామెడి నవ్వుతెప్పించకపోగా విసిగించింది. కనీసం మినిమం వసూళ్లు కూడా రాబట్టలేక రవితేజ కెరీర్ లో మరో డిజాస్టర్ గా మిగిలింది. రిలీజ్ కు ముందే మాస్ జాతర డిజిటల్ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. థియేటర్ లో ఫ్లాప్ అయినా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ నెల 28 నుండి నెట్ ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురాబోతుంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో ఈ సినిమాను స్ట్రీమింగ్ తీసుకువస్తుంది నెట్ ఫ్లిక్స్. థియేటర్ లో రిలిజ్ అయిన 28 రోజుల తర్వాత మాస్ జాతర ను స్ట్రీమింగ్ చేస్తుంది నెట్ ఫ్లిక్స్.

# రాజాసాబ్ పాటకు భారీగా వ్యూస్..లైక్స్

## మూవీపై నిర్మాతల్లో పెరిగిన విశ్వాసం

ప్రభాస్ హీరోగా పాన్ ఇండియా సినిమా ది రాజా సాబ్ పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. గత ఏడాది కల్కితో వరల్డ్‌వైడ్ బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న ప్రభాస్ సినిమాపై అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి రిలీజ్‌గా ఈ సినిమా సిద్ధమవుతుండటంతో హైప్ మరింత పెరిగింది. ఇదిలా ఉండగా, చిత్రబృందం నుంచి వచ్చిన తొలి పాట నవంబర్ 23 విడుదలైంది. కొంత ఆలస్యంగా వచ్చినప్పటికీ, ఆన్‌లైన్‌లో పాటకు మంచి స్పందన లభించింది. టాప్ రికార్డులను బద్దలు కొట్టకపోయినా,ఈ పాటకు వచ్చిన వ్యూస్, లైక్స్ మాత్రం ఆకట్టుకునే స్థాయిలో ఉన్నాయి. విడుదలైన తొలి 24 గంటల్లో ఈ పాటకు దాదాపు 14.92 మిలియన్ వ్యూస్, 335.4ఐ లైక్స్ వచ్చాయి. ఇది పెద్ద రికార్డ్ కాకపోయినా, ఆలస్యంగా వచ్చిన పాటకు ఇవి గుడ్ నెంబర్స్‌గా పరిగణిస్తున్నారు. ప్రభాస్ తాజాగా చేసిన సినిమాలతో పోలిస్తే, ఈ పాటలో ఆయన లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగుందని నెటిజన్లు పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా, పాట యూట్యూబ్‌లో విడుదలైన తర్వాత కేవలం 23 నిమిషాల్లో 100ఐ లైక్స్ చేరుకోవడం పాటకు వచ్చిన వేగవంతమైన రెస్పాన్స్‌ను సూచిస్తోంది. ఇది ప్రభాస్ క్రేజ్‌కి నిదర్శనమని అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. పాట విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీనింగ్‌కు భారీగా అభిమానులు హాజరై మాస్ సెలబ్రేషన్స్ చేశారు. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. దీంతో 'ది రాజా సాబ్'పై అంచనాలు మరింతగా పెరిగాయి. త్వరలో రానున్న ట్రైలర్, మిగతా పాటలు ఎలా ఉండబోతున్నాయి, సంక్రాంతి సీజన్‌లో ఈ సినిమా ఎంతటి మాస్ స్టార్మ్ సృష్టించబోతుందో అనే ఆసక్తి పెరుగుతోంది.




CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861